www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 20-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :22 సంచిక (Issue) : 174 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 9.15 తదుపరి చవితి; నక్షత్రం: అశ్విని రా. 2.43 తదుపరి భరణి; వర్జ్యం: రా.11.08-12.34; దుర్ముహూర్తం: ఉ.8.31-9.19, మ.12.32-1.20; అమృతఘడియలు: రా.8.16-9.42; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.09 | వరంగల్

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గోవాలో జానీ మాస్టర్ అరెస్టు



నేడు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు

నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన జానీమాస్టర్ భార్య ఆయేషా 14

తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన గొప్పది. ఆయన మంచి విజన్ ఉన్న సమర్థ నాయకుడు. అందుకే యూనివర్సిటీ బోర్డు చైర్మన్‌గా ఉండాలని కోరగానే ఒప్పుకొన్నా.

- ఆనంద్ మహీంద్రా

సచివాలయంలో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో సమావేశంలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు, వర్సిటీ బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా



స్కిల్ వర్సిటీని

మీరే నడపాలి!

మీ చేతుల్లో పెడుతున్నా.. మీ బ్రాండ్ వాల్యూను యూనివర్సిటీకి తీసుకురావాలి

వర్సిటీ బోర్డు చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాతో సీఎం రేవంత్‌రెడ్డి

సచివాలయంలో బోర్డు ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం

యూనివర్సిటీ కార్పస్‌కు సహకరించాలి

భవన నిర్మాణాల్లో భాగస్వాములు కావాలి

శిక్షణ పొందిన వాళ్లకు మీరే ఉద్యోగాలివ్వాలి

స్పోర్ట్స్ వర్సిటీకి బడ్జెట్లో వెయ్యి కోట్లు!: సీఎం

వచ్చే నెల నుంచే గచ్చిబౌలిలో స్కిల్ తరగతులు

హెల్త్ కేర్, లాజిస్టిక్స్, ఈ-కామర్స్‌లో కోర్సులు

2 నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు

అర్హులైన వారందరికీ ఇవ్వాలి: సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిశ్రామికవేత్తలు, అధికారులకు పిలుపు నిచ్చారు. ఆ బాధ్యతను యూనివర్సిటీ బోర్డుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డు ప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్సిటీ బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, కో చైర్మన్ శ్రీనిరాజు, బోర్డు సభ్యులు పి.దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,

మిగతా 13వ పేజీలో...

నేడు క్యాబినెట్ భేటీ

తెలుగు వర్సిటీకి సురవరం, మహిళా వర్సిటీకి ఐలమ్మ,

హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ సంస్థకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు 13

'హైడ్రా'కు అధికారాలపై ఆర్డినెన్స్, బీసీ కుల గణనపై చర్చ

2 నుంచి బడులకు దసరా సెలవులు.. 15న పునఃప్రారంభం

బాధ్యులపై కఠిన చర్యలు

గత ప్రభుత్వంలో తిరుమల అపవిత్రం

భక్తుల మనోభావాలను దెబ్బతీశారు

ప్రక్షాళన ప్రారంభించాం: చంద్రబాబు

ఇదేం ఘోరం

గోవిందా!



శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ (ఫైల్)

శ్రీవారి లడ్డూలో కొవ్వు.. నిజం

భక్తుల ఇష్ట ప్రసాదం భారీ కల్తీ.. తయారీకి నాసిరకం నెయ్యి

'తిరుమల'నూ వదలని వైసీపీ భ్రష్టత్వం.. తేల్చిన కేంద్రం లేబరేటరీ

నెయ్యి నాణ్యతపైనే తొలి నుంచి అనుమానాలు

కర్ణాటక నందినీ నెయ్యి అర్ధంతరంగా నిలిపివేత

ఐదు కంపెనీలకు 'రివర్స్'లో కాంట్రాక్టు

నాణ్యత, రుచి లేవని అప్పటి నుంచే భక్తుల ఫిర్యాదు

ఆ కంపెనీల నెయ్యిలో బయటపడ్డ జంతువుల కొవ్వు

వ్యవస్థల ప్రక్షాళనను టీటీడీతో మొదలుపెట్టిన చంద్రబాబు

నెయ్యి పరీక్షలు.. భారీగా కల్తీ నిర్ధారణ.. 'నందినీ' పునరుద్ధరణ

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శ్రీవారి లడ్డూ ప్రసాదమంటే ఎంతో ప్రీతిపాత్రంగా భావిస్తుంటారు. హిందూ భక్తులకు అది అత్యంత ఇష్ట ప్రసాదం. అలాంటి పవిత్రమైన ప్రసాదంలో ఎద్దు, పంది తదితర జంతువుల కొవ్వు పదార్థాలతో కల్తీ అయిన నెయ్యిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వినియోగించారని తేలడం శ్రీవారి భక్తకోటిని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో లడ్డూ ప్రసాదం రుచి తగ్గిందన్న విమర్శలు, ఆరోపణలు మొదలయ్యాయి. తర్వాత ఇతర అన్న ప్రసాదాల విషయంలోనూ అవే తరహా ఆరోపణలు, ఫిర్యాదులు

మిగతా 12వ పేజీలో...

టీటీడీకి ఇచ్చే నెయ్యిలో చేప నూనె

గొడ్డు కొవ్వు, పంది కొవ్వు, మైదానూ కలిపారు

కమీషన్లకు కక్కుర్తిపడే వైసీపీ నేతల అక్రమాలు

జగన్, కరుణాకర్, సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిలను ఉరి తీయాలి

టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ధ్వజం

నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు నివేదికలు విడుదల

12

ఇందిరమ్మ ఇళ్లకు దారి సుగమం!



10 రోజుల్లో విధివిధానాలు.. అధికారుల కసరత్తు

పీఎంఏవైకి అనుసంధానించాలని నిర్ణయం 13

బిట్టు తల తెస్తే నా ఆస్తి రాసిస్తా



ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

రాహుల్ ఉగ్రవాది అంటూ కేంద్ర మంత్రి రవనీత్ బిట్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఫైర్

బీజేపీ నేతలు ఇష్టారీతిన మాట్లాడుతుంటే కేంద్ర హోం శాఖ ఏం చేస్తోందని ప్రశ్న

జమిలిపై త్వరలో కమిటీ

47కు 32 పార్టీలు మద్దతు తెలిపాయి

మిగతా పార్టీలూ త్వరలో ముందుకొస్తాయి

జమిలితో ఆర్థిక భారం తగ్గుతుంది..

ఇతర సమస్యలూ పరిష్కారమవుతాయి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 14



ఎంపీ రఘునందన్‌రావుకు.. కోర్టు ధిక్కరణ నోటీసులు

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్టేటస్‌కో ఇవ్వడాన్ని విమర్శించిన ఎంపీ

హైకోర్టు జడ్జి లేఖతో సుమోటోగా స్వీకరించిన సీజే ధర్మాసనం

వివరణ ఇవ్వాలంటూ ఎంపీకి నోటీసులు

'రింగు'కు కమిటీ..

ఇరువైపులా ఐటీ!

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంపై ఉన్నతస్థాయి కమిటీ

ఒక ఐఏఎస్, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు

మనమే నిర్మిద్దామా.. కేంద్రానికి ఇద్దామా?

అలైన్‌మెంట్, భూ సేకరణ, పరిహారం చెల్లింపుపై సర్కారు అధ్యయనం

రోడ్డుకిరువైపులా ఐటీ, పారిశ్రామిక హబ్‌లు

సేకరించిన భూముల్లో రైతులకూ వాటా!



హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రహదారి నిర్మాణంపై ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక ఐఏఎస్ అధికారి నేతృత్వంలో రోడ్లు, భవనాలు, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్తు శాఖతో పాటు మరికొన్ని శాఖల అధికారులతో ఈ కమిటీని వేయనున్నారు. దక్షిణ భాగం రింగ్ రోడ్డును ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) తరహాలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ), హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హెచ్ఏఎం), బిల్డ్- ఆపరేట్-టోల్ (బీవోటీ) పద్ధతుల్లో నిర్మిస్తే ఎలా ఉంటుంది? ఈ మూడింటిలో ఏ పద్ధతి మేలు? అన్నదానిపై కమిటీ అధ్యయనం చేయనుంది. మరోవైపు దక్షిణ భాగం రింగుకే ఐటీ, పారిశ్రామిక హంగులను కూడా అద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం రోడ్డు పొడవునా ఇరువైపులా భూములను సమీకరించి అభివృద్ధి చేసి అక్కడ ఐటీ, పారిశ్రామిక హబ్‌లను

మిగతా 14వ పేజీలో...



బీఆర్ఎస్ నేత భవనం కూల్చివేత

అనుమతులు ఓ చోట.. నిర్మాణం అసైన్డ్ భూమిలో

2 సార్లు నోటీసులిచ్చినా స్పందించని వైనం

మంచిర్యాలలో 5 అంతస్తుల భవంతి కూల్చివేత 14

మునిసిపాలిటీల్లోనూ హైడ్రా!

ప్రభుత్వానికి సంబంధిత శాఖ ప్రతిపాదన

నేటి మంత్రివర్గ భేటీలో చర్చకు అవకాశం 14

ఆపరేషన్ హిమాయత్‌సాగర్!

జలాశయంలో 83 ఆక్రమణల గుర్తింపు

ఒకటి, రెండు రోజుల్లో కూల్చివేయనున్న హైడ్రా

ఉన్నతాధికారులతో చర్చించిన రంగనాథ్

ఏపీలో కూడా హైడ్రా తరహా చట్టం

కౌలు రైతు, యజమాని మాట్లాడుకోవాలి

'రైతు భరోసా'పై వ్యవసాయ మంత్రి తుమ్మల.. పంట పండించే వారికే ఆర్థిక చేయూత ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఆలోచనని వెల్లడి

ఢిల్లీలో కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ

12 ప్రపంచ ఆహార సదస్సులో వ్యాపారవేత్తలతో సమావేశం

స్టేట్ డేటా సెంటర్ సర్వర్ డౌన్

రిజిస్ట్రేషన్, ధరణి సేవలు బంద్

'మీ సేవ'ల్లోనూ అదే పరిస్థితి

పది రోజులుగా సమస్యలున్నా స్పందించని అధికారులు 13

ఏబీసీ చైర్మన్‌గా మనోరమ డైరెక్టర్ మ్యాథ్యూస్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: పత్రికల సర్క్యులేషన్‌లను ధ్రువీకరించే ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్(ఏబీసీ) సంస్థ చైర్మన్‌గా మళయాళ మనోరమ గ్రూప్ సంస్థల డైరెక్టర్, పత్రిక చీఫ్ అసోసియేట్ ఎడిటర్ రియాద్ మ్యాథ్యూస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన 2024-25 సంవత్సరానికి ఏబీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డిప్యూటీ చైర్మన్‌గా ప్రకటన కర్తల నుంచి ఐటీసీ కరుణేశ్ బజాజ్, కార్యదర్శిగా టైమ్స్ గ్రూప్ ప్రతినిధిగా మోహిత్ జైన్, కోశాధికారిగా ప్రకటనకర్తల నుంచి మ్యాడిసన్ ప్రతినిధి విక్రమ్ షకూజా ఎన్నికయ్యారు. చైర్మన్ మ్యాథ్యూస్ 2009 ఆగస్టు నుంచి ఆయన పీటీఐ వార్తాసంస్థ డైరెక్టర్ల బోర్డు సభ్యుడిగా కూడా ఉన్నారు. 2016-17 మధ్య కాలంలో పీటీఐ చైర్మన్‌గా పని చేశారు. వియన్నాలోని ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్నారు. మేరీల్యాండ్ విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో మాస్టర్స్ చేసిన ఆయన వాషింగ్టన్ పోస్ట్, వాషింగ్టన్ టైమ్స్, క్యాపిటల్ న్యూస్ సర్వీస్ తదితర సంస్థల్లో పని చేశారు.

హరియాణా కాంగ్రెస్ పార్టీదే..

- ప్రతి మూడు స్థానాలకు రెండింటిలో బీజేపీకి ఓటమే
- రాహుల్‌కు పెరుగుతున్న ఆదరణ: కేకే సర్వే కిరణ్ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందని.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 164 సీట్లు గెలుస్తుందని.. వైసీపీ 11 సీట్లకే పరిమితం అవుతుందని అత్యంత కచ్చితంగా చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటి హరియాణా ఎన్నికలపైనా తమ అంచనాలను వివరించారు. వచ్చే నెలలో జరుగనున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలిపారు. హస్తం పార్టీకి 100% విజయావకాశాలు ఉన్నాయని తమ సర్వేలో వెల్లడైనట్లు చెప్పారు. హరియాణా సహా రాబోయే మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ వందకు వంద శాతం ఓడిపోతుందని స్పష్టం చేశారు. ఈ రాష్ట్రాలలో బీజేపీని మునిగిపోతున్న టైటానిక్‌గా అభివర్ణించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కిరణ్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. హరియాణాలో పోటీ చేసే ప్రతి మూడు స్థానాల్లో బీజేపీ రెండింటిలో ఓడిపోతుందని తెలిపారు. రైతులు, జాట్‌లు ఆ పార్టీపై వ్యతిరేకంగా ఉన్నారన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత కాంగ్రెస్‌కు కలిసి రానుందని వివరించారు. హరియాణాలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకపోవడం ఆమ్‌ఆద్మీ పార్టీకి నష్టం చేకూర్చనుందని తెలిపారు. దేశవ్యాప్తంగా రాహుల్‌కు ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు.. హరియాణాలో బీజేపీ, కాంగ్రెస్ నేతలకు రెబల్ అభ్యర్థులు గుబులు రేపుతున్నారు. టికెట్ దక్కకపోవడంతో పలువురు ప్రముఖులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు.

సీపీఎం తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్?

- పోటీలో ఏపీకి చెందిన బీవీ రాఘవులు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎవరిని నియమించాలన్న విషయమై ఆ పార్టీలో అంతర్గతంగా ముమ్మర చర్చలు జరుగుతున్నాయి. సీతారాం ఏచూరి మృతితో పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఖాళీ అయిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఎవరికి ఆ బాధ్యతలు అప్పగించాలన్నదానిపై పార్టీ నేతలు చర్చిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తమిళనాడులో జరగనున్న సీపీఎం మహాసభల్లో పార్టీ నూతన కార్యదర్శి ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో అప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించాలంటూ పార్టీ పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ.. సీనియర్ నేత, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్‌ను అభ్యర్థించే అవకాశాలున్నాయి. మరోవైపు పార్టీ పొలిట్‌బ్యూరోలో ఉంటూ అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీవీ రాఘవులు, కేరళకు చెందిన బేబీ లేదా విజయ రాఘవన్, బెంగాల్‌కు చెందిన నీలోత్పల్ బసు, మహారాష్ట్రకు చెందిన అశోక్ ధావళే ప్రధాన కార్యదర్శి రేసులో ఉన్నారు.

విపక్షనేతలకు స్టాండింగ్ కమిటీల బాధ్యతలు

- థరూర్‌కు విదేశీ వ్యవహారాలు, దిగ్విజయ్‌కు విద్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు పలు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు నేతృత్వం వహించనున్నారు. శశిథరూర్ విదేశీ వ్యవహారాలు, విద్యకు సంబంధించిన పానెల్‌కు దిగ్విజయ్ సింగ్, వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీకి పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ, గ్రామీణాభివృద్ధి ప్యానెల్‌కు కోరాపూట్ ఎంపీ సప్తగిరి ఉలాకా నేతృత్వం వహిస్తారు. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేశ్, లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాక ఈ పేర్లను ప్రకటించినట్లు తెలిసింది. పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా జైరాం రమేశ్ కొనసాగుతారు.

మూర్ఖుల స్వర్గంలో ఉండి మాట్లాడుతున్నారు..

- రాహుల్‌పై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పరోక్ష విమర్శలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మరోసారి మండిపడ్డారు. విదేశాల్లో భారత సంస్థలను కించపరిచేలా మాట్లాడేవారిని ఎవరూ మెచ్చుకోరని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. వారు మూర్ఖుల స్వర్గంలో ఉండి మాట్లాడుతున్నారని.. అసలు భారత్ మారిందనే విషయాన్ని మర్చిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. గురువారం సంసద్ టీవీ కార్యక్రమంలో ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. 'మన నాయకుడిని దూషిస్తున్నారు. మన సంస్థల వైపు వేలెత్తి చూపిస్తున్నారు. దేశంలోనూ.. దేశం బయటా ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని ఎవరైనా ప్రశంసించగలరా..?' అని వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్‌కు భారత ఆయుధాలు?

- ఇటలీ, చెక్ రిపబ్లిక్ నుంచి మళ్లింపు!
- రాయిటర్స్ నివేదికలో వెల్లడి.. ఖండించిన భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: భారత్‌లో తయారవుతున్న ఆయుధాలు ఉక్రెయిన్‌కు చేరుతున్నాయా? భారత్ నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకునే పలు ఐరోపా దేశాలు.. అక్రమంగా వాటిని ఉక్రెయిన్‌కు అందజేస్తున్నాయా? ఈ అంశంపై రష్యా ఇప్పటికే పలుమార్లు భారత్‌ను అప్రమత్తం చేయగా.. రాయిటర్స్ తాజా నివేదిక ఒకటి ఈ వాదనలను బలపరుస్తోంది. నిజానికి భారత్ దిగుమతి చేసుకునే ఆయుధాల్లో 60% రష్యాకు చెందినవే. అయితే.. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌లోని పలు కంపెనీలు తయారు చేస్తున్న ఆయుధాలు, ఆర్టిలరీ షెల్స్, తూటాలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ కోవలో ఐరోపాలోని చెక్ రిపబ్లిక్, ఇటలీ వంటి దేశాలు భారత్ నుంచి షెల్స్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఆ దేశాల నుంచి ఆయుధాలను తీసుకుంటున్న ఉక్రెయిన్.. వాటిని రష్యాతో పోరులో విరివిగా వినియోగిస్తోందని రష్యా ముందునుంచీ ఆరోపిస్తోంది. జూలైలో ఇరు దేశాల విదేశాంగ మంత్రుల మధ్య జరిగిన చర్చల్లోనూ ఈ అంశం ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చిన విషయం తెలిసిందే..! రాయిటర్స్ తాజా నివేదికను బట్టి.. ఉక్రెయిన్ గత ఏడాది కాలంగా భారత తయారీ ఆర్టిలరీ షెల్స్‌ను వినియోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇటలీ, చెక్ రిపబ్లిక్, స్పెయిన్ నుంచి ఉక్రెయిన్‌కు భారత ఆయుధాలు అంది ఉంటాయని పేర్కొంది. దీనిపై ఉక్రెయిన్, ఇటలీ, స్పెయిన్, చెక్ రిపబ్లిక్ రక్షణశాఖ వర్గాలను ప్రశ్నించగా.. వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని రాయిటర్స్ వెల్లడించింది. అయితే.. రాయిటర్స్ నివేదికను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తప్పుబట్టింది. ఈ నివేదిక కేవలం కల్పితమేనని, తప్పుదోవ పట్టించేవిధంగా ఉందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జమిలి ఎన్నికలు ఓ పార్టీ దురాశ: స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నించడం గర్హనీయమని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. జమిలిఎన్నికలు అసాధ్యమని, ఓ పార్టీ దురాశతో ప్రజాస్వామ్యాన్ని వంచించాలని ప్రయత్నిస్తోందని గురువారం ఒక ప్రకటన ఆగ్రహం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రస్తుతమున్న రాష్ట్రాల పరిపాలనా కాలాన్ని కలంపోటుతో పూర్తిగా రద్దు చేయాలని కేంద్రం భావిస్తోందన్నారు. ఈ ప్రతిపాదనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. కేంద్ర పాలకులు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంపై దృష్టి సారించాలని స్టాలిన్ సూచించారు.

5డీ క్రిస్టల్ మెమొరీలో మానవ జీనోమ్

- యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ పరిశోధకుల ఘనత
- భవిష్యత్తులో మానవజాతి అంతరించిపోతే.. మళ్లీ సృష్టించడానికి వీలుగా క్రిస్టల్‌లో జన్యుసమాచారం



లండన్: స్టీవెన్ స్పీల్‌బర్గ్ తీసిన 'జురాసిక్ పార్క్(1993)' సినిమా కథ గుర్తుందా? చెట్టు జిగురులో ఇరుక్కుపోయిన ఒక దోమ నుంచి డైనోసార్ డీఎన్‌ఏను సేకరించి.. క్లోనింగ్ ద్వారా రాక్షసబల్లులను సృష్టిస్తారు ఆ సినిమాలో! అలా అంతరించిపోయిన డైనోసార్లలాగానే.. ఎప్పటికైనా మనుషులు కూడా అంతరించిపోతే? అచ్చం ఆ సినిమాలో లాగానే మనుషులను మళ్లీ మానవజాతిని పునఃసృష్టించడానికి వీలుగా సౌతాంప్టన్ వర్సిటీ పరిశోధకులు పూర్తిస్థాయి హ్యూమన్ జీనోమ్‌ను ఒక '5డీ మెమొరీ క్రిస్టల్‌'లో భద్రపరిచారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో.. కేవలం జెనెటిక్ సమాచారాన్ని ఉపయోగించి మానవులను కృత్రిమంగా సృష్టించలేం. కానీ, భవిష్యత్తులో ఆ స్థాయి టెక్నాలజీ ఉన్న జీవులుగానీ.. యంత్రాలుగానీ.. అంతరించిన మానవజాతిని మళ్లీ సృష్టించాలని భావిస్తే ఈ సమాచారం వారికి/వాటికి ఉపయోగపడుతుందనే ఆశాభావంతో ఈ క్రిస్టల్‌ను తయారుచేశారు. దీన్ని 'మెమొరీ ఆఫ్ మ్యాన్‌కైండ్ ఆర్కైవ్' అనే ప్రత్యేక టైమ్ క్యాప్సూల్‌లో భద్రపరుస్తున్నారు. ఈ టైమ్ క్యాప్సూల్ ఆస్ట్రియాలోని హాల్‌స్టాట్ సాల్ట్‌కేవ్‌లో ఉంది. ఇతర డేటా స్టోరేజ్ ఫార్మాట్లలో భద్రపరచిన డేటా కాలం గడిచేకొద్దీ డీగ్రేడ్ అవుతుందని.. కానీ, ఈ మెమొరీ క్రిస్టల్‌లో భద్రపరిచిన డేటా కొన్ని వందల కోట్ల సంవత్సరాల వరకూ భద్రంగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. "1000 డిగ్రీల సెల్సియస్ దాకా ఉష్ణోగ్రతను.. గడ్డకట్టించే చలిని.. మంటలను సైతం ఈ క్రిస్టల్ తట్టుకోగలదు. చదరపు సెంటీమీటరుకు 10 టన్నుల తాకిడిని సైతం భరించగలదు. దీర్ఘకాలంపాటు రేడియోధార్మికతకు గురైనా దీనికి ఏమీ కాదు. ఒక్క 5డీ మెమొరీ క్రిస్టల్‌లో 360 టెరాబైట్ల దాకా సమాచారాన్ని దాచవచ్చు" అని వారు వివరించారు. సౌతాంప్టన్ వర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేసిన ఈ 5డీ మెమొరీ క్రిస్టల్.. 'మోస్ట్ డ్యూరబుల్ డేటా స్టోరేజ్ మెటీరియల్‌'గా 2014లో గిన్నిస్ రికార్డు సాధించింది.

లోకం తీరు



ఆ పార్టీలది పాక్ ఎజెండా

370 పునరుద్ధరణా?.. భూమ్మీద ఏ శక్తీ చేయలేదు

- కాంగ్రెస్, ఎన్‌సీపై మోదీ ఫైర్
- కశ్మీరు భవితను నిర్దేశించే ఎన్నికలివి
- అధికారం తమ జన్మహక్కని ఆ మూడు కుటుంబాల భావన
- ఎన్నికల ప్రచారంలో ప్రధాని ధ్వజం



రోడ్ షోలో పాల్గొన్న ప్రధాని మోదీ

శ్రీనగర్, సెప్టెంబరు 19: ఈ భూమ్మీద ఏ శక్తీ జమ్మూకశ్మీరుకు 370 అధికరణను పునరుద్ధరించలేదని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)లు పాకిస్థాన్ ఎజెండాను అనుసరిస్తున్నాయని విమర్శించారు. హింస, అశాంతే ఆ ఎజెండాగా పేర్కొన్నారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370, 35ఏ అధికరణలను, రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న అంశాలపై తమ ప్రభుత్వం, కాంగ్రెస్-ఎన్‌సీ కూటమి ఒకే వైఖరితో ఉన్నాయని.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమి గెలిచే అవకాశాలు అత్యధికంగా కనిపిస్తున్నాయని పాక్ రక్షణ మంత్రి ఖవజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని తీవ్ర స్థాయిలో స్పందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం శ్రీనగర్, కత్రా సభల్లో ప్రసంగించారు. 'కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటూ ఎన్‌సీ, పీడీపీల మేనిఫెస్టోల అమలుకు అవకాశం కల్పిస్తుంది. 370ని పునరుద్ధరించి మళ్లీ హింస, రక్తపాతాల కాలం తీసుకొస్తామని ఆ పార్టీలు హామీ ఇస్తున్నాయి. కాంగ్రెస్-ఎన్‌సీ పొత్తుపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కానీ పొరుగుదేశం మాత్రం తెగ సంతోషిస్తోంది. ఆసిఫ్ వ్యాఖ్యలతో కాంగ్రెస్, ఎన్‌సీ బండారం బయటపడింది' అని చెప్పారు. ఈ ఎజెండాతోనే జమ్మూకశ్మీరులో పలు తరాలను నాశనం చేసి నెత్తుటేర్లలో ముంచింది. పాక్‌కు తీవ్ర హెచ్చరిక చేస్తున్నా.. దాని ఎజెండాను ఇక్కడ అమలు కానివ్వం. భూమ్మీద ఏ శక్తీ 370ని తిరిగి తీసుకురాలేదు' అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ కుటుంబ పార్టీలని.. ఎలాగైనా అధికారం హస్తగతం చేసుకోవడం తమ జన్మహక్కుగా ఆ మూడు కుటుంబాలు భావిస్తాయని చెప్పారు. యువతను విద్య, ఉపాధికి దూరం చేసి.. రాళ్ల వారి చేతుల్లో పెట్టారని మండిపడ్డారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం యువత భవితను నాశనం చేశాయన్నారు. అవి మరో తరాన్ని నాశనం చేయడాన్ని తాను అనుమతించనని శపథం చేశారు. 'ఈ కేంద్ర పాలిత ప్రాంతమంతటా స్కూళ్లు, కాలేజీలు సజావుగా నడుస్తున్నాయి. పిల్లల చేతుల్లో పుస్తకాలు, కలాలు, ల్యాప్‌టా‌ప్‌లు ఉంటున్నాయి. స్కూళ్లలో కాల్పులు జరిగాయన్న వార్తలు ఇవాళ లేవు. కొత్త పాఠశాలలు, కళాశాలలు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు, ఐఐటీలు నిర్మిస్తున్నాం. అందుకే ఈ మూడు కుటుంబాలను ఇప్పటి యువత సవాల్ చేస్తోంది. వాటికి వ్యతిరేకంగా గళం విప్పగలుగుతోంది. కశ్మీరు యువతకు ఉపాధి అవకాశాల కల్పన మోదీ లక్ష్యం, హామీ' అని స్పష్టం చేశారు.

రాహుల్, పాకిస్థాన్ ఒక్కటే: బీజేపీ

పాక్ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విరుచుకుపడ్డారు. ఇది కాంగ్రెస్ వైఖరిని బట్టబయలు చేసిందని.. ఆ పార్టీ జాతి వ్యతిరేకత శక్తులతోనే తరచూ కలిసి పని చేస్తుంటుందని ఆరోపించారు. వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రయిక్స్‌కు రుజువులు అడగడం.. భారత సైన్యం గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంలో రాహుల్‌గాంధీ, పాక్‌ల వాణి ఎప్పుడూ ఒకటేనన్నారు. 370 అధికరణ ముగిసిన అధ్యాయమని.. దానిని తిరిగి తీసుకురావడం ఎవరి తరమూ కాదని తేల్చిచెప్పారు.

మోదీ అమెరికా పర్యటనలో ట్రంప్‌తో భేటీపై సస్పెన్స్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ప్రధాని మోదీ ఈ నెల 21 నుంచి అమెరికాలో జరిపే పర్యటనలో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను కలుస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పలేమని భారత విదేశాంగ శాఖ తెలిపింది. మోదీ మూడు రోజుల పర్యటనలో భాగంగా అనేక సమావేశాలు ఖరారయ్యాయని, మరికొన్నింటిని ఖరారు చేయాల్సి ఉందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ చెప్పారు. ఏదైనా ప్రత్యేక సమావేశం ఖరారు అవుతుందా లేదా అనేది ఇప్పుడే చెప్పలేమని, ప్రధాని జరపబోయే మరిన్ని సమావేశాలను ఖరారు చేసేందుకు అన్ని విధాలా యత్నిస్తున్నామన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ట్రంప్ వచ్చేవారం మోదీని అమెరికాలో కలుస్తానని రెండు రోజుల క్రితం ప్రకటించడంతో మిస్రీ స్పందనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నెల 21 నుంచి 23 వరకు ప్రధాని అమెరికాలో పర్యటిస్తారు.

అంధులకు చూపునిచ్చే బ్లైండ్‌సైట్

- మస్క్‌కు చెందిన 'న్యూరా లింక్' అభివృద్ధి చేసిన పరికరానికి అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం

న్యూయార్క్, సెప్టెంబరు 19: పుట్టుకతో అంధులైనవారికి, ప్రమాదాల్లో చూపు కోల్పోయినవారికి, నేత్రనాడి లేనివారికి.. టెస్లా సీఈవో ఈలన్‌మస్క్ శుభవార్త చెప్పారు. అలాంటివారందరికీ చూపునివ్వడమే లక్ష్యంగా.. మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' సంస్థ అభివృద్ధి చేసిన 'బ్లైండ్‌సైట్' పరికరానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) అనుమతి లభించింది. అయితే ఈ పరికరం ద్వారా చూడాలంటే.. అంధుల మెదడులో 'విజువల్ కార్టెక్స్' మాత్రం దెబ్బతినకుండా ఉండాలి. అదొక్కటి బాగా ఉంటే అంధులు ఎంచక్కా ఈ పరికరం సాయంతో ప్రపంచాన్ని చూడొచ్చని ఈలన్ మస్క్ ట్వీట్ చేశారు. ఈ పరికరానికి ఎఫ్‌డీఏ.. 'బ్రేక్‌త్రూ డివైస్' హోదా కూడా వచ్చినట్టు న్యూరాలింక్ ఒక ప్రకటనలో తెలిపింది.



భారత విద్యార్థులకు కెనడా షాక్!

వచ్చే ఏడాది స్టడీ పర్మిట్లలో 10% కోత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: విదేశీ విద్యార్థులకు కెనడా ప్రభుత్వం మరో షాక్ ఇవ్వనుంది. ఈ ప్రభావం ఎక్కువగా భారతీయ విద్యార్థులపైనే పడనుంది. ఇప్పటికే విదేశీ విద్యార్థులకిచ్చే స్టడీ పర్మిట్లలో భారీగా కోత విధించిన కెనడా.. వచ్చే ఏడాది మరో 10శాతం తగ్గించనున్నట్టు వెల్లడించింది. వలసల నియంత్రణలో భాగంగా తాత్కాలిక నివాసితుల సంఖ్యను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయాన్ని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో 'ఎక్స్' వేదికగా బుధవారం ప్రకటించారు. 'గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 35 శాతం తక్కువగా విదేశీ విద్యార్థులకు స్టూడెంట్ పర్మిట్లు మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాది ఈ సంఖ్యను మరో 10%తగ్గిస్తాం. మన ఆర్థిక వ్యవస్థకు వలసలు ముఖ్యమే అయినా.. కొందరు చెడ్డ వ్యక్తులు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. అందుకే మేం వాటిని నియంత్రించక తప్పడం లేదు" అని ట్రూడో ట్వీట్ చేశారు. కాగా గత నెలలో భారత ప్రభుత్వం విడుదలచేసిన గణాంకాల ప్రకారం సుమారు 13.35 లక్షల మంది భారత విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తుంటే వారిలో 4.27లక్షల మంది కెనడాలోనే ఉన్నారు. ప్రస్తుతం కెనడాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో 40%మంది భారతీయులేకావడం గమనార్హం. మరోవైపు న్యూజిలాండ్ విజిటర్ వీసా పొందడం భారతీయులకు సవాలుగా మారింది. భారతీయుల దరఖాస్తుల్లో 23% తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ ఏడాది జనవరి1 నుంచి సెప్టెంబరు8 వరకు 42,542 మంది భారతీయులు తొలిసారిగా న్యూజిలాండ్ పర్యటన వీసాకు దరఖాస్తు చేయగా కివీస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు 32,085దరఖాస్తులకే ఆమోదం తెలిపారు.

పేజర్ల షెల్ కంపెనీ ఇజ్రాయెల్ పనేనా?

తొలుత నాణ్యమైన పేజర్ల పంపిణీ.. ఆ తర్వాతే పేజర్ బాంబుల పథకం!

- లెబనాన్‌లో 37కు చేరిన మరణాలు
- ఇజ్రాయెల్-హిజ్బుల్లా పోరు ఉధృతం



బీరుట్, సెప్టెంబరు 19: లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల వెనక దీర్ఘకాలిక వ్యూహం ఉందా? ఓ క్రమ పద్ధతిలో హంగరీలో షెల్ కంపెనీని సృష్టించి.. తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని, హిజ్బుల్లా పాలిట మృత్యు శాసనం రాయాలనే స్కెచ్ రెండేళ్ల క్రితమే పురుడుపోసుకుందా? ఈ ప్రశ్నలకు పాశ్చాత్య మీడియా ఔననే చెబుతోంది. న్యూయార్క్ టైమ్స్ ఏకంగా ఆ షెల్ కంపెనీ ఇజ్రాయెల్ సృష్టేనని పేర్కొంది. ఇజ్రాయెల్ తన ప్రణాళికలో భాగంగానే తొలుత నాణ్యమైన పేజర్లను అందజేసి.. ఆ తర్వాత పేజర్ బాంబులను రూపొందించిందని న్యూయార్క్ టైమ్స్ కథనం చెబుతోంది.

సెల్‌ఫోన్లంటే భయపెట్టి?

సెల్‌ఫోన్లు వాడే హిజ్బుల్లా నాయకత్వాన్ని ఇజ్రాయెల్ నిఘా సంస్థ టార్గెట్‌గా చేసుకుంది. దీంతో.. 2022లోనే హిజ్బుల్లా నేత హసన్ నస్రల్లా ఎవరూ సెల్‌ఫోన్లను వాడొద్దని ఆదేశాలు జారీ చేసి.. ప్రత్యామ్నాయాలను సూచించారు. ఈ క్రమంలోనే హిజ్బుల్లా తమ సమాచార మార్పిడికి పేజర్లను వినియోగించడం మొదలు పెట్టింది. తొలుత పాతకాలం పేజర్లను వాడినా.. ఎక్కువ సంఖ్యలో కొత్త వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో కంపెనీని సంప్రదించింది. పాతకాలం టెక్నాలజీ కావడంతోపాటు.. విడిభాగాలు, అసెంబ్లింగ్ వంటి పనుల కోసం గోల్డ్ అపోలో ఈ పనికి సబ్-కాంట్రాక్టర్ల కోసం వెతుకుతున్న తరుణంలో.. హంగరీకి చెందిన బీఏసీ కంపెనీ ముందుకు వచ్చినట్లు పాశ్చాత్య మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇరు కంపెనీలు మూడేళ్లకు గాను.. బ్రాండింగ్ లైసెన్సుపై ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. 2020 జూన్‌లో నాణ్యమైన పేజర్లను సరఫరా చేసింది. లెబనాన్‌లో ఇరాన్ రాయబార కార్యాలయం సైతం వీటినే వినియోగిస్తోందని నిర్ధారించుకున్నాక పేజర్ బాంబుల తయారీ వ్యూహాన్ని అమలు చేసినట్లు తెలుస్తోంది. ఐదు నెలల క్రితం 5 వేల పేజర్లకు హిజ్బుల్లా నుంచి ఆర్డర్ రావడంతో.. బీఏసీ కంపెనీ పీఈటీఎన్ పేలుడు పదార్థాన్ని అమర్చిన పరికరాలను పంపిణీ చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ కథనం స్పష్టం చేస్తోంది. అయితే.. బీఏసీ సీఈవో క్రిస్టినా బార్సోనీ మాత్రం.. తాము పేజర్లను తయారు చేయలేదని, కేవలం సరఫరా విషయంలోనే గోల్డ్ అపోలోతో ఒప్పందం ఉన్నట్లు స్పష్టం చేశారని 'ది ఇండిపెండెంట్' ఓ కథనాన్ని ప్రచురించింది. న్యూయార్క్ టైమ్స్ మాత్రం.. ముగ్గురు నిఘా సంస్థల అధికారులతో మాట్లాడి.. బీఏసీ కంపెనీ ఇజ్రాయెల్‌కు చెందినదేనని నిర్ధారించుకున్నట్లు తెలిపింది.

మరో వైపు.. మంగళ, బుధవారాల్లో జరిగిన పేజర్, వాకీటాకీ పేలుళ్ల ఘటనల్లో మరణాల సంఖ్య 37(వాకీటాకీల ఘటనలో 20, పేజర్ల పేలుళ్లలో 17)కు చేరుకున్నట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 3,250 మంది క్షతగాత్రులు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని.. పరిస్థితి విషమంగా ఉన్న వారిని ఇరాన్‌కు తరలించామని తెలిపింది.

బందీలను విడుదల చేస్తే..

11 నెలలుగా గాజాపై పోరు సల్పుతున్న ఇజ్రాయెల్.. గురువారం హమాస్ ఉగ్ర సంస్థకు ఓ ఆఫర్ ఇచ్చింది. గాజాలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను ఒకేసారి విడుదల చేస్తే.. యుద్ధాన్ని నిలిపివేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ తరఫున మధ్యవర్తిత్వం వహిస్తున్న గాల్ హిర్ష్ అమెరికాకు తెలిపారు. ఈ విషయాన్ని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్, ఇజ్రాయెలీ పబ్లిక్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(ఐపీబీసీ) నిర్ధారించాయి.

సరిహద్దుల్లో ఉద్రిక్తత

ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతినబూని హిజ్బుల్లా.. బుధవారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్‌పై క్షిపణి, రాకెట్ దాడులు చేసింది. గురువారం ఉదయం కూడా సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. ఇజ్రాయెల్ కూడా తన సేనలను ఉత్తరాదిన మోహరించింది. హిజ్బుల్లా దాడులకు క్షిపణులతోనే సమాధానమిచ్చింది. ఈ నేపథ్యంలో రెండు దేశాల సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఉగ్రవాది పన్నూ కేసు.. భారత ప్రభుత్వానికి అమెరికా కోర్టు నోటీసులు

- ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్ సహా ఉన్నతాధికారుల పేర్లు
- 21 రోజుల్లో జవాబివ్వాలని సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఖలిస్థానీ ఉగ్రవాది గురపత్వంత్ సింగ్ పన్నూ దాఖలు చేసిన కేసులో అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తనను హత్య చేసేందుకు భారత ప్రభుత్వం కుట్ర పన్నిందంటూ న్యూయార్క్‌లోని డిస్ట్రిక్ట్ కోర్టులో వేసిన దావాలో పన్నూ ఆరోపించారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు ఇచ్చింది. వాటిలో భారత జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్‌తో పాటు రిసెర్చ్ అండ్ అనాలసిస్ (రా) విభాగం మాజీ అధిపతి సమంత్ గోయల్, రా ఏజెంట్ విక్రమ్ యాదవ్, భారతీయ వ్యాపారవేత్త నిఖిల్ గుప్తా పేర్లు ఉన్నాయి. 21 రోజుల్లో ఈ సమన్లపై సమాధానం ఇవ్వాలని పేర్కొంది. కోర్టు సమన్లను పన్నూ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. పన్నూకు అమెరికా, కెనడా పౌరసత్వాలు ఉన్నాయి. తమ దేశంలో పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అమెరికా వెల్లడించిన విషయం తెలిసిందే. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు వ్యాపారి నిఖిల్ సుపారీ ఇచ్చారని అమెరికా ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు. అయితే అలాంటి కుట్రల్లో తమ పాత్ర ఏమీ లేదని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు కూడా ప్రారంభించింది.

ఉగ్రవాది కేసులో మమ్మల్ని ప్రశ్నిస్తారా?

పన్నూ కేసులో అమెరికా కోర్టు సమన్లు జారీ చేయడంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. తన హత్యకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ పన్నూ దావా వేయడాన్ని వ్యతిరేకించింది. అతనో ఉగ్రవాది అని, అలాంటి వ్యక్తి దాఖలు చేసిన కేసులో తమను ప్రశ్నించడమేంటని తప్పుపట్టింది. ఇది పూర్తిగా అసమంజసమని వ్యాఖ్యానించింది.

బెంగాల్ వైద్యుల సమ్మె పాక్షిక విరమణ

- చాలావరకు డిమాండ్లపై ప్రభుత్వ అంగీకారం
- రేపటి నుంచి అత్యవసర సేవలకు డాక్టర్లు



కోల్‌కతా, సెప్టెంబరు 19: హత్యాచారానికి గురైన పీజీ వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ 41 రోజులుగా సమ్మె చేస్తున్న బెంగాల్ వైద్యులు ఎట్టకేలకు కాస్త శాంతించారు. ప్రభుత్వం తమ డిమాండ్లలో చాలావరకు ఆమోదించడంతో పాటు, రాష్ట్రంలో భారీ వరదల రీత్యా సమ్మెను పాక్షికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఔట్ పేషంట్ సేవలను మాత్రం అందించబోమని చెప్పారు. మరోవైపు బెంగాల్ సర్కారు వైద్యుల భద్రతకు సంబంధించిన మార్గదర్శకాలను గురువారం విడుదల చేసింది. తక్షణమే అమలు చేయాలని ఆదేశాలిచ్చింది. ఆస్పత్రుల్లో విధుల్లో ఉన్న వైద్యులకు సరిపడా గదులు, వాష్ రూమ్‌లు ఉండేలా చూడడం, సీసీ టీవీలు, తాగునీటి వసతులు కల్పించడం తదితరాలు ఇందులో ఉన్నాయి. వీటిని తక్షణమే సమకూర్చాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, సీబీఐ నివేదికకు ఇంకెంత సమయం తీసుకుంటారని ప్రశ్నిస్తూ వైద్యులు స్వాస్థ్య భవన్ ఎదుట 9 రోజులుగా ధర్నా చేస్తున్నారు. దీనిని శుక్రవారం విరమించి సీబీఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. మరోవైపు తమ డిమాండ్ల అమలుకు సర్కారుకు వారం రోజుల గడువు ఇచ్చిన వైద్యులు, అవి నెరవేరకుంటే మళ్లీ పూర్తిస్థాయి సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు.

ఘోష్ మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దు

కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దయింది. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు సంబంధించి ఆరోపణలతో ప్రస్తుతం సీబీఐ అదుపులో ఉన్న ఘోష్‌ను రిజిస్టర్డ్ మెడికల్ ప్రొసీడింగ్స్ నుంచి తొలగించారు. ఆర్జీకర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ ఎమ్మెల్యే సుదీప్తోరాయ్ విచారణ నిమిత్తం గురువారం ఈడీ ఎదుట హాజరయ్యారు. ఆర్జీకర్ ఆస్పత్రిలో హత్యాచార ఘటనకు సంబంధించి టీఎంసీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆ పార్టీ నేత జవహర్ సిర్కార్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

జెత్వానీ ఐ ఫోన్లు హ్యాక్!

గత ప్రభుత్వంలో పోలీసుల నిర్వాకం.. తాజాగా సంచలన విషయాలు వెలుగులోకి

- అరెస్ట్ చేశాక 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- సజ్జన్‌ను కాపాడేందుకు ఆధారాలు చెరిపేసే యత్నం
- పాస్‌వర్డ్‌లు చెప్పాలని కాదంబరిపై ఒత్తిడి
- ఆ సమయంలోనే వెబ్‌బ్రౌజర్ ద్వారా లాగిన్
- దుబాయ్ హ్యాకర్‌ను తీసుకొచ్చినట్టు సందేహాలు
- 'యాపిల్' నుంచి జెత్వానీ మెయిల్‌కు మెసేజ్‌లు
- నివేదికలో నాటి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పేరు
- ఆయన అనుమతితోనే ముంబైకు విశాల్ గున్నీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో సంచలన విషయాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. గత ప్రభుత్వంలో పోలీసులు ఈ వ్యవహారంలో తప్పుల మీద తప్పులు చేశారు. అవే ఇప్పుడు వారి మెడకు చుట్టుకున్నాయి. కాదంబరి జెత్వానీ, ఆమె తల్లిదండ్రులు ఆశా జెత్వానీ, నరేంద్రకుమార్ జెత్వానీ వాంగ్మూలాలతో తయారైన నివేదికలో కీలక అంశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో ప్రధానమైనది కాదంబరి ఐ ఫోన్లను హ్యాక్ చేయడం. ముంబైలో ఫిబ్రవరి 3వ తేదీన జెత్వానీ కుటుంబ సభ్యులను అరెస్టు చేసిన తర్వాత ఆమెకు సంబంధించిన ఐదు ఐ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన పాస్‌వర్డ్‌లు చెప్పాలని ఆమెపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. అయినా కాదంబరి పాస్‌వర్డ్‌లు చెప్పలేదు. ముంబైలో న్యాయమూర్తి ఇంట్లో ఆమెను హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకొచ్చారు. కోర్టులో హాజరుపరిచిన తర్వాత కాదంబరి కుటుంబ సభ్యులను జైలుకు పంపారు. ఒక కేసులో నిందితులను అరెస్టు చేశాక వారి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదును కోర్టుకు అప్పగించాలి. ఈ కేసులో పోలీసులు, అధికారులు ఆ పని చేయలేదు. ముంబైలో పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌పై కాదంబరి పెట్టిన కేసు వ్యవహారం, కుక్కల విద్యాసాగర్‌కు సంబంధించిన ఆధారాలు ఫొటోలు, వీడియోలు ఈ ఫోన్లలో ఉన్నాయి. ఆ ఆధారాలను లేకుండా చేయగలిగితే ముంబై కేసులో జిందాల్‌కు విముక్తి కలుగుతుందని, విద్యాసాగర్ ఇబ్రహీంపట్నంలో పెట్టిన కేసులో ఆమె ఇరుక్కుపోతుందని భావించారు. కాదంబరి పాస్‌వర్డ్‌లు చెప్పకపోవడంతో ఆమె ఐదు ఐ ఫోన్లను కోర్టులో సమర్పించలేదు. పోలీసులు తమ వద్దే పెట్టుకుని హ్యాక్ చేశారు.



ఫిబ్రవరి 7వ తేదీన ఒకసారి, 21వ తేదీన ఒకసారి ఇది జరిగింది. వెబ్‌బ్రౌజర్ ద్వారా ఐక్లౌడ్‌ను ఉపయోగించినట్టు ఆమె మెయిల్‌కు యాపిల్ కంపెనీ నుంచి మెసేజ్‌లు వెళ్లాయి. ఆమె జైలు నుంచి విడుదలైన తర్వాత ఈ-మెయిల్‌ను పరిశీలించగా ఈ విషయం తెలిసింది. తన ఫోన్లలో ఉన్న ఆధారాలను తుడిచేయడానికి హ్యాక్ చేశారని కాదంబరి గుర్తించారు. తర్వాత ఈ ఫోన్ల పాస్‌వర్డ్‌ను ఆమె రీసెట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన మెసేజ్ ఆమె మెయిల్‌కు వెళ్లింది. పోలీసులు తమ వద్ద పెట్టుకున్న ఆమె ఫోన్లను హ్యాక్ చేయడానికి ప్రత్యేకంగా దుబాయ్ నుంచి ఒక హ్యాకర్‌ను రప్పించినట్టు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై అంతర్గతంగా విచారణ సాగుతోంది. ఐక్లౌడ్‌ను పోలీసులు ఏవిధంగా తెరిచారన్నది లాగ్ వివరాలను పరిశీలిస్తే తెలుస్తుంది. బయట ఎక్కడైనా సైబర్ ల్యాబ్ నుంచి ఐక్లౌడ్‌లోకి వెళ్లారా, కమిషనరేట్‌లో కంప్యూటర్లను ఉపయోగించారా అన్నది తెలియడం లేదు. ఈ లాగ్ వివరాలు యాపిల్ సంస్థ వద్ద మాత్రమే ఉంటాయి. ఫోన్ల యజమానులు మెయిల్‌లో అప్లికేషన్ పంపితేనే ఆ వివరాలను యాపిల్ సంస్థ ఇస్తుంది. దీంతో కాదంబరి ఈ లాగ్ వివరాలను ఇవ్వాలని యాపిల్ సంస్థకు లేఖ రాయబోతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ఆపరేషన్ అక్కడ.. టీఏ బిల్లు ఇక్కడ

జెత్వానీని అరెస్టు చేయడానికి విజయవాడ నుంచి అప్పటి డీసీపీ విశాల్‌గున్నీ ఆధ్వర్యంలో ఒక బృందం ముంబై బయల్దేరి వెళ్లింది. ఫిబ్రవరి 1న విమాన టికెట్లు బుక్ చేసుకుని 2, 3 తేదీల్లో ఈ బృందం ముంబైలో గడిపింది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు కార్యాలయానికి సంబంధించిన పనులపై మరో ప్రాంతానికి వెళ్లినప్పుడు టీఏ బిల్లు పెట్టుకుంటారు. అయితే కాదంబరి అరెస్టు ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన విశాల్‌గున్నీ పెట్టిన టీఏ బిల్లు చూసి పోలీసు వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. ఫిబ్రవరి 2వ తేదీన విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్, నున్న, కేదారేశ్వరపేటలో పర్యటించినట్టు విశాల్ గున్నీ టీఏ బిల్లు పెట్టారు. 3న కూడా నగరంలోని మరికొన్ని ప్రాంతాల పేర్లు రాసి టీఏ బిల్లు పెట్టారు. ఆ సమయంలో ఆయన ముంబైలో ఉన్నారు. బిల్లులను మంజూరు చేసే పోలీసు కమిషనర్ కార్యాలయంలోని బీ సెక్షన్‌లో వాటిని అందజేశారు. విచారణాధికారులు అక్కడి నుంచి ఈ బిల్లులకు సంబంధించిన వివరాలు సేకరించినట్టు తెలిసింది.

నివేదికలో మాజీ డీజీపీ పేరు

ప్రభుత్వానికి చేరిన విచారణ నివేదికలో మాజీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి పేరు ఉన్నట్టు సమాచారం. 'పీఎస్ఆర్ ఆంజనేయులు... అప్పటి సీపీ కాంతిరాణాను, నన్ను సీఎం ఆఫీసుకు పిలిపించారు. అక్కడ కాదంబరి జెత్వానీ అరెస్టుకు సంబంధించి టాస్క్ మొత్తం వివరించారు. తర్వాత కాంతిరాణా అప్పటి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఫోన్ చేశారు. కాదంబరి కేసు అరెస్టు విషయంలో నన్ను ముంబైకు పంపుతున్నట్టు వివరించారు. దీనికి రాజేంద్రనాథ్‌రెడ్డి గోహెడ్ అని ఆదేశించారు' అని విశాల్‌గున్నీ ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు తెలిసింది.

న్యాయం చేయండి

నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి


హోం మంత్రి అనితకు నటి జెత్వానీ వినతి

వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తనపై పెట్టిన తప్పుడు కేసును ఎత్తివేయాలని ముంబై నటి కాదంబరి జెత్వానీ హోం మంత్రి అనితను కోరారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని విన్నవించారు. గురువారం అమరావతి సచివాలయంలో హోం మంత్రితో ఆమె భేటీ అయ్యారు. గతంలో తనను అక్రమ కేసులో అరెస్టు చేసి మానసిక వేధింపులకు గురి చేసినందుకు తనకు ప్రభుత్వం పరిహారం ఇప్పించాలని కోరారు. తాను పెట్టిన కేసుపై త్వరితగతిన విచారణ చేయాలన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. "నాపై తప్పుడు కేసు పెట్టారు. నాకు మానసికంగా, భౌతికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. నా ఫోన్లు రెండుసార్లు ఓపెన్ చేయడానికి యత్నించారు. దానికి సంబంధించిన ఎలర్ట్ మెసేజ్‌లు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరాను" అని జెత్వానీ తెలిపారు. కాగా, జెత్వానీ కేసులో ఎంతటి వారున్నా చట్టపరంగా శిక్షపడేలా చేస్తామని హోంమంత్రి అన్నారు. సచివాలయంలో కుటుంబ సభ్యులతో తనను కలిసిన జెత్వానీకి మంత్రి ధైర్యం చెప్పారు. ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. అందుకు జెత్వానీ.. ప్రభుత్వం, హోం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కేసు ముగిసే వరకూ విజయవాడలో ఉన్నప్పుడు తనకు భద్రత కల్పించాలని వినతిపత్రం అందజేశారు. భద్రత విషయంలో భయపడొద్దని, లోతైన విచారణ చేసి నిందితులకు శిక్షపడే వరకూ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు సహా అందరూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని గురువారం భేటీ అయ్యారు. ఎస్ఈసీగా బాధ్యతలు చేపట్టిన రాణికుముదిని గవర్నర్‌తో రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. విజిలెన్స్ కమిషనర్ గోపాల్ కూడా గవర్నర్‌ను కలిశారు.

ఖరీదైన విద్యుత్తుకు స్వస్తి!

- నిరుడు కరెంటు కొనుగోళ్లకు రూ.53,373 కోట్లు
- ఈ ఏడాది రూ.42,702 కోట్లుగా డిస్కమ్‌ల ప్రతిపాదన!
- రూ.10 వేల కోట్ల ఖర్చు తగ్గింపు
- విద్యుత్తు చార్జీల పెంపుతో 1200 కోట్ల అదనపు ఆదాయం



హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)లు కరెంటు కొనుగోలు ఖర్చును తగ్గించుకుంటున్నాయి. ఖరీదైన విద్యుత్తుకు స్వస్తి పలుకుతున్నాయి. 2023-24లో కరెంట్ కొనుగోళ్లకు ఎస్పీడీసీఎల్ రూ.37,890.10 కోట్లు వెచ్చించగా.. ఎన్పీడీసీఎల్ రూ.15,483.73 కోట్లు ఖర్చు చేసింది. రెండు డిస్కమ్‌లు కలిపి రూ.53,373.83 కోట్లు వెచ్చించగా 2024-25లో రూ.10,671.83 తగ్గించి.. రూ.42,702 కోట్లే వెచ్చించనున్నట్లు 'వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్)'లో వెల్లడించాయి. జల విద్యుదుత్పాదనతో రూ.4వేలకోట్ల దాకా ఖర్చు తగ్గడంతో పాటు వ్యవసాయ, ఎత్తిపోతల పథకాలకు వినియోగం కూడా తక్కువగా ఉంటుందన్న అంచనాతో విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చు రూ.10,671.83 కోట్ల దాకా తగ్గుతుందని డిస్కమ్‌లు లెక్కించాయి. 2024-25లో విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం రూ.44,835 కోట్లు కాగా.. ఇందులో కొనుగోళ్లకే రూ.42,702 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. బుధవారంరాత్రి తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏఆర్ఆర్‌ను డిస్కమ్‌లు దాఖలు చేశాయి. ఆ లెక్కల ప్రకారం 2024-25లో కొనుగోళ్లు, సరఫరా, స్టేట్ లోడ్‌డిస్పాచ్ సెంటర్(ఎస్ఎల్‌డీసీ)ఖర్చు, పంపిణీ ఖర్చులు మొత్తం రూ.57,857 కోట్లు అవుతాయని తేల్చాయి. ఇందులో ఆదాయం రూ.44,835 కోట్లు పోగా ప్రభుత్వ సబ్సిడీలు చేతికొస్తే లోటు ఉండదని అంచనా వేశాయి.

లోటు లేకుండా ఏఆర్ఆర్

పదేళ్లలో తొలిసారి లోటు లేకుండా డిస్కమ్‌లు ఏఆర్ఆర్ దాఖలు చేయడం గమనార్హం. 2024-25లో రూ.57,857 కోట్లు ఖర్చు కానుండగా.. అందులో ప్రభుత్వ సబ్సిడీ కలిపి, లోటు శూన్యస్థాయికి చేరింది. విద్యుత్తు చార్జీల పెంపుతో రూ.1200 కోట్ల అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటామని డిస్కమ్‌లు అంచనా వేశాయి. హెచ్‌టీ విభాగంలో చార్జీల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో రూ.100 కోట్లు, మిగిలిన రూ.400 కోట్లను ఎల్టీ వినియోగదారుల ఫిక్స్‌డ్ చార్జీల పెంపు ద్వారా రాబట్టుకుంటామని తెలియజేశాయి.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రెండు జాతీయ అవార్డులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 19: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రెండు జాతీయ అవార్డులు లభించినట్టు జీఎంఆర్ అధికారులు గురువారం తెలిపారు. భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించిన ఎక్సలెన్స్ ఇన్ మేనేజ్‌మెంట్ 25వ జాతీయ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 'నేషనల్ ఎనర్జీ లీడర్', 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్' అవార్డులు దక్కినట్లు చెప్పారు. వరుసగా ఆరోసారి నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు, 8వసారి ఎక్సలెన్స్ ఎఫిషియెంట్ యూనిట్ అవార్డు దక్కినట్లు తెలిపారు. ఈ అవార్డులు రావడం పట్ల జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణికర్ హర్షం వ్యక్తం చేశారు.

పంట నష్టం అంచనాకు ఏఐ వినియోగం!

- కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంటల బీమాలో భాగంగా పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్న మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో అమలు విధానాన్ని అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చేవారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల బృందం మధ్యప్రదేశ్‌లో పర్యటించనుందని సమాచారం. ఆ పరిశీలన తర్వాత ఏఐ వినియోగంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సాంకేతికత ద్వారా పంట నష్టాన్ని నిర్దిష్టంగా అంచనా వేసే అవకాశాలున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ సీజన్ నుంచి పంటల బీమాను అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

జనసేనలోకి బాలినేని, ఉదయభాను

- వైఎస్ జగన్మోహన్ రెడ్డికి షాకిచ్చిన సన్నిహితులు
- పవన్ కల్యాణ్‌తో వేర్వేరుగా భేటీ
- జనసేనలో చేరుతున్నట్లు వెల్లడించిన నేతలు



అమరావతి/ఒంగోలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆయన సన్నిహితులు గట్టి షాకే ఇచ్చారు. మాజీ మంత్రి, ఆయన సమీప బంధువు బాలినేని శ్రీనివాసరెడ్డి, అత్యంత ఆత్మీయుడిగా మెలిగిన జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వైసీపీకి గుడ్‌బై చెప్పారు. గురువారం వారు వేర్వేరుగా విజయవాడలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో సమావేశమై చర్చలు జరిపారు. వారిని ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. అక్టోబరు 4న చేరతానని బాలినేని ప్రకటించగా.. ఈ నెల 22న తాను చేరుతున్నట్లు ఉదయభాను తెలిపారు. పవన్‌తో భేటీ అనంతరం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. తానెలాంటి డిమాండ్లూ పెట్టకుండా బేషరతుగా చేరుతున్నానని బాలినేని అన్నారు. మంచిరోజు చూసుకుని పార్టీలో చేరతానని, పవన్‌కు వీలైతే అక్టోబరు 4న ఒంగోలులో సభఏర్పాటు చేసి పార్టీలో చేరే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలోని ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా జగన్‌ను వీడి రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్ విశ్వసనీయత బూటకమని.. ఆ పేరుతో నమ్మిన నాయకులను మోసం చేశారని విమర్శించారు. ఆయన విధానం పచ్చి మోసమన్నారు. పార్టీలో తనకు చాలా అవమానాలు ఎదురయ్యాయని, అవసరమైనప్పుడు వెల్లడిస్తానని తెలిపారు. వైసీపీ పరిస్థితి దారుణంగా ఉందని ఉదయభాను చెప్పారు. ఎన్నికలకు ముందు అనేకసార్లు జగన్‌కు చెప్పినా పట్టించుకోలేదని.. మనసుకు కష్టం కలిగినందునే వైసీపీని వీడానన్నారు. కూటమికి తగ్గట్టుగా వివాదాలకు తావులేకుండా నడచుకుంటానని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇజ్రాయెల్ దొంగదెబ్బ

ఇంత అన్యాయమైన యుద్ధం మధ్యయుగాల్లో కూడా లేదు అని గాజాఘాతుకాలను చూస్తున్నవారికి అనిపిస్తున్న తరుణంలో, లెబనాన్‌లో వరుసగా రెండురోజులు సాగిన హైటెక్ విధ్వంసం ఇజ్రాయెల్ తెగింపు ఏ స్థాయిలో ఉంటుందో మరో మారు తెలియచెప్పింది. రెండు ప్రపంచయుద్ధాల్లోనూ అత్యంత అమానుషమైన యుద్ధరీతులను ఈ ప్రపంచం చూసింది. ఉచ్చు బిగించి, అమాయకంగా వలలోపడిన శత్రువును మట్టుబెట్టడం, చుట్టలూ, టోపీలవంటి వస్తువులుగా కనిపించే ఆయుధాలతో శత్రు సైనికులతో పాటు సామాన్యులను సైతం పొట్టనబెట్టుకోవడం వంటివి చూసింది. ఆ తరువాతే, అది యుద్ధం కాదు, అమానుషత్వం, ఉన్మాదం అన్న గ్రహింపుతో, కొన్ని దశాబ్దాల పరిణామంలో కనీస హక్కుల దృష్టితో కొన్ని నిబంధనలు, అంతర్జాతీయ ఒప్పందాలు ఏర్పడ్డాయి. హమాస్ ఉగ్రవాదులు దాక్కొని ఉన్నారన్న పేరిట చిరకు ఆస్పత్రులనూ, ఆశ్రయాలనూ నేలమట్టం చేస్తూ, గాజాలో వేలాది మంది సామాన్యులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయెల్, హిజ్బొల్లాను చావుదెబ్బతీయడానికి ఈ అనైతికమైన విధానాన్ని ఎంచుకోవడం ఆశ్చర్యం కలిగించదు. తనమీద రాకెట్లతో దాడులు చేస్తున్న శత్రువు గుండెలను చీల్చి యుద్ధక్షేత్రంలో సంహరించడానికి బదులుగా ఊహించనిరీతిలో, ఊహకు అందనిచోట దొంగదెబ్బతీసింది. తనమీద కురుస్తున్న క్షిపణులను అమెరికా అందించిన అత్యాధునిక పరికరాలతో అడ్డుకోగలుగుతున్న ఇజ్రాయెల్, ఆత్మరక్షణకు ఏ మాత్రం వీల్లేని రీతిలో, నిస్సహాయస్థితిలో ఉన్న శత్రువుపై దాడిచేసింది. పేజర్ల పేల్చివేతతో ఒకేమారు వేలాదిమంది శత్రువులను దెబ్బతీయడం సాంకేతిక అద్భుతమే కానీ, అనైతికం, దుర్మార్గం కూడా.

అంతర్జాతీయ చట్టాలు, నియమనిబంధనలు ఇజ్రాయెల్‌కూ వర్తిస్తాయి కానీ, వాటిని అది ఉల్లంఘించి ఎన్ని అకృత్యాలకు పాల్పడినా కాపాడుకురావడానికి అమెరికా ఎలాగూ ఉంది. పైగా, ఒక రాజ్యేతర శక్తిని, ఒక ఉగ్రవాద సంస్థని దుంపనాశనం చేయడంలో ఈ చట్టాలూ చట్టుబండలూ ఏమిటన్న వాదన కూడా చేయవచ్చు. సమాచారాన్ని చేరవేయడానికీ, మాట్లాడుకోవడానికీ ఉపయోగించే ఓ సాధారణమైన పేజర్, వాకీటాకీలను ఇలా బాంబులుగా మార్చింది తానేనని ఇజ్రాయెల్ ఎప్పటికీ ఒప్పుకోదు. తైవాన్‌నుంచి రవాణా అవుతున్న పేజర్లను దారిమళ్ళించి, వాటిలో పేలుడుపదార్థాలను కుక్కి, సూక్ష్మ స్థాయి డిటోనేటర్లను అమర్చారని అంటున్నారు. మొబైల్ ఫోన్ తమ ఉనికిని శత్రువులకు తెలియచేస్తుందన్న జాగ్రత్తతో, హిజ్బొల్లా మిలిటెంట్ దళం ఒకేమారు వేలాదిపేజర్లను దిగుమతి చేసుకొని, వాటిని వాడటం ఆరంభించింది. కానీ, మార్గమధ్యంలో శత్రువు మాటువేసి, వాటిని తమపాలిట మారణాయుధాలుగా మార్చేస్తాడని ఆ సంస్థ ఊహించలేదు. అనేకనెలలుగా హిజ్బొల్లా అత్యున్నతస్థాయి నాయకులనుంచి తమ కేడర్‌కు చాలా మెసేజ్‌లు ఈ పేజర్ల ద్వారా అందినందున ఇజ్రాయెల్ వాటిని ట్రాక్ చేయకుండా ఉండదు. ఇప్పుడు అవి పేలడం, వెనువెంటనే లెబనాన్‌మీద క్షేత్రస్థాయి దాడులు ఊపందుకోవడం వెనుక ఇజ్రాయెల్ వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. సాంకేతికతను ఈ స్థాయిలో వినియోగించి, శత్రువును మానసికంగా భయోత్పాతంలో ముంచిన నేపథ్యంలో హమాస్ మాదిరిగానే హిజ్బొల్లాను కూడా సమూలంగా పెకిలించివేస్తానని ఇజ్రాయెల్ అంటోంది. పేజర్లు, వాకీటాకీలు పేలుడుపదార్థాలుగా మారిన ఈ ఉదంతం హిజ్బొల్లాను కకావికలు చేసినమాట నిజం.

పెగాసస్ వంటి అధునాతన, అత్యున్నత స్థాయి స్పైవేర్‌ను ఆయా ప్రభుత్వాలకు అందించి, తమకు గిట్టనివారి ఫోన్‌లను హ్యాక్ చేయగలిగే అవకాశం కల్పించింది ఇజ్రాయెల్. ఆ నిఘా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకొని విపక్షనేతలనుంచి పాత్రికేయులవరకూ అందరిమీదా ఓ కన్నేసి ఉంచగలిగే అవకాశం పాలకులకు దక్కింది. తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నవారిని జైళ్ళలో కుక్కేందుకు వీలుగా, వారి కంప్యూటర్లలోకి చొరబడటమూ చూశాం. ఇజ్రాయెల్ సాంకేతిక నైపుణ్యానికీ, చావుతెలివితేటలకీ ఈ పేజర్ల పేలుళ్ళు మరో నిదర్శనం. సాధారణపౌరులు ఉపయోగించే పరికరాలను సైతం ఆయుధాలుగా, అధునికకాలపు బూబీట్రాప్‌లుగా మార్చేయడం వాటిని ఉపయోగిస్తున్నవారిని కచ్చితంగా భయపెట్టే అంశం. మీ మొబైల్, లాప్‌టాప్ సరే, కనీసం మీ టీవీ, ఫ్రిడ్జ్ ఇత్యాదివి ఇజ్రాయెల్‌కు అందకుండా ఉంటాయా? అని ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఇజ్రాయెల్ చొరబడలేని చోటు ఉండబోదన్నది ఇప్పుడు అందరినీ భయపెడుతున్న అంశం.

కశ్మీరీల ఓటు ఎవరికి?

ఒక నిరంతర ఆశ్చర్యం-కశ్మీర్! 2024 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలూ అందుకు మినహాయింపు కావు, కాబోవు. పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ నాయకురాలు ఇల్తిజా ముఫ్తీ ప్రచార పైనాలు, ప్రజల ప్రతిస్పందనలను ప్రత్యక్షంగా పరిశీలించి, వార్తా నివేదన చేసే క్రమంలో మేము అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్ బెహరాకు వెడుతున్నాం. ఆ పట్టణాన్ని సమీపిస్తున్న తరుణంలో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయాం. ఏదో కలకలం బిగ్గరగా విన్పించింది. ప్రజలు గుంపులు గుంపులుగా ఒకే వైపు పరుగెత్తడం కన్పించింది. సహజంగానే మేము కలతచెందాం. ఏమి జరిగింది? ఏదైనా పేలుడు ఘటన సంభవించిందా? లేక భయానక ఉగ్రవాదం విరుచుకుపడిందా? ప్రజల ప్రశాంతతకు అంతరాయం కలిగించిందేమిటి? వ్యాకులపడ్డాం. మా డ్రైవర్ మందహాసం చేశాడు. 'కలవరపడకండి, బిజ్‌బెహరా ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ చూడడానికి క్రీడాభిమానులు ఉరుకులు పరుగులుగా వెడుతున్నారు. అంతే. ఈ తుది పోటీ బిజ్‌బెహరా టీమ్, శ్రీనగర్ టీమ్ మధ్య జరుగుతోంది' అని చెప్పాడు. ఊపిరి పీల్చుకున్నాం. ఆ మ్యాచ్ జరుగుతున్న క్రీడామైదానం క్రికెట్ పిచ్చివాళ్లతో నిండిపోయింది. బహుశా, అది మా కళ్లెదుట కనిపిస్తున్న ఒక 'నయా' కశ్మీర్ దృశ్యం.

అవునా? 'నయా' కశ్మీర్‌కు అంతకంటే అత్యుత్తమమైన దృష్టాంతాలు శ్రీనగర్ నడిబొడ్డున ఉన్న చరిత్రాత్మక లాల్ చౌక్‌లో కన్పించాయి. తమ చౌక్‌లో త్వరలోనే ఒక బర్గర్ కింగ్, డొమినోస్ రాబోతున్నాయని అక్కడి దుకాణదారులు చెప్పారు. కశ్మీర్ రాజధాని నగరంలోని ప్రధాన వాణిజ్య కేంద్రమైన లాల్ చౌక్‌లో నిన్నగాక మొన్నటి దాకా, వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్ బంద్‌కు పిలుపునిస్తే చాలు ఆ చౌక్‌లో చీమ చిటుక్కుమనేది కాదు. బంద్ రోజునే కాదు, అంతకు ముందు, ఆ తరువాత రోజుల్లో కూడా దుకాణాలు మూతపడివుండేవి మరి. గత ఐదేళ్లుగా ఆ దుకాణాలు సూర్యాస్తమయం తరువాత రాత్రి పొద్దుపోయే వరకు నిర్భయంగా తెరిచే ఉంటున్నాయి. శ్రీనగర్‌లో మేము బస చేసిన హోటల్ యజమాని సగర్వంగా ఇలా చెప్పాడు: '2023–24లో లాగా మాకు మునుపెన్నడూ వ్యాపారం జరగనే లేదు. కోవిడ్ కాలంలో అయితే అసలు నా హోటల్‌ను అమ్మివేసేందుకు కూడా నిర్ణయించుకున్నాను. అయితే ఆ దుస్థితి తొలగిపోయింది. పర్యాటకులు మళ్లీ వెల్లువెత్తుతున్నారు. అన్ని రకాల ప్రయాణ సదుపాయాలు, విద్యుత్ సరఫరా పరిస్థితులు ఇతోధికంగా మెరుగుపడ్డాయి. ఎట్టకేలకు కశ్మీర్ మళ్లీ సరైన, పురోగమన పథంలో సాగుతోంది'. ఆ హోటల్ యజమాని ఆనందమే మా ఆనందమయింది. ఎంతసేపు?

శ్రీనగర్ పాతబస్తీలోని జామా మసీద్‌కు వెళ్లాం. ఆ రోజు శుక్రవారం. నమాజ్ అప్పుడే ముగిసింది. గతంలో శుక్రవారం ప్రార్థనల తరువాత అక్కడ రాజ్యవ్యవస్థ ప్రతీకలు, ప్రతినిధులపై రాళ్లు రువ్వడం పదే పదే పునరావృతమయ్యే కార్యక్రమంగా ఉండేది. ఇంకెంత మాత్రం కాదు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రజలు మసీదు నుంచి ప్రశాంతంగా తమ దుకాణాలు, కార్యాలయాలు లేదా ఇళ్లకు వెడుతున్నారు. కెమెరా ఫోకస్ చేయమని చెప్పి, గుంపులోని వ్యక్తులతో మాట్లాడడం ప్రారంభించాను. అగ్నిపర్వతం బద్దలయిందా అని అన్పించింది. ప్రశ్నలు వేయడం మొదలుకాగానే నా ఎదుట ఆగ్రహ భార్గవులను కన్నాను, విన్నాను. 'కశ్మీర్‌లో అంతా సవ్యంగా ఉంటే మీర్వాయిజ్ ఫరూఖ్ (హురియత్



అటల్ బిహారి వాజపేయి 2003లో 'కశ్మీరియత్, ఇన్సానియత్, జమ్హూరియత్' (సమ్మిళితత్వం, మానవతావాదం, ప్రజాస్వామ్యం) అని ఉత్తేజకరంగా ఉద్ఘోషించారు. నిజానికి 1990ల్లో కశ్మీర్ పండిట్‌లను వారి స్వస్థలాల నుంచి బలవంతంగా గెంటివేసినప్పుడే కశ్మీరియత్ సమాధి అయింది; ఉగ్రవాదుల తుపాకులు, రాజ్య వ్యవస్థ దురాగతాల మధ్య అసంఖ్యాక అమాయకులు అల్లల్లాడిపోయినప్పుడే ఇన్సానియత్ అస్తమించింది; పౌర స్వేచ్ఛలకు ఏ మాత్రం ఆస్కారం లేని పరిస్థితుల్లో జమ్హూరియత్ ఐసీయూలో జీవన్మరణాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. రణగొణ ధ్వనులతో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు 'రుధిర లోయ' యథార్థాలను మార్చలేవు.

నాయకుడు)ను ఎందుకు గృహ నిర్బంధంలో ఉంచారు?' అని ఒక వృద్ధుడు తీక్షణ స్వరంతో ప్రశ్నించాడు. 'మేము మౌనంగా ఉన్నాం. నిజమే. అయితే మా మౌనాన్ని జరుగుతున్న దాన్ని మేము అంగీకరిస్తున్నట్టుగా అర్థం చేసుకోవద్దు. మా రాష్ట్రాన్ని ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేసి న్యూఢిల్లీ మమ్ములను శిక్షించింది. నిజం కాదా?' అని మరో ఆగ్రహ గొంతు మమ్ములను నిలదీసింది. 'మేము భయం భయంగా బతుకుతున్నాం. మా అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తే మమ్ములను తప్పక జైలులోకి తోసేస్తారు' అని స్థూలకాయుడు అయిన ఒక వృద్ధుడు సూటిగా చెప్పాడు. పరిస్థితి అదుపు తప్పుతోందని మాకు అర్థమయింది. ఇంతలో జమ్మూ–కశ్మీర్ పోలీసధికారి ఒకరు అక్కడకు వచ్చి మమ్ములను అక్కడి నుంచి సురక్షిత ప్రదేశానికి తీసుకువెళ్లాడు. 'వేర్పాటువాదుల బృందాలను రాజకీయంగా ఎంతగా బలహీనపరచాలో అంతగా బలహీనపరిచారు. అయితే వేర్పాటువాద వైఖరులు, ఆకాంక్షలు ఇంకా ఎంతో బలీయంగా ఉన్నాయి' అని ఆ పోలీసధికారి మాకు స్పష్టంగా చెప్పాడు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

జనాల మనోభావాలు ఇలా ఉన్న పరిస్థితులలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో కశ్మీర్ లోయ ప్రజలు పాల్గొనడం ప్రారంభమయింది. ఒక దశాబ్ద కాలంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న, అందరూ ఎదురుచూసిన శాసనసభ ఎన్నికలు ఇవి. కశ్మీరీలు రికార్డు స్థాయిలో తమ ఓటు హక్కు వినియోగించుకోగలరనే అంచనాలు బాగా ఉన్నాయి. రాళ్లు రువ్విన, బుల్లెట్లను చవిచూసిన ప్రజలు ఎట్టకేలకు కశ్మీర్ వివాదానికి సరైన పరిష్కారం తమ నిరసనను మరింత ప్రభావశీలంగా తెలిపేందుకు ఓటు హక్కును సంపూర్ణంగా ఉపయోగించుకోవడమేనన్న దృఢ నిర్ణయానికి వచ్చారు. అధికరణ 370 రద్దు దరిమిలా నెలకొన్న పరిస్థితులలో పట్టువిడుపులు లేకుండా కఠిన వైఖరి అవలంబించేందుకు ఆస్కారం చాలా తక్కువగా ఉందనే వాస్తవాన్ని రాజకీయ పక్షాలు సైతం బాగా గుర్తించాయి.

నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనాయకుడు ఒమర్ అబ్దుల్లానే ఇందుకొక నిదర్శనం. ఆయన తొలుత ఈ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. అయితే ఒకటి కాదు, రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు! మరో మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఈ ఎన్నికలలో పోటీ చేయనప్పటికీ తన కుమార్తె ఇల్తిజా ముఫ్తీని ప్రప్రథమంగా ఎన్నికల బరిలోకి దించారు. సరే, కశ్మీర్ లోయలో బీజేపీకి లాంఛనప్రాయమైన ఉనికి మాత్రమే ఉన్నది. రాహుల్‌గాంధీ 'మోహబ్బత్ కి దుకాన్' సందేశం కశ్మీర్ లోయ ప్రజల మనసుల్లో గట్టిగా ప్రతిధ్వనించగలదనే ఆశ కాంగ్రెస్ శ్రేణుల్లో నిండుగా ఉన్నది.

కశ్మీర్ లోయలోని ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు అయిన నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీలలో పాలక వంశాల ప్రాబల్యం తీవ్రంగా ఉంది. అయితే ఈ ఎన్నికల సందర్భంలో అవి పతాక శీర్షికలలో అంతగా ఉండడం లేదు. అలా ఉంటున్నది చిన్న రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులే. కశ్మీర్ రాజకీయ క్రీడా నియమాలను మార్చివేసేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు. ఈ ఏడాది మేలో జరిగిన 18వ సార్వత్రిక ఎన్నికలలో రీతి రివాజులకు కట్టుబడని స్వతంత్ర అభ్యర్థి షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజినీర్ రషీద్‌గా సుప్రసిద్ధుడు) ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గంలో ఒమర్ అబ్దుల్లాను, సజ్జాద్ లోనెను ఓడించి కశ్మీరీలనే కాదు, యావత్ భారతీయులనూ దిగ్భ్రాంతిపరిచారు. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయమందించాడనే ఆరోపణపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఊపా) కింద ఖైదీగా రషీద్ 2019 నుంచి తీహార్ జైలులో ఉన్నారు. 'తీహార్ కా బద్‌లా వోట్ సే' అన్న యుద్ధ నినాదంతో ఆయన లోక్‌సభ ఎన్నికలలో అనూహ్య విజయం సాధించారు. తాను అమాయకుడినని ఇప్పటికీ గట్టిగా వాదిస్తున్న రషీద్‌కు ఇప్పుడు మూడు వారాల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బెయిల్ మంజూరయింది.

బహుముఖ పోటీలు కశ్మీర్‌లో ప్రజాస్వామ్య వాతావరణానికి ఒక నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం పదే పదే చెబుతోంది. ఈ అసెంబ్లీ పోరు, 1977 (షేక్ అబ్దుల్లా అనేక ప్రతికూలతలను ఎదుర్కొని మళ్లీ అధికారానికి వచ్చిన సంవత్సరమది) అనంతరం కశ్మీరీలు పూర్తి స్థాయిలో, క్రియాశీలంగా పాల్గొంటున్న ప్రప్రథమ ఎన్నికలు.

ఈ శాసనసభ సమరం పట్ల బహిరంగంగా వెల్లువవుతున్న ఆనందోత్సాహాలు కశ్మీరీల మనస్సుల్లోని అంతర్గత అల్లకల్లోలాన్ని దాచిపెడుతున్నాయి. అవును, ఇది నిజం. భారతదేశ ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రాన్ని ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేయడం, ఒక మునిసిపాలిటీ కంటే తక్కువ అధికారాలు ఉన్న శాసనసభ ఏర్పాటుకు పూనుకోవడం, కశ్మీర్ లోయకంటే జమ్మూ ప్రాంతానికి ఎక్కువ ప్రాతినిధ్యం లభించేలా నియోజకవర్గాల పునర్విభజన, పరిపాలనా వ్యవస్థను ప్రజలు ఎన్నుకోని, అందునా కేంద్రానికి ఏజెంట్‌గా వ్యవహరించే లెఫ్టినెంట్ గవర్నర్ నియంత్రణలో ఉంచడం మొదలైనవి కశ్మీరీలకు మాటల్లో చెప్పలేని మనస్తాపం కలిగిస్తున్నాయని మరి చెప్పనవసరం లేదు. కశ్మీర్ ఇంకా ఒక ఘనీభవించిన సంక్షోభంలో చిక్కుకొని ఉంది. ప్రస్తుత పరిస్థితికి భంగం కలిగించి నిక్కమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి వికసించి వర్ధిల్లేలా చేయాలని ఏ ఒక్కరూ నిజంగా కోరుకోవడం లేదు. కట్టడిలో ఉన్న ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛనిస్తే దాన్ని నియంత్రించలేమని వారు భయపడుతున్నారు.

భారత జాతీయోద్యమ విలువలను గౌరవించే అటల్ బిహారి వాజపేయి ఉత్తేజకర ఉద్ఘోష 'కశ్మీరియత్, ఇన్సానియత్, జమ్హూరియత్' (సమ్మిళితత్వం, మానవతావాదం, ప్రజాస్వామ్యం) కశ్మీర్ పరిణామాల పరిశీలకులను ఎంతగానో ఉత్సాహపరిచింది. నిజానికి 1990ల్లో కశ్మీర్ పండిట్‌లను వారి స్వస్థలాల నుంచి బలవంతంగా గెంటివేసినప్పుడే కశ్మీరియత్ సమాధి అయింది; ఉగ్రవాదుల తుపాకులు, రాజ్య వ్యవస్థ దురాగతాల మధ్య అసంఖ్యాక అమాయకులు అల్లల్లాడిపోయినప్పుడే ఇన్సానియత్ అస్తమించింది; పౌర స్వేచ్ఛలకు ఏ మాత్రం ఆస్కారం లేని పరిస్థితుల్లో జమ్హూరియత్ ఐసీయూలో జీవన్మరణాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. రణగొణ ధ్వనులతో జరుగుతున్న ప్రస్తుత ఎన్నికలు 'రుధిరలోయ' యథార్థాలను మార్చలేవు. కశ్మీరీల కష్టాలు, ఉగ్రవాద సవాళ్లతో భారత్ బాధలు సశేషంగా ఉంటాయి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పులను ఎలా ఎదుర్కొంటారు?

బీసీల లెక్క తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని, నాలుగు నెలల్లో బీసీ జనాభా వివరాలు తీస్తామని, ఎన్నికల్లో ఎవరి వాటా వారికిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటం బాగానే ఉంది. అది ఎట్లా సాధ్యమన్నదే సవాల్‌గా మారనుంది. 130 బీసీ కులాలకు జనాభా దామాషా పద్ధతిలో ఎవరి వాటా వారికి ఏ విధంగా ఇస్తారన్నదే బీసీ వర్గాలలో చర్చగా రగులుతుంది.

ఓటరు లిస్టుల ఆధారంగా లెక్కగడితే అది బీసీలకు నష్టం చేస్తుంది. తమిళనాడులో అంబా శంకర్ కమిషన్, జనార్దనమ్ కమిషన్‌లు చేసిన మాదిరిగా సర్వసమగ్ర బీసీల జీవన ముఖచిత్రమంతా వచ్చేవిధంగా డెడికేటెడ్ కమిషన్‌తో సమగ్ర సర్వే చేయాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రెండు బీసీ కమిషన్లు చేసిన అధ్యయనం, ముసాయిదా ప్రశ్నావళి తయారు, కొత్త బీసీ కమిషన్‌కు ఉపయోగపడుతుంది.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పైన బీసీలు ఎన్నో ఆశలు పెట్టుకుంది నిజమే కానీ అది ఆచరణలో ఎట్లా సాధ్యమన్నదే శాస్త్రీయంగా చూడాలి. ఏ తీరుగా చూసినా స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇప్పటికిప్పుడు అమలు జరిపే స్థితి లేదని, బీసీలకు రాజకీయ పరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణ లేకుండా సాధ్యం కావని పలు కేసులలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. రాజకీయ రంగంలో అణగారిన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం ఉండాలన్న ఆశయంతో ఆర్టికల్ 243–డి, మరియు 243–టి లలో కొన్ని ప్రత్యేక నిబంధనలు పెట్టారు. కానీ అందులో స్పష్టత లేకపోవటంతో న్యాయస్థానాలు తమదైన విశ్లేషణలతో పలు ఉత్తర్వులు జారీ చేశారు. ఓబీసీలకు సంబంధించి కర్ణాటకలో 2010 కృష్ణమూర్తి కేసు, మహారాష్ట్రలో 2021లో వికాస్‌రావు గవాలీ కేసు, మధ్యప్రదేశ్‌లో 2022లో సురేష్ మహాజన్ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులు పరిశీలిస్తే పలు విషయాలు వెల్లడవుతాయి.



సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 50శాతం దాటకూడదు. ఈ న్యాయపరమైన అంశాలను ఎదుర్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయబోతుందో కూడా చూడాలి. కులగణన చేశాం కాని కోర్టు తీర్పుల మార్గదర్శకత్వంలో నడవక తప్పదనే మాట చెప్పి ప్రభుత్వం తప్పుకుంటే మాత్రం రెండు కోట్ల మంది బీసీలు కన్నెర్రజేస్తారు.

రాష్ట్రంలోని ప్రజలందరి అన్ని కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సర్వే లేకుండా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచితే వాటిని కింది కోర్టు కాకుంటే సుప్రీంకోర్టు కొట్టివేస్తుంది. అంతిమంగా బీసీలకు స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంటు దాకా రిజర్వేషన్లు పొందటానికి విధిగా రాజ్యాంగ సవరణ జరగాలి. ఈ విషయం పాలకులకు స్పష్టంగా తెలిసి కూడా బీసీలతో ఆటలాడుతున్నారు. కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా 2010 కేసులో సుప్రీంకోర్టు తీర్పు చూస్తే విద్యా ఉద్యోగాలలో వెనుకబాటుతనం, రాజకీయ రంగంలో వెనుకబాటుతనం ఒక్కటి కావని చెప్తుంది. ఈ రెండు వేర్వేరు ప్రాతిపాదికలు కలిగి ఉంటాయి. బీసీలలో రాజకీయ వెనుకబాటుతనాన్ని లోతుగా అధ్యయనం చేసిన తర్వాతనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి. విద్యా ఉద్యోగాల రిజర్వేషన్లను దీనికి ఆపాదించకూడదు. కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో రాజకీయ రిజర్వేషన్లకు ట్రిబుల్ టెస్ట్ జరపాలని చెప్పటం జరిగింది: 1) డెడికేటెడ్ కమిషన్ వేయాలి. 2) సమకాలీన బీసీల జీవితాలను అధ్యయనం చేసి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలో అన్నది చెప్పాలి 3) ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలన్నింటికీ కలిపి మొత్తంగా 50శాతం రిజర్వేషన్లు దాటకూడదు. ట్రిబుల్ టెస్ట్ సర్వే విషయాలను కృష్ణమూర్తి కేసులో చెప్పిన వాటినే వికాస్ కిషన్‌రావు గవాలి వర్సెస్ గవర్నమెంట్ మహారాష్ట్ర 2021 కేసులో, సురేష్ మహాజన్ వర్సెస్ గవర్నమెంట్ మధ్యప్రదేశ్ 2022 కేసుల్లో కూడా దరిదాపుగా కృష్ణమూర్తి కేసులోని తీర్పునే కొంత మార్పులు చేర్పులతో తీర్పులు ఇచ్చారు. వికాస్ కిషన్‌రావు గవాలి వర్సెస్ మహారాష్ట్ర కేసులో జస్టిస్ ఖాన్విల్‌కార్ సుప్రీంకోర్టులో తీర్పు చెబుతూ ట్రిపుల్ టెస్ట్ పేరుపెట్టి కృష్ణమూర్తి కేసులో 3 అంశాలను సమర్థంగా చూడాలని చెప్పారు. అది లేదంటే బీసీ రిజర్వేషన్లు ఉండవు. ఇందుకోసం మహారాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ చీఫ్ సెక్రటరీని డెడికేటెడ్ కమిషన్‌గా వేశారు. ఈ కమిషన్ ద్వారా ప్రతి స్థానిక సంస్థలో ఎస్సీ, ఎస్టీలను లెక్కలోకి తీసుకుని వారి సంఖ్యను లెక్కకట్టి దానిని బట్టి బీసీలకు ఎంత ఇవ్వాలో చెబుతారు. ఈ లెక్కన స్థానిక సంస్థల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రిటైర్డ్ సి.ఎన్. ఫాటియానా ఆధ్వర్యంలోని డెడికేటెడ్ కమిషన్ సిఫారసు చేసింది. దాని ప్రకారం 2022లో రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. సంబంధిత స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలు 10 శాతం ఉంటే 40 శాతం బీసీలకు ఇవ్వవచ్చును. కానీ అక్కడి డెడికేటెడ్ కమిషన్ చెప్పిన దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లు 27 శాతం మించరాదు. సురేష్ మహాజన్ వర్సెస్ మధ్యప్రదేశ్ 2022 కేసులో తీర్పు చెబుతూ కృష్ణమూర్తి కేసులో మాదిరిగా ట్రిపుల్ టెస్ట్ పాటించాలి. దేశంలోని ప్రతి రాష్ట్రం బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఇచ్చేందుకు ట్రిబుల్ టెస్ట్ విధానం విధిగా పాటించాలని చెప్పటం జరిగింది. ఇదే విషయాన్ని ఇటీవల తెలంగాణ హైకోర్టు కూడా చెప్పింది.

మన రాష్ట్రంలో బీసీ కమిషన్‌ను రాష్ట్రప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌గా ప్రకటించిందని రాష్ట్రప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ చెప్పారు. ఇందుకు ఏ.జి.సుదర్శన్ రెడ్డి 3 నెలల గడువు అడిగితే హైకోర్టు సరేనంది. తెలంగాణ ప్రభుత్వం బీసీ కమిషన్‌నే డెడికేటెడ్ కమిషన్‌గా చెప్పింది. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో మాత్రం డెడికేటెడ్ కమిషన్‌ను సెపరేట్‌గా వేశారు. ఉత్తరప్రదేశ్‌లో బీసీల లెక్కలు తీసేందుకు క్వాంటిటేటివ్ కమిషన్ వేశారు. బిహార్‌లో 2022లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. బిహార్‌లో కులగణన చేసి విద్యా ఉద్యోగ రంగాలలో 65 శాతం రిజర్వేషన్లు ఇస్తే దాన్ని పాట్నా హైకోర్టు కొట్టివేసింది. ఈ మూడు కేసుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 50శాతం దాటవద్దు అంటున్నారు. అది కూడా 50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ, ఎస్టీలకు పోను బీసీలకు 23శాతం ఇవ్వటానికి కూడా డెడికేటెడ్ కమిషన్ చెప్పాలి. దీన్ని బట్టి ఎస్సీ, ఎస్టీలు 8శాతం కంటే తక్కువగా ఉన్న చోట మాత్రమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం ఉంటుందని భావించాలి. అది కూడా ఇక్కడ డెడికేటెడ్ కమిషన్ 42శాతం ఇవ్వాలని సిఫారసు చేసినప్పుడు మాత్రమే ఎస్సీ, ఎస్టీలు 8 శాతంగా ఉన్న దగ్గర సాధ్యమవుతుంది. మళ్లీ మొదటికొస్తే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 50శాతం దాటకూడదు. ఈ న్యాయపరమైన అంశాలను ఎదుర్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయబోతుందో కూడా చూడాలి. కులగణన చేశాం కాని కోర్టు తీర్పుల మార్గదర్శకత్వంలో నడవక తప్పదనే మాట చెప్పి ప్రభుత్వం తప్పుకుంటే మాత్రం రెండు కోట్ల మంది బీసీలు కన్నెర్రజేస్తారు.

• జూలూరు గౌరీశంకర్
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

77 ఏళ్ల శతాబ్దమే మనల్ని శాసిస్తోంది!

శతాబ్దం అంటే 100 సంవత్సరాలు! ఇది తెలియని వారెవరూ ఉండరు! కానీ శతాబ్దాలకు కుదింపులు ఉంటాయి. కత్తిరింపులు కుదురుతాయి. అవెందుకు జరుగుతాయి? ఆ అవసరం ఎందుకొస్తుంది? తెలుసుకోవాలంటే కిందటి శతాబ్దంలోకి వెళ్లాలి.

20వ శతాబ్దం మామూలుది కాదు. చరిత్రలోనే విశిష్టమైంది. విపరీతమైంది. విప్లవాలకు నెలవైంది. ఘోర యుద్ధాలకు కారణమైంది. మనిషి ఆలోచనా పరిధిని విశాలం చేసింది. సంకుచితమూ చేసింది. విజ్ఞానాన్ని ఉరకలెత్తించింది. ఉన్మాదాలకు ఊపు తెచ్చింది. ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. ఫాసిజాన్ని నెత్తిమీదకు తెచ్చింది. నాజీయిజాన్ని ఉసిగొల్పింది. ధనిక దేశాల దారుణాలను ప్రదర్శించింది. పేద దేశాల ప్రతిఘటనను పరుగులెత్తించింది. గాంధీని పుట్టించింది. గాడ్సేను లోకంలోకి వదిలింది. సమానతను నినదించింది. అసమానతను అందలమెక్కించింది. ప్రకృతిని విధ్వంసం చేసింది. పర్యావరణ చైతన్యాన్ని రగిల్చింది.

ఇంతటి విపరీతాల శతాబ్దం మరొకటి ఉందని చెప్పలేం. చరిత్ర గర్భం లోతుల్లోకి వెళ్లినా పోల్చతగింది దొరకదు! దాన్ని ఏమని పిలవాలి? నూరేళ్లకు తక్కువగా ఎందుకు కుదించాలి? జవాబులు కావాలనుకుంటే చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ 30 ఏళ్ల క్రితం రాసిన 'విపరీతాల యుగం'లోకి ప్రవేశించాలి. 'ద ఏజ్ ఆఫ్ ఇక్స్‌ట్రీమ్స్' పేరుతో ఆయన చేసిన రచన ఇప్పటికైనా, మరెప్పటికైనా చదవాల్సిన వాటిల్లో అగ్రభాగానే ఉంటుంది. 'విపరీతాల యుగం' రాసిన తర్వాత మరో 18 ఏళ్ల పాటు బతికినా ఆ యుగ లక్షణాలు అంతరించినట్టుగా ఎరిక్ భావించలేదు. 2012లో ఎరిక్ చనిపోయారు. 'విపరీతాల యుగం' వారసత్వం ఇప్పటికీ కొనసాగుతున్నట్టే కనపడుతుంది.

20వ శతాబ్దం అనగానే 1900 జనవరితో మొదలై 1999 డిసెంబర్‌తో ముగుస్తుందని భావిస్తాం. కానీ ఒక శతాబ్దానికి నిండునూరేళ్లు అవసరం లేదు! జీవితం.. మేలు, కీడు మలుపులు తిరిగిన కాలం వందేళ్ల లోపుగానే ఉండొచ్చు! అందుకనే 20వ శతాబ్దాన్ని విపరీతాల యుగంగా పరిగణించినా అది 1900లో ఆరంభం కాలేదు. 1999 ఆఖరునా అంతం కాలేదు. 1914తో అది మొదలై 1991తో ముగిసింది. దీన్నే ఎరిక్ సంక్షిప్త 20వ శతాబ్దంగా పేర్కొన్నారు. కచ్చితంగా చెప్పుకోవాలంటే 20వ శతాబ్దానికి 77 ఏళ్లే! ఆ అవధిలోనే విపరీతాలు జరిగాయి.

ఇక ఆ శతాబ్ది తుది అంకంలో తలెత్తిన సంక్షోభం నుంచి సమాజం ఎప్పటికి కోలుకుంటుందో చెప్పలేని పరిస్థితి ఉందనీ, ఆశనిరాశల్లో దేనివైపూ మొగ్గే దారి కనపడటం లేదనీ ఎరిక్ భావించారు. 1991 నాటి అభద్రత, సంక్షోభం, అస్థిరతలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచ గమనంపై ఈ శతాబ్దంలో స్పష్టత వస్తుందన్న ఆశాభావాన్ని ఎరిక్ వ్యక్తం చేసినా దాన్ని బలంగా చెప్పలేదు. విపరీతాల యుగం సృష్టించిన విపత్కర పరిస్థితి అంతటా ఆవరించిందనీ దాన్నుంచి బయటపడే వెలుగు రేఖ కన్పించటం లేదనే అభిప్రాయాన్నే వినిపించారు. పెద్ద సంఖ్యలో నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభాలు-మాంద్యాలు, ఉద్యోగాల నుంచి మనుషులను నిరంతరం తోసిపుచ్చే కొత్త సాంకేతికత, వ్యక్తి తన కేంద్రంగానే పెంచుకుంటున్న విపరీత సుఖవాద ధోరణి, సంఘ జీవితానికి అవసరమైన సామాజిక ప్రవర్తనపై విముఖత, హేతుబద్ధ ఆలోచన మందగించటం, మత దృక్పథాల పట్ల మమకారం, జాతి-ప్రాంత విధేయతల విజృంభణ జనాభా ప్రమాదకర స్థాయిలో పెరగటం... ఆ విపత్కర పరిస్థితిలో భాగాలే!

సంక్షిప్త 20వ శతాబ్దం 1914తో మొదలైందనటానికి బలమైన కారణముంది. మొదటి ప్రపంచ యుద్ధం ఆ ఏడాదే మొదలైంది. కనీవినీ ఎరగని వినాశనాన్ని తీసుకువచ్చింది. పౌరులు, ఆస్తులు, పరిశ్రమలు, ప్రాథమిక సౌకర్యాల లక్ష్యంగా విధ్వంసం సృష్టించటం ఆ యుద్ధంతోనే మొదలైంది. అంతకు ముందు ఆ దారుణం లేదు. 1914కు ముందు వందేళ్ల యూరపులో ప్రధాన యుద్ధాలేవీ జరగలేదు. మొదటి ప్రపంచ యుద్ధంతో అంతా తలకిందులైంది. విపరీతాలు మొదలయ్యాయి. ఆ యుద్ధం సృష్టించిన అల్లకల్లోలంలోనే రష్యా విప్లవం విజయవంతమైంది. కొత్త సమాజం నిర్మాణంతో పాటు శత్రువర్గ ప్రక్షాళన పేరుతో దారుణాలెన్నో అక్కడ జరిగాయి. ఆ తర్వాత చుట్టుముట్టిన ఆర్థిక మాంద్యం.. చెలరేగిన ఫాసిజం, నాజీయిజం, రెండో ప్రపంచ యుద్ధం (1939–1945).. ఇవన్నీ సృష్టించిన దారుణాలు, రక్తపాతాలు, మానవ హననాలను మహా వినాశన యుగంగా వర్ణించారు. మూడు దశాబ్దాలకు పైగా యుగం కొనసాగింది. దాదాపు 19 కోట్ల మంది ఆ యుగంలో బలయ్యారు. మరెన్నో కోట్ల మంది క్షతగాత్రులయ్యారు.

యుద్ధం తర్వాత ప్రపంచం కోలుకుంటుందని చాలామంది అనుకోలేదు. కానీ అనూహ్యంగా ప్రపంచం కోలుకుంది. 1945 నుంచి 1970 తొలినాళ్ల వరకూ ఆర్థికంగా ప్రపంచం పరుగులెత్తింది. దాన్నే ఆర్థిక స్వర్ణయుగంగా వర్ణించారు. ఆ ఆర్థిక స్వర్ణ యుగంలో సాధించిన వృద్ధిరేటును ఆ తర్వాత పాశ్చాత్య దేశాలు అందుకోలేదు. 1975 వచ్చేసరికి పరిస్థితి మారటం మొదలైంది. వృద్ధిరేటు మందగించింది. నిరుద్యోగం విజృంభించింది. ప్రభుత్వాల ఖర్చు పెరిగింది. దానికి తగ్గట్టు ఆదాయాల్లో వృద్ధి కనపడలేదు. పర్యావరణం ప్రమాదంలో పడింది. ఇంధనాలు హరించుకు పోసాగాయి. కాలుష్యం కమ్ముకు రాసాగింది. సంక్షేమ కార్యక్రమాలపై కోతలు మొదలయ్యాయి. ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణలు తగ్గితే వృద్ధిరేటు మళ్లీ పరుగులెత్తుతుందని భావించి అవీ చేశారు. ఫలితాలు రాలేదు. సోవియట్ రష్యా తూర్పు యూరపు దేశాల్లోనూ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలు మార్కెట్ ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడలేకపోయాయి. సాంకేతిక విజ్ఞానాభివృద్ధిలో 50ల నాటి స్థాయిని సోవియట్ యూనియన్ దాటలేకపోయింది. తిండి గింజలనే ఉత్పత్తి చేసుకో



■ రాహుల్ కుమార్

20వ శతాబ్దం అనగానే 1900 జనవరితో మొదలై 1999 డిసెంబర్‌తో ముగుస్తుందని భావిస్తాం. కానీ ఒక శతాబ్దానికి నిండునూరేళ్లు అవసరం లేదు! జీవితం.. మేలు, కీడు మలుపులు తిరిగిన కాలం వందేళ్ల లోపుగానే ఉండొచ్చు! అందుకనే 20వ శతాబ్దాన్ని విపరీతాల యుగంగా పరిగణించినా అది 1900లో ఆరంభం కాలేదు. 1999 ఆఖరునా అంతం కాలేదు. 1914తో అది మొదలై 1991తో ముగిసింది. దీన్నే ఎరిక్ సంక్షిప్త 20వ శతాబ్దంగా పేర్కొన్నారు. కచ్చితంగా చెప్పుకోవాలంటే 20వ శతాబ్దానికి 77 ఏళ్లే! ఆ అవధిలోనే విపరీతాలు జరిగాయి.



లేని దుస్థితిలో పడిపోయింది. 'పెరస్త్రోయికా–గ్లాస్‌నోస్ట్' పేరుతో ఆర్థిక రాజకీయ సంస్కరణలకు పూనుకున్నా అప్పటికే పరిస్థితి చేయి దాటింది. 1991 నాటికి కుప్పకూలిపోయింది. కాస్త అటుఇటుగా తూర్పు యూరపు దేశాలూ రాజకీయంగా పతనమయ్యాయి. మధ్య ఆసియా రిపబ్లిక్కులు స్వతంత్ర దేశాలుగా ఏర్పడ్డాయి. యూగోస్లావియా ముక్కచెక్కలైంది. ఈ అన్ని పరిణామాలతో 1991ల నాటికి ప్రపంచ స్వభావం పూర్తిగా మారిపోయింది.

విపరీతాలు ఆధారంగా శతాబ్దాన్ని 77 ఏళ్ల కాలానికే పరిమితం చేసినా దాని ఆరంభ, ముగింపుల్లో కొన్ని మార్పులు కొట్టొచ్చినట్లు కనపడతాయి. 1991 నాటికి ప్రపంచ జనాభా 540 కోట్లకు చేరింది. మొదటి ప్రపంచ యుద్ధం నాటితో పోల్చితే మూడు రెట్లకు పైగా పెరిగింది. 1900లతో పోల్చితే ప్రజలు ఎత్తు పెరిగారు. బలిష్టులయ్యారు. జీవిత కాలమూ పెరిగింది. మెజారిటీ ప్రజలు చదువరులయ్యారు. వస్తూత్పత్తులు, ఆహారధాన్యాల్లో అసాధారణ ఎదుగుదల నమోదైంది. సాంకేతిక పరిజ్ఞానంలో ఎన్నో విప్లవాలు వచ్చాయి. రవాణా, ప్రసార రంగాలు దూరాభారాలను తగ్గించాయి. 1914లో చక్రవర్తులకు సైతం లభించని వినోదం సాధారణ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. వ్యవసాయం, పశుపాలన ఆధారంగా పదివేల ఏళ్లు కొనసాగిన జీవితం నుంచి మెజారిటీ ప్రజలు ఈ శతాబ్దంలోనే వైదొలగారు. స్త్రీపురుష సమానత్వం స్థిరపడటం మొదలైంది. సంక్షేమ రాజ్యభావన (1970ల చివరి వరకు) బలపడింది.

ఇంతకంటే ముఖ్యమైన మూడు పరిణామాలను ఎరిక్ ప్రస్తావించారు. 1914 నాటికి యూరపు కేంద్రంగా ఉన్న ప్రపంచం 1990ల నాటికే పూర్తిగా మారిపోయింది. శాస్త్ర, సాంకేతిక, సైన్య, మేధో, ఆర్థిక శక్తి పరంగా యూరపు 1914 నాటికి ఉచ్ఛ స్థితిలో ఉంది. ప్రపంచం జనాభాలో మూడోవంతు ఉండేది. 1991ల నాటికి ఆరో వంతుకు పడిపోయింది. కనీస స్థాయిలో జనాభాను నిలబెట్టుకోలేని స్థితికి చేరుకుంది. సంతాన వృద్ధిరేటు సున్నాకు పడిపోతున్న పరిస్థితీ కనపడుతోంది. పరిశ్రమలన్నీ యూరపు నుంచి తరలిపోసాగాయి. ఒకనాటి గొప్ప రాజ్యాల్లో కొన్ని అంతరించాయి. కొన్ని స్థానిక శక్తులుగా ఉనికిని కొనసాగిస్తున్నాయి. అమెరికా మాత్రమే దీనికి మినహాయింపు. యూరపుతో పోల్చితే జనాభాను పెంచుకుంది. అన్ని రకాల ఆధిపత్యాలను 1990ల నాటికి నిలబెట్టుకుంది.

ఆర్థికంగా చూస్తే 1991 నాటికి దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోయాయి. దీన్ని రెండో కీలక పరిణామంగా చెప్పుకోవచ్చు. ప్రపంచ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి చేయటం సాధారణమైంది. ఉత్పత్తుల అమ్మకాలకు కొనుగోళ్లకు ప్రాదేశిక సరిహద్దులు చెరిగిపోయాయి. అంతర్జాతీయ వ్యాపార ఉధృతికి, వాటి కోసం ప్రవేశపెట్టిన వాణిజ్య విధానాలతో సర్దుకుపోవాల్సిన పరిస్థితుల్లో జాతీయ ప్రభుత్వాల అధికారాలు తగ్గిపోయాయి. మరోవైపు సంస్కృతుల సరిహద్దులు పలచబడిపోవటం మొదలయ్యాయి. విలువలన్నీ కలగాపులగంగా అవ్వసాగాయి. లాభదృష్టి, స్వీయ సంతృప్తి కేంద్రంగా వ్యక్తుల ప్రవర్తనా, ఆలోచనలూ రూపుదిద్దుకోవటం మూడో పరిణామంగా భావించాలి. అన్నిటికంటే ఆందోళనకరమైంది ఇదే! మనుషుల మధ్య సామాజిక సంబంధాలు, బాధ్యతలు చెదరిపోతున్నాయి. తరాల మధ్య బాంధవ్యాలు తెగిపోతున్నాయి. స్వలాభమే ప్రధానంగా సాగే ఆర్థిక వ్యవస్థ మనుషులను స్వీయ లాభదృష్టి కోసం వెంపర్లాడే జీవులుగా మార్చుతుంది. క్యాపిటలిజం మనుషుల మధ్య అన్ని సంబంధాలను ఆర్థిక సంబంధాలుగా మార్చివేస్తుందని కాల్ మార్క్స్ ఎప్పుడో చెప్పినా వాస్తవ జీవితంలో వ్యవహారాలు అలా నడవలేదు. అంకితభావం, పనిపట్ల నిబద్ధత, పరస్పర విశ్వాసం, నైతిక కట్టుబాట్లు, మాట నిలకడ ఉద్యోగుల్లో ఉండాలని పరిశ్రమల యజమానులు కోరుకుంటారు. కోరుకోవటమే కాదు వాటిని పెంపొందించటానికి విశ్వప్రయత్నాలు చేస్తారు. ఇవి ఎంతో కొంత లేకుండా పరిశ్రమలు నడవవు. లాభాలూ రావు. అంటే క్యాపిటలిజం పూర్వవిలువలన్నిటినీ ధ్వంసం చేయలేదు. పనికొచ్చే వాటిని వాడుకుంది. మొదటికే మోసం వచ్చినట్లు ఆర్థిక వ్యవస్థకు ప్రధాన సూత్రంగా ఉన్న స్వీయలాభ దృష్టి అన్ని సంబంధాలను దెబ్బతీస్తోంది. సమాజ అస్తిత్వానికే ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వాల అదుపులేని ఆర్థిక వ్యవస్థ.. ఒక సంక్షోభం వెనక మరో సంక్షోభాన్ని మోసుకొస్తుంటే, మరోవైపు ప్రత్యామ్నాయ సోషలిస్టు ప్రయోగాలూ విఫలమయ్యాయి. అందుకే విపరీతాల యుగం సృష్టించిన సంక్షోభాల నుంచి గట్టెక్కటానికి ఊతం ఇంకా దొరకటం లేదనే చెప్పాలి!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)





రోగమొస్తే.. రోదనే!

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ అధ్వానం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పాలకులు మారుతున్నా.. సర్కారు ఆస్పత్రుల్లో సమస్యలు మాత్రం తీరటం లేదు. వైద్యరంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రి(ఎంజీఎం)లో వైద్య సేవలు మెరుగు పడటం లేదు. పలు ఆరోగ్య సమస్యలతో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వచ్చే రోగులకు ఆస్పత్రిలో అగచాట్లే ఎదువుతున్నాయి. ఉచిత మందులు, వైద్య పరీక్షలన్నీ ఉత్తమాటలుగా వి ఎగులుతున్నాయి. టెస్టులకు కిట్లుండవు.. ఫార్మసీల్లో మందులుండవు. సూది మందు నుంచి సెలైన్ వరకు అన్ని బయట కొనాల్సిందే. రాత్రివేళ జన్మించే పిల్లలకు ఎక్స్‌రేలు తీసేందుకు ఆపరేటర్లు అదుబాటులో ఉండరు. కార్డియలాజీ, న్యూరో, డెంటల్, ఈఎన్‌టీ తదితర వి భాగాల్లో పూర్తిస్థాయిలో వైద్యులు కరువు. గత ప్రభుత్వమే పేదల దవాఖానాను గాలికి వదిలేసిందని భావిస్తున్న ప్రజలకు కాంగ్రెస్ సర్కారు కూడా అదేబాటలో నడుస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రక్త పరీక్షలకు కిట్ల కొరత

ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రిగా ఉన్న వరంగల్‌లోని ఎంజీఎంకు ఉమ్మడి వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల నుంచి వైద్య పరీక్షల కోసం ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో నిత్యం సుమారు నాలుగైదు వేల మందికి పైగా ఓపీ, ఐపీ సేవలు పొందుతున్నారు. ఎంజీఎం ఆస్పత్రితో పాటు అనుబంధంగా ఏర్పాటు చేసిన కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని 21 విభాగాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే తాజాగా వరంగల్ ఎంజీఎంలో రక్త పరీక్షలకు కొరతొచ్చింది. ఎన్నడూ లేని విధంగా గురువారం ఎంజీఎం ల్యాబ్‌లో బ్లడ్ కంటైనర్స్ లేవని రక్త పరీక్షలు నిర్వహించకపోవడంతో రోగులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు పెట్టాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఏ వైద్యం చేయాలన్నా మొదటి బ్లడ్ టెస్ట్ చేయాలని వైద్యులు సూచిస్తారు. అలాంటి బ్లడ్ టెస్టులు ఎంజీఎంలో కరువవ్వటంతో రోగుల బాధలు వర్ణణాతీతంగా మారుతున్నాయి. అలాగే థైరాయిడ్, షుగర్, హెచ్‌ఐవీ, క్యాన్సర్ తదితర వాటి కోసం బయో కెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ టెస్టులు చేసేందుకు ల్యాబరేటరీల్లో కెమికల్స్ ఎప్పుడు అందుబాటులో ఉంటాయో.. ఎప్పుడు ఉండవో ఆ దేవుడికే తెలియాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అత్యవసర పరీక్షల కోసం వచ్చే రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. గుండె జబ్బులకు సంబంధించి నిర్వహించే టూడీ ఎకో పరీక్షలు కూడా భారంగా మారాయి. ఒక్కో సారి టెక్నీషియన్లు లేరని రోగులును ప్రవేటు ఆస్పత్రులకు పంపించిన సందర్భాలున్నాయి. ఇన్ఫ్రాస్ట్రక్చర్ పాడైపోతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. గ్యాస్ట్రో డిపార్ట్‌మెంట్‌లో కొలనోస్కోపీ, ఎండో స్కోపీ యంత్రాలు పాడై పనికి రాకుండా పోవటంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. ఇక రాత్రిపూట డెలవరీ అయిన తరువాత అప్పుడే పుట్టిన బిడ్డలో కొన్ని సమస్యలు ఉత్పన్నమవ్వటం సాధారణమే. అయితే బిడ్డలో ఏ సమస్య ఉందో తెలుసుకునేందుకు అప్పుడప్పుడు వైద్యులు ఎక్స్‌రే, స్కానింగ్‌కు రిఫర్ చేస్తారు. కానీ రాత్రిపూట ఎక్స్‌రే, స్కానింగ్ విభాగాల్లో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం బాధితులకు నరకయాతనగా మారతోంది. దాంతో తెల్లవారుజామున సిబ్బంది వచ్చే వరకు ఎదురు చూడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. బిడ్డ సమస్య తీవ్రంగా ఉంటే అర్ధరాత్రి వేళ ప్రైవేటు ఎక్స్‌రేలు, స్కానింగ్ సెంటర్లకు వెళ్లి డబ్బులు చెల్లించి చేయించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎంలో తరుచుగా డయాగ్నస్టిక్ సెంటర్‌లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈసీజీ విభాగంలో తగిన సంఖ్యలో మహిళ సిబ్బంది లేకపోవటంతో ఈసీజీలను తీయడానికి సమస్యలు ఎదురవుతున్నాయి. టెక్నీషియన్ల కొరతతో కిడ్నీవ్యాధిగ్రస్థులు డయాలసిస్ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని వాపోతున్నారు. తరచూ కంప్లీట్ బ్లడ్ కౌంట్(సీబీసీ) మెషిన్ మరమ్మతులకు గురవుతుండటంతో బాధితులను ప్రైవేట్‌కు రిఫర్ చేస్తున్న సంఘటనలు ఇటీవలకాలంలో వెలుగు చూస్తున్నాయి.



- తీరు మారకపోవడంతో ప్రజల ఇబ్బందులు
- ఫార్మసీలో మందుల కొరత
- పెయిన్ కిల్లర్, విటమిన్ టాబ్లెట్లూ కరువే..
- కిట్లు, కెమికల్స్ లేక పలు నిర్ధారణ పరీక్షలకు బ్రేక్
- బ్లడ్ కంటెయినర్స్ లేవంటూ టెస్టులు చేయని సిబ్బంది
- రాత్రివేళ ఆపరేటర్లు లేక నిలిచిపోతున్న ఎక్స్‌రే, స్కానింగ్
- కిడ్నీవ్యాధిగ్రస్థులకు తప్పని డయాలసిస్ కష్టాలు
- పేద బతుకులకు పరీక్ష పెడుతున్న సర్కారు దవాఖానా
- ఎంజీఎం సమస్యలపై దృష్టిపెట్టని మంత్రులు, ఎమ్మెల్యేలు





మందు గోళీలు కరువాయే..

ఎంజీఎం ఆస్పత్రిలో మందు గోళీల కొరత కొనసాగుతూనే ఉంది. కొన్నాళ్లుగా ఎంజీఎం ఫార్మసీలో సరిపడా మందులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఉండే పీహెచ్‌సీల్లో లభ్యమయ్యే విటమిన్, పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు కూడా ఎంజీఎం ఫార్మసిలో లభ్యం కావటం లేదు. ఆస్పత్రిలో వివిధ సర్జరీల తరువాత నొప్పి బాధ తెలియకుండా ఉండేందుకు వైద్యులు పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు వాడమంటారు. అయితే ఫార్మసిల్లో ఈ టాబ్లెట్ల కృత్రిమ కొరతను సృష్టించి ప్రైవేటు మెడికల్ షాపులకు గిరాకీ పెరిగేలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో రోగుల నుంచి ఫిర్యాదులు రావటంతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఫార్మసిని తనిఖీ చేసి, వాస్తవాలను నివేదిక రూపంలో ఇవ్వమని మంత్రి కోరారు. దీంతో డాక్టర్ కడియం కావ్య ఎంజీఎం ఫార్మసీని పరిశీలించి అవాక్కయ్యారు. పీహెచ్‌సీల్లో లభించే మందులు కూడా ఎంజీఎంలో అందుబాటులో లేకపోవటం పట్ల ఎంపీ విస్మయం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి ఎంపీ నివేదికను అందిచినట్టు సమాచారం. కాగా, ఎంజీఎంలో సుమారు 200రకాలకు పైగా మందులు అందుబాటులో ఉండాల్సి ఉంది. అయితే కొన్ని సాధారణ రకాల మందులు మాత్రమే ఎంజీఎం ఔషధ షాపుల్లో ఇస్తున్నారు. మిగతా మందుల కోసం బయట ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. దీంతో వేలాది రూపాయలు మందులకే ఖర్చు అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. ఇంతా పెద్దాస్పత్రిలో మందు గోలీ కూడా కరువైందని రోగులు గగ్గోలు పెడుతున్నారు.

పేదల దవాఖానాపై సర్కారు నిర్లక్ష్యమేల?

బీఆర్‌ఎస్ హయాంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్లక్ష్యానికి గురైందనే ఆరోపణలున్నాయి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా పేదల ఆస్పత్రిలో మెరుగైన సేవలపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోనే ఎంజీఎం ఉన్నా ప్రభుత్వ పట్టింపులేదని, ఈ పది నెలల కాలంలో ఒక్కసారి కూడా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి ఎంజీఎం ఎదురుగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేసినా పేదల ఆస్పత్రిలో సౌకర్యాలను పరిశీలించేందుకు ఎంజీఎంలోకి రాలేదనే విమర్శలున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రెండు సార్లు వరంగల్ పర్యటనకు వచ్చినా ఎంజీఎం ఆస్పత్రిలో సమస్యలపై సమీక్షించలేదని ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇక ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నగరంలో ఉన్న అన్ని సమస్యలపై సమీక్షిస్తున్నప్పటికి ఎంజీఎంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని, పేదల పక్షాన గళం వినిపించే మంత్రి సీతక్క కూడా ఎంజీఎంలో పేదలకు కనీస వైద్య సౌకర్యాలు కల్పించేందుకు కలగచేసుకోవటం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎంజీఎంలో సమస్యలను పరిష్కరించకుండా దాటవేసే ప్రయత్నాలు చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడప్పుడు ఎంజీఎం అస్పత్రి సమస్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మినహా మిగతా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ అస్పత్రి సేవలు ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కనిపించటం లేదనే చర్చ జరుగుతోంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ చూపి ఎంజీఎంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయటంతో పాటు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందేలా దృష్టిపెట్టి అభివృద్ధి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతాం



నర్సంపేట మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి భవన ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ



మెడికల్ కళాశాల, ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

- ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వరంగల్‌లో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, క్యాన్సర్ ట్రీట్మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి
- నర్సంపేటలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మంత్రులు పొంగులేటి, సురేఖతో కలిసి వైద్యకళాశాల, ఆస్పత్రి ప్రారంభం

7లో..

బల్దియాలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



బల్దియాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలోని పలు సెక్షన్‌లలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పలు సెక్షన్‌లలో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి సిబ్బంది వివరాలు తెలుసుకుని రిజిస్టర్‌లను పరిశీలించారు. సిబ్బంది ఎన్నిగంటలకు కార్యాలయాలకు వస్తున్నారు? ఏం పని చేస్తున్నారు? జాబ్‌చార్ట్‌పై అక్కడ పని చేసే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు షోకాజు నోటీజులు, విధులకు డుమ్మా కొట్టే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒక రోజు వేతనం కోత పెట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ విజయలక్ష్మి, సీ-1 సూపరిటెండెంట్ చీకటి ఆనంద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- గాంధీనగర్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ

వడ్డెపల్లి, సెప్టెంబరు 19: అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గాంధీనగర్‌లో రూ.40లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డితో కలిసి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 9 నెలలుగా మహానగరంలో ఎటువంటి భూ కబ్జాలు లేవని, రానున్న రోజుల్లో కబ్జాలు జరుగకుండా చూస్తానని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలో ఎటువంటి ముప్పులేకుండా ఉన్నప్పటికీ అత్యవసర నిధుల కింద గోకుల్‌నగర్ జంక్షన్ నుంచి కేయూ రోడ్డు వరకు రూ.కోటి నిధులను మంజూరు చేయించినట్లు వెల్లడించారు. తన పేరు చెప్పి ఎవరైనా ప్రలోభపెట్టి డబ్బులు వసూలు చేస్తే తనకు వెంటనే సమాచారాన్ని ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్ యాదవ్, గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య, కోశాధికారి అశోక్, మూగల కుమార్ యాదవ్, బంక రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ సైన్స్ సెంటర్‌కు హద్దులు పెట్టాలి

- ఆధునిక సైన్స్ పరికరాలను అందుబాటులో ఉంచాలి
- అత్యవసర పనులు జనవరిలోగా పూర్తి చేయాలి
- కలెక్టర్ ప్రావీణ్య
- మంత్రి పొంగులేటి ఆదేశాలతో ఎమ్మెల్యేతో కలిసి సెంటర్ పరిశీలన

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 19: రీజినల్ సైన్స్ సెంటర్ స్థలం ఆక్రమణకు గురికాకుండా అధికారులు హద్దులు పెట్టాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. ఈనెల 17వ తేదీ న హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసి న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రీజినల్ సైన్స్ సెంటర్‌కు నిధులు కేటాయించి అన్ని వనరులను కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కు ఎదురుగా ఉన్న రీజినల్ సైన్స్ సెంటర్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్‌లోని ఎస్సీ, ఎస్టీ సెల్ భవనంతో పాటు ఆడిటోరియం, ఇన్నోవేషన్ హబ్, ల్యాబ్, ప్రదర్శన యంత్రాలు, సైన్స్ పరికాలకు సంబంధించిన భవనాలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. సంబంధిత ల్యాబ్‌లు, ప్రస్తుతం ఉన్న



రీజినల్ సైన్స్ సెంటర్‌లోని పరికరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

మిగతా 8వ పేజీలో..

నాలాల ఆక్రమణలను ఉపేక్షించేది లేదు..

నాలాల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని, ఆక్రమణలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 17వ తేదీన హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనుల సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాలాలు, ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణల అంశాన్ని లేవనెత్తిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ప్రావీణ్య గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, రెవెన్యూ, మున్సిపల్, సాగునీటి పారుదల, కుడా, టౌన్ ప్లానింగ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాలాలు, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల ఆక్రమణల గురించి ఆయా శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలో నాలాలు, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో నాలాల అభివృద్ధి, విస్తరణకు ప్రణాళికలు రూపకల్పన చేయడానికి సంబంధిత అధికారులు సర్వే చేయించాలన్నారు. చెరువులు, కుంటలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేసి చెరువులు, కుంటల ఆక్రమణలు ఏ మేరకు జరిగిందనే వివరాల నివేదికను అధికారులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


పోతన ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ అందుబాటులోకి తీసుకురావాలి

పారిశుధ్య, ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19: పోతననగర్‌లోని చెత్త తరలించేందుకు ఉపయోగించే ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ మాట్లాడారు. శానిటేషన్ నిర్వహణకు సంబంధించిన వాహనాలకు షెడ్డుకు వస్తే వెంటనే రిపేరు చేసి పంపించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ శానిటేషన్ ప్రక్రియలో జాప్యం చేయకుండా చూడాలన్నారు. అధికారులు సమన్వయంలో పని చేయాలన్నారు. అన్ని డివిజన్‌లలో శానిటేషన్ సమస్య మెరుగుపడాలంటే సిబ్బంది, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే సాధ్యమవుతుందన్నారు. 66డివిజన్‌లలో వీధి దీపాల సమస్య రాకుండా చూడాలన్నారు. నయీంనగర్ సుందరీకరణలో భాగంగా వర్టికల్ గార్డెన్స్, తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, హెచ్‌వో రమేష్, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

ఐనవోలు, సెప్టెంబరు 19: బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన అలాకుంట మధు అనే యువకుడు అత్యాచారం చేశాడు. బాధితురాలు తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.























ఇక ఏడాదిలో రెండు దఫాలుగా

పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూలో కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా నోటిఫికేషన్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీలో ఇకపై ఏడాదిలో రెండు దఫాలుగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కోసం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సెప్టెంబరు 14న ఇదే విషయంపై 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ముందే ఆయా మార్గదర్శకాలను, వివరాలను వెల్లడిస్తూ కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన వర్సిటీ ఉన్నతాధికారులు.. నోటిఫికేషన్ వెలువరించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం న్యూఢిల్లీలోని యూజీసీ కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతీ ఏడాది జనవరి, జూలై నెలల్లో 2024-25 సవరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు నోటిఫికేషన్లు జారీ చేస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు అన్ని విభాగాల డీన్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విభాగాల వారిగా ఖాళీల మేరకు ప్రతీ ఏడాది రెండు దఫాలుగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఉత్తర్వులు విడుదల చేశారు. ఫెల్లోషిప్ అభ్యర్థులతో పాటు యూజీసీ నెట్, సీఎస్ఐఆర్, సీఈఈడీ, డీబీటీ, ఎఫ్‌పీడ్ల్యూడీ, డీఎస్‌టీ, ఇన్‌స్పైయిర్ ఆఫ్ ఎఫ్ఐపీ, క్యూఐపీ, సెట్, గేట్, జీపీఏటీ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల స్కోరు ఆధారంగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూ.ఏసీ.ఇన్‌లో చూడాలని పేర్కొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్

పోటీల్లో వరంగల్ సత్తా

బ్రాంజ్ మెడల్ సాధించిన శ్రీ చేతన్ శౌర్య

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరంలో ఈనెల 14 నుంచి 19 వరకు జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్స్ అండర్-13 బ్యాడ్మింటన్ పోటీలలో వరంగల్ జిల్లా బల్దియా ఇండోర్ స్టేడియం క్రీడాకారుడు శ్యామల శ్రీ చేతన్ శౌర్య ప్రతిభ కనబరిచాడు. జాతీయస్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు బల్దియా ఇండోర్ బ్యాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్‌రావు గురువారం వెల్లడించారు. శ్రీ చేతన్ శౌర్య ఇటీవల దేశవ్యాప్తంగా పలు చోట్ల జరిగిన ర్యాంకింగ్ టోర్నమెంట్‌లలో డబుల్స్‌లో ఇండియాలో 3వ ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారుడిని వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రమేష్‌రెడ్డి, బల్దియా స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్‌లింగం, కోచ్ శ్రీధర్‌రావులతోపాటు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించిన శ్రీ చేతన్ శౌర్య

అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక

కేయూ ఇంజనీరింగ్ స్టూడెంట్ సాత్విక ఎప్పీకి అరుదైన అవకాశం



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి లాదెళ్ల సాత్విక ఎప్పీకి అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3, 4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్మాత్మక వరల్డ్ ఫోరం 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఇన్ రీసెంట్ చాలెంజెస్ ఇన్ ఇంజనీరిగ్ అండ్ టెక్నాలజీ -2024' అనే అంతర్జాతీయ సదస్సుకు హాజరు కానుంది. ఈ మేరకు సదస్సు సెక్రటరీ డాక్టర్ ఫ్రాంక్ హోవర్డ్ నుంచి లాదెళ్ల స్వాతిక ఎప్పీకి ఆహ్వానం అందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. సదస్సులో స్వాతిక ఎప్పీ 'అన్ ఇంప్రూవ్‌డ్ రాండమ్ ఫారెస్టు ఆల్‌గోరిథమ్ ఫర్ ఫెటల్ హెల్త్ క్లాసిఫికేషన్' అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైన స్వాతిక ఎప్పీని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

రైల్వే మూడోలైన్‌ను పరిశీలించిన సేఫ్టీ కమిషనర్

కాజీపేట, సెప్టెంబరు 19: కాజీపేటలో గురువారం రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి రైల్వేట్రాక్‌లను పరిశీలించారు. ప్రత్యేక ట్రాలీలో ముందుగా కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు ట్రాక్‌ను పరిశీలించారు. కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగ మార్గంపై ఉన్న రైల్వే ట్రాక్‌ను పరిశీలించినట్లు తెలిసింది. సొరంగమార్గంతో పాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల శుక్రవారం సైతం కొనసాగనున్నాయి. త్వరలో ఈ ట్రక్‌ల ద్వారా రైళ్లు నడవనున్నాయి.

సీనియారిటీల ప్రకారమే బదిలీలు చేపట్టాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులను సీనియారిటీ ప్రకారమే బదిలీలు చేపట్టాలని, అలాగే కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఎన్నికలను నిర్వహించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు కలిసి విన్నవించారు. శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ మల్లారెడ్డిని తన చాంబర్‌లో వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ ఎస్.రాజేశ్, సతీశ్ తదితరులు కలిశారు. తమ సమస్యలను పరిష్కారించాలని కోరగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామని చెప్పినట్లు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు వెల్లడించారు.

హనుమకొండ ఆర్టీఏలో

ఆ ముగ్గురిదే ఇష్టారాజ్యం!

ఎవరి దందా వారిదే.. ఉన్నతాధికారులన్నా లెక్కలేని తనం

భరించలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన అధికారి?

రాంనగర్, సెప్టెంబరు 19: హనుమకొండ జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో ముగ్గురు అధికారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందని, వారు ఎవరి దందా వారు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్‌లు తదితర విధులు నిర్వహించే ఈ అధికారులకు ఉన్నతాధికారులంటే లెక్కలేదని, రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్, ఓవర్‌లోడ్ లాంటి విషయాల్లో ఈ ముగ్గురు ఎంతంటే అంత అనే చందంగా వ్యవహారం ఉంటోందనే విమర్శలున్నాయి. గత ఉన్నతాధికారి హయాంలో హవా కొనసాగించిన ఈ ముగ్గురు ప్రస్తుత అధికారి మాటలను లెక్కచేయడం లేదని, దీంతో సదరు ఉన్నతాధికారికి ఈ ముగ్గురికి మధ్య విధుల నిర్వహణలో తీవ్ర అభిప్రాయభేదాలు నెలకొన్నాయని, ఉన్నతాధికారి ఆదేశాలను వారు వినిపించుకున్న పాపాన పోలేదని తెలుస్తోంది.

వాస్తవానికి ఈ ముగ్గురిలో ఇద్దరు ఒకవైపు.. మరొకరు ఒకవైపు ఉన్నా.. ఉన్నతాధికారి విషయం వచ్చే సరికి ఆ ముగ్గురు ఒక్కటవుతారని తెలిసింది. శాఖాపరమైన ప్రతీ విషయంలో ఉన్నతాధికారికి ముగ్గురు అధికారులకు మధ్య సఖ్యత లేక ఇబ్బందులు తలెత్తుతుండటంతో పాటు కార్యాలయంలో నెలకొన్న పరిస్థితులతో ఆ ఉన్నతాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. ముగ్గురిని సమన్వయం చేయలేని స్థితిలో, తనకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆ ముగ్గురి దందాను అరికట్టడంలో విఫలమైన సదరు ఉన్నతాధికారి విధిలేని పరిస్థితిలో వీలుంటే వేరే జిల్లాకు, లేదంటే వలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మొత్తంగా ముగ్గురు అధికారుల వైఖరి శాఖకు ముప్పు తేవడంతో పాటు ఏకంగా ఓ ఉన్నతాధికారి ఉద్యోగం వదులుకునే పరిస్థితి తీసుకొచ్చిందంటే వారి దందా ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.



వైద్యకళాశాలలో ప్రదర్శనకు పెట్టిన అస్థిపంజర నమూనాను పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు

ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతాం..

ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

నర్సంపేటలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నర్సంపేట / నర్సంపేట టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యం కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతామని, ఇక్కడి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రూ.183కోట్లతో నిర్మించిన వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి భవనాన్ని గురువారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి దామోదర మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్లక్ష్యం చేసిందని, ఫలితంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రం ఏర్పడితే తమ తలరాతలు మారుతాయని, పిల్లల భవిష్యత్తు బంగారు బాట పడుతుందని ఆశించిన ప్రజలకు గత పదేళ్ల అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే గుర్తింపు కలిగిన ఓరుగల్లు జిల్లాను నాలుగు ముక్కలుగా చేసిన ఘనత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని, అలా అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి వరంగల్ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో వరంగల్‌లో మానవ అవయవాల ట్రాన్స్‌ప్లాంటేషన్ సౌకర్యాలు, క్యాన్సర్ ట్రీట్‌మెంట్ సెంటర్‌తో పాటు, ట్రామా సెంటర్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 40శాతం బదిలీలను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. 4వేల వైద్య పోస్టులతో పాటు, 2,050 నర్సింగ్ పోస్టులు, 450 ల్యాబ్‌టెక్నిషియన్ పోస్టులను భర్తీ చేశామన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం రూ.400కోట్లు అదనంగా ఖర్చు చేస్తోందని, రాష్ట్రంలో 9 కళాశాలలకు గాను నర్సంపేట మెడికల్ కళాశాలను ప్రారంభించామని, మిగిలిన 8 వైద్యకళాశాలలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు, వైద్య కళాశాలలకు వెళ్లడానికి నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయడంతో పాటు 102, 108, 104 అంబులెన్స్‌లను తీసుకొచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో వైద్య రంగానికి ప్రాధాన్యమిస్తున్న తమ ప్రభుత్వం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి రూ.2వేల కోట్లతో నూతన భవనాన్ని నిర్మించడానికి కృషి చేస్తోందన్నారు.



స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు చెక్కులను అందజేస్తున్న మంత్రులు



క్యాంటీన్‌లో వంటకాలను రుచి చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

మాది చేతల ప్రభుత్వం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, తొవిృదిన్నరేళ్ల రాష్ట్రాన్ని పాలిం చిన బీఆర్‌ఎస్ నేతలు తాము చేసిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. తాము ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 23లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. ఇంకా రూ.13వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉందని, సాంకేతిక కారణాలతో అవి ఆగాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తామన్నారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే నర్సంపేటలోని మెడికల్ కళాశాల, 170 పడకల జనరల్ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం కోసమే ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల సౌకర్యం కల్పించిందన్నారు. రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కోసం ప్రభుత్వం రూ.657కోట్లను కేటాయించి విద్య పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అన్ని కులాలకు చెందిన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు రూ.100 నుంచి రూ.110కోట్లను వెచ్చించామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మిషన్ భగీరథ పథకం కింద ప్రజలకు తాగునీరు అందలేదన్న విషయం విషయం తాము అధికారంలోకి వచ్చాక నిర్వహించిన సర్వేలో 53శాతం మంది ప్రజలు చెప్పారన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పంట, ఆస్తుల నష్టం భారీగా జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి వరద ప్రాంతాలను స్వయంగా పరిశీలించారని, 44 గంటల్లోనే బాధితులను ఆదుకున్నామన్నారు. త్వరలోనే అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పథకం కింద 15 నుంచి 20వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ఇదంతా ప్రజలు గమనించారన్నారు. ఇక కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లేకపోయినా ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు దొంతి మాధవరెడ్డి అండగా ఉన్నారంటూ మంత్రి పొంగులేటి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మహిళా సంఘాల సభ్యులకు చెక్కులను అందజేశారు. మహిళా క్యాంటీన్‌ను సందర్శించి అక్కడి వంటకాలను రుచిచూశారు.

మహిళల సాధికారత కోసం క్యాంటీన్లు : సురేఖ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వం మహిళలు సాధికారత కోసం క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో నర్సంపేటలో మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మారుమూల గ్రామీణ ప్రాంత మహిళలు హైదరాబాద్‌కు మెరుగైన వైద్యం కోసం తరలివెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాం నాయక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, డీఎంఈ వాణి, డీసీపీ రవీందర్, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు బెల్లయ్యనాయక్, రియాజ్, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రారంభోత్సవానికి హాజరైన మహిళలు



సీపీకి పూల మొక్క అందిస్తున్న ఏసీపీ భోజరాజు

సీపీని కలిసిన క్రైమ్ ఏసీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19: వరంగల్ కమిషనరేట్ క్రైమ్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన భోజరాజు సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన భోజరాజు గురువారం సీపీని కలిసి మొక్కను అందించారు.

ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి రాజీనామా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపాల్ సీహెచ్. రణధీర్‌రెడ్డి తప్పుకున్నారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి తన రాజీనామా పత్రాన్ని అందచేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. తన రాజీనామాపై వర్సిటీ రిజిస్ట్రార్ చాంబర్‌లో దాదాపు 3, 4గంటల పాటు చర్చించినట్లు తెలిసింది. అయితే వర్సిటీకి నూతన వైస్‌చాన్స్‌లర్ వచ్చేవరకు ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డి రణధీర్‌రెడ్డిని కోరినట్లు తెలిసింది. అయితే తాను కొనసాగలేనని, తన రాజీనామాను ఆమోదించాలని రణధీర్‌రెడ్డి కోరినట్లు సమాచారం.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19: జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న ఇల్లందుల రత్నంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రత్నం కొంతకాలంగా చిరు వ్యాపారస్తులు, కూలీలతో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో దాడి చేసి రూ.వెయి నగదును స్వాధీనం చేసుకుని రత్నంను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం రత్నంను ఘనపూర్ పోలీసులు అప్పగించారు.

కేయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతరకోర్సుల 1, 3, 5 సెమిస్టర్ల పరీక్షల ఫీజులను సెప్టెంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పి.తిరుమలదేవిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50అపరాధ రుసుంతో అక్టోబరు 4 ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని వారు కోరారు.

బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి

● రాష్ట్రానికి కేంద్రం అన్నివేళలా అండగా ఉంటుంది ● హైడ్రాపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి..
● బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



జనగామలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఈటల రాజేందర్

జనగామ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని, రాష్ట్రానికి కేంద్రం అన్నివేళలా అండగా ఉంటుందని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో జనగామ జిల్లాకేంద్రంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఈటల అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. రవాణా సౌకర్యాలను మెరుగుపరచారని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల సరళీకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలు ఉన్నాయన్నారు. అలాంటే తెలంగాణ అభివృద్ధికి కూడా కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసిరాకపోవడం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు.

పేదల ఇళ్లు కూల్చితే సహించం

హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చాలని చూస్తే సహించబోమని హెచ్చరించిన ఈటల హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు హైడ్రా శ్రీరామ రక్ష అని సీఎం భావిస్తే అసెంబ్లీలో చర్చకు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చెరువులు, వాగుల రక్షణ జరగాలని, అక్రమ కట్టడాలను అరికట్టాలనే బీజేపీ కూడా కోరుకుంటోందని స్పష్టం చేశారు. తానే తొలి ముఖ్యమంత్రి అయినట్టుగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడే పుట్టినట్టుగా, సమాజహితాన్ని తాను ఒక్కడే కోరుకుంటున్నట్టుగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలోని ముఖ్యమంత్రులు తప్పులు చేస్తే తానే సరిదిద్దుతు న్నట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అన్ని రకాల అనుమతులు ఉండి, ఏళ్లుగా ట్యాక్సులు కడుతున్న నిర్మాణాలను చట్టబద్ధత లేని హైడ్రా ద్వారా ఎలా కూల్చుతారని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, నాడు ప్రభుత్వ అనుమతులతో కట్టుకున్న కాలనీలకు సైతం నోటీసులు ఇచ్చి కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలా చేయడానికి తెలంగాణ రేవంత్‌రెడ్డి అబ్బ జాగీరా అని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి చెరువుల రక్షణ విషయంలో నిజాయితీ ఉంటే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరిగిన ఆక్రమణలపై ఏం చేయాలన్న దానిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. తన పలుకుబడిని పెంచుకోవడం కోసం, పార్టీలో ఉన్న సమస్యలను దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి ఇలా చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటే కళ్లు నెత్తికి ఎక్కిన కేసీఆర్‌కు ఏ గుణపాఠం చెప్పారో రేవంత్‌రెడ్డికి కూడా ప్రజలు అదే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, విద్యాసాగర్, జిల్లా నాయకులు శివరాజ్‌యాదవ్, రాజశేఖర్, సౌడ రమేశ్, బీజేవైఎం నాయకులు రాజవెంకటనర్సింహారెడ్డి, రవి, రాజేశ్, ఉల్లెంగుల రాజు, కీర్తి వెంకటేశ్ తదిరుతులు పాల్గొన్నారు.


జ్యోతిష్యంలో అందెవేసిన ‘చేయి’

● భవిష్యత్తు దిక్సూచి సుదర్శనాచార్యులు ● ఇప్పటికే పలు అవార్డులు, సత్కారాలు
● 22న గౌరవ డాక్టరేట్, స్వర్ణకంకణం బహూకరించనున్న టీటీడీ దేవస్థానం

సంగెం, సెప్టెంబరు 19: జ్యోతిష్యంలో ఆయనకు ఆయనే సాటి.. ఆయన పాండిత్యం అందరిని మంత్రముగ్ధులను చేస్తోంది. గ్రామీణ ప్రాంతంతో పాటు పట్టణాలకు చెందిన వారికి ఆయన జ్యోతిషంపై అపార నమ్మకం. శుభకార్యాలు కానీ, ముహూర్తాలు కానీ, మంచి, చెడు, ప్రయాణాలు, విద్య, వివాహ తదితర ఏ కార్యక్రమానికైనా ఆయన పెట్టిందే ముహూర్తం. చెప్పిందే సత్యం. అదీ ఆయనకు ప్రజలపై ఉన్న నమ్మకం. ఆయనే వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఊకల్ నాగేంద్రస్వామి ప్రధా న అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు. బుధవారం ఏకంగా ఇటీవల పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆలయాన్ని సందర్శించడం తో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది.



మాజీ గవర్నర్ రోశయ్య చేతుల మీదుగా జ్యోతిష విశారద అవార్డును అందుకుంటున్న సుదర్శనాచార్యులు (ఫైల్)



పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పట్టాతో..

విద్యాభ్యాసం - అవార్డులు

వరంగల్ జిల్లా సంగెం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కృష్ణమాచార్యులు - విజయలక్ష్మి రెండో కుమారుడు సముద్రాల సుదర్శనాచార్యులు జ్యోతిష్యంలో దిట్ట. వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్నారు. చిన్నప్పటినుంచే పౌరహిత్యం తండ్రి ద్వారా వారసత్వంగా అబ్బింది. చింతలపల్లి, ఊకల్ నాగేంద్రస్వామి ఆలయాల్లో అర్చకత్వం చేస్తే భక్తులకు సేవలందిస్తున్నారు. కాగా, ప్రాథమిక, ఉన్నత విద్యను చింతలపల్లి, సంగెం గ్రామాల్లో పూర్తి చేశారు. పొట్టిశ్రీరాముల తెలుగు యూనివర్సిటీలో జ్యోతిష్యంలో ఎంఏలో పట్టా అందుకున్నారు. 2018లో అప్పటి తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా చెన్నైలో జ్యోతిష్య విశారదను అందుకున్నారు. అంతర్జాతీయ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జ్యోతిష్య ప్రజ్ఞ ప్రావీణ్య, సర్వేజనా సుఖీనోభవంతు సంస్థ నేతృత్వంలో జ్యోతిష్యరత్న అవార్డులను అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అధ్వర్యంలో కిందటేడు వేదాంగ జ్యోతిష్య అవార్డును పొందారు. ప్రస్తుతం అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీలో హస్తరేఖ ఫలితాలపై పీహెచ్‌డీ చేస్తున్నారు. సముద్రాల సుదర్శనాచార్యులకు భార్య భార్గవి, కుమారుడు శ్రీహర్ష, కూతురు శ్రేయ ఉన్నారు.

టీటీడీ డాక్టరేట్, స్వర్ణ కంకణం

సముద్రాల సుదర్శనాచార్యులకు జ్యోతిష్యంలో ఉన్న పాండిత్యాన్ని గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు.. ఆయనకు స్వర్ణకంకణంతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ మేరకు తిరుమల దేవస్థానంలో టీటీడీ వేద విజ్ఞాన పరిషత్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే సమ్మేళనంలో వీటిని అందించనున్నారు. ఇప్పటికే సుదర్శనాచార్యులకు టీటీడీ అర్చకుల నుంచి ఆహ్వానం అందింది. దీంతో వరంగల్ నుంచి శుక్రవారం రాత్రి సుదర్శనాచార్యులు తిరుమలకు బయలుదేరి వెళ్లనున్నారు.

ఊకల్ నాగేంద్రస్వామి దయతోనే..
జ్యోతిష్య పండితుడు సముద్రాల సుదర్శనాచార్యులు



ఊకల్‌లో గల నాగేంద్రస్వామి ఆశీర్వాదంతో తండ్రి నుంచి నేర్చుకున్న పౌరహిత్యమే నన్ను ఇంతటి వాడిని చేసింది. ప్రతీ మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తూ స్వామి వారి తీర్థప్రసాదాలను నా కుమారుడు శ్రీహర్ష సహకారంతో భక్తులకు అందిస్తున్నాం. జ్యోతిష్యంపై పాండిత్యం సంపాదించాలన్న పట్టుదలతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా. నాకు తెలిసిన జ్యోతిష్యాన్ని ప్రజలకు చెబుతూ సేవలందిస్తున్నా.. టీటీడీ వారు డాక్టరేట్, స్వర్ణ కంకణం ప్రకటించడం సంతోషంగా ఉంది.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు



పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ పోస్టర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరసింహారావు తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: ఈ నెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పీడీఎస్‌యూ 50వ స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు.

ఈ మేరకు శుక్రవారం కేయూలో పీడీఎస్‌యూ 50 వసంతాల పోస్టర్‌ను నరసింహారావు నేతృత్వంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని పేదలకు ఉచిత నాణ్యమైన, కామన్ విద్యను అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రాథమిక స్థాయి నుంచి వర్సిటీల స్థాయి వరకు విద్యను ప్రైవేట్ పరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో విద్య వ్యాపారమయమైందని ఎద్దేవా చేశారు. పీడీఎస్‌యూ పేద విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతోందని అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి పోరాటంలో నేతలు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, కోలా శంకర్, శ్రీపాద ప్రసాదరావు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, చేరాలు, వరహాలు, రమణయ్య, మధుసూదన్ రాజ్, మరోజు వీరన్నతో మరెందరో మరణించారని చెప్పారు. వారి త్యాగాలు వృథా కావని అన్నారు. ఓయూలో 50వ పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సంబురాల్లో ఉద్యమాన్ని సమీక్షించి, విద్యార్థి అమరుల స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ నేతలు అశోక్, సంగీత, అనూష, స్వాతి, నరేశ్, పృథ్వీ, అజహర్, రమేశ్, వీరేందర్, రాజు, సునీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుందర్‌రాజ్‌కు బుజ్జగింపులు

● పార్టీ మారకుండా బీఆర్‌ఎస్ నేతల చర్చలు ● కాంగ్రెస్ నేతలూ భేటీ

రాంనగర్, సెప్టెంబరు 19: మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు ‘ఆంధ్రజ్యోతి’ ప్రచురించిన కథనానికి ఆ పార్టీ నేతలు అప్రమత్తమయ్యారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్.. సుందర్‌రాజ్‌తో గురువారం చర్చలు జరిపారు. తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని సూచించారు. బీఆర్‌ఎస్‌ను వీడవద్దని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుందామని ఆయనకు సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు సైతం సుందర్‌రాజ్‌తో మాట్లాడి పార్టీ మారాలనుకునే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సూచించారు. కాగా, ఒకటిరెండు రోజుల్లో సుందర్‌రాజును బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్‌ను వీడే విషయమై తన సన్నిహితులతో సుందర్‌రాజ్ రోజంతా చర్చలు జరిపినట్లు సమాచారం.

కాగా, సుందర్‌రాజ్‌తో కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నేతలు చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో సుందర్‌రాజ్‌కు కాంగ్రెస్ కండువా కప్పాలని నిర్ణయం తీసుకున్న నేతలు.. బీఆర్‌ఎస్ నేతల చర్చలతో సుందర్‌రాజ్ యూ టర్న్ తీసుకునే అవకాశం ఉంటుందని, ఈలోగానే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. సుందర్‌రాజ్ చేరికపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించిన కాంగ్రెస్ నేతలు ఒకటిరెండు రోజుల్లో కాంగ్రెస్ కండువా కప్పించే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. పార్టీలోకి వస్తే సముచిత స్థానం కల్పించేందుకు హామీ ఇచ్చినట్లు సమాచారం.



తనిఖీ చేస్తున్న అధికారులు

ఎంజీఎం ఆవరణలోని దుకాణాల్లో అధికారుల తనిఖీలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 19: ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో అక్రమంగా వెలిసిన దుకాణాలపై జిల్లా యంత్రాంగం దృష్టి కేంద్రీకరించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ఎంజీఎంను సందర్శించిన సందర్భంలో వెలిసిన దుకాణాలపై ఆరా తీశారు. ఈ విషయంలో విచారణ జరపాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ ఎంజీఎం ఆవరణలో వెలిసిన దుకాణాలపై గురువారం ఆరా తీశారు. తాగునీటి నుంచి మొదలుకొని మాస్కుల వరకు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నట్లు రోగులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా ఎమ్మార్పీతో సంబంధం లేకుండా విక్రయాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. నాసిరకం సరుకులు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు కూడా కొందరు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన విచారణలో వెల్లడైన విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

బాలసముద్రం, సెప్టెంబరు 19: ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 10వ తరగతి గౌడ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల, గురుకులాల్లో చదివి 10/10 మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఈనెల 29న అందించనున్నట్లు సర్దార్ సర్వాయిపాపన్న, కొండిన్య పరపతి సంఘాల అధ్యక్షుడు అంబాల సూర్య నారాయణగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 10వ తరగతి మార్కుల మెమో, ఆధార్‌కార్డు, కులం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు హనుమకొండ నయీంనగర్‌లోని మోహన్ జూనియర్ కళాశాలలో అందజే యాల్సిందిగా కోరారు. హంటర్‌రోడ్డులోని గౌడ హాస్టల్‌లో ఈ నెల 29వ తేదీన ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 97012 75354 నెంబరులో సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు.

బల్దియా ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ'

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం బల్దియా పరిధిలోని 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ హైస్కూల్‌లో ఐటీసీ ఫౌండేషన్ వావ్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తడి, పొడి హానికరమైన చెత్త గురించి విద్యార్థులకు విశ్లేషించారు. చెత్త ద్వారా కలిగే ప్రయోజనాల గురించి చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, వావ్ కో- ఆర్డినేటర్ పవన్, పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శకాలనీలో ర్యాలీ

హనుమకొండ టౌన్ : దేశ స్వచ్ఛత సాధనలో భాగంగా గురువారం 53వ డివిజన్‌లోని ఆదర్శకాలనీలో వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ హీ సేవ ర్యాలీ నిర్వహించి కాలనీవాసులను చైతన్యపరిచారు. పరిశుభ్రత పాటిస్తూ స్వచ్ఛతకు తమ వంతు సహకారం అందిస్తామని కాలనీవాసులతో నగర పాలక సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. జవాన్లు దామెర శ్రీనివాస్, అనిల్, శాంతి, పారిశుధ్య సిబ్బంది రమేశ్, సుధాకర్, సులోచన, భాగ్య, ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తూడి విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, సభ్యులు ఏనుగుల రాంరెడ్డి, కాసగాని కుమారస్వామి, తీగల చంద్రమౌళి, పున్నం శ్రీను, గునిశెట్టి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలు అందరికీ అందాలి

కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: ప్రజలందరికీ ఇంజనీరింగ్ పరిశోధనా ఫలితాలను అందేలా చూడాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కేయూ సెనెట్‌హాల్‌లో ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భిక్షాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నిర్మాణాత్మకమైన ఆలోచన ఉండాలని చెప్పారు. కొన్నేళ్లుగా ఇంజనీరింగ్ రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అవపోసన పట్టుకోవాలని వివరించారు. టెక్నాలజీలో మార్పులు నిరంతరంలో చోటుచేసుకుంటాయని అన్నారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఇ.సురేశ్‌బాబు హాజరై 'సైబర్ సెక్యూరిటీ ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. టెక్నాలజీలో 5వ జనరేషన్ విప్లవం నడుస్తోందని చెప్పారు. టెక్నాలజీపై విద్యార్థులు విస్తృత అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. టెక్నాలజీలో భద్రత, గోప్యత ప్రధానమన్నారు. మల్టీడిసిప్లెన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధ్యాపకులు

అప్రోచ్ అవసరమని చెప్పారు. డ్రైవర్ రహిత కార్లు వస్తున్నాయని.. దీంతో ఇంజనీరింగ్ విద్య పాషన్‌తో పూర్తి చేయాలని కోరారు. ఇంజనీరింగ్ విద్యను చదవడం కల అని ఉద్బోధించారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌పై సరైన దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబును శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. 25నుంచి కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ కె.భిక్షాలు తెలిపారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న కేయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సెప్టెంబరు 22న కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 'ది గ్రేట్ రీ యూనియన్' పేరుతో నిర్వహిస్తామని కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి చేతుల మీదుగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 22న ఆదివారం ఉదయం 10.30గంటలకు కేయూ క్యాంపస్‌లోని పొలిటికల్‌సైన్స్ విభాగంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీవోఎస్ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వడ్డెపల్లి నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్, రిసెర్చ్ స్కాలర్ అంకిళ్ల శంకర్, కల్లెపల్లి ప్రశాంత్, ఇతర పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

24న నేషనల్ యూత్ ఫెస్టివల్ సైన్స్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19: జాతీయ యువ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 24న హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నేషనల్ యూత్ ఫెస్టివల్ సైన్స్ మేళాను నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫెస్టివల్ సైన్స్ మేళాలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సుగల వారు వినూత్న ఆవిష్కరణల పనిచేయు నమూనాలను సిద్ధం చేసి ప్రదర్శించాలని ఆమె కోరారు.

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులు గతంలో రూపొందించిన, ప్రస్తుతం రూపొందించిన నమూనాలను సైన్స్ మేళాలో ప్రదర్శనకు ఉంచాలని కోరారు. జానపద నృత్యాలు, కథా, రచన, కవిత్వం, పెయింటింగ్ తదితర పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులను సమాయత్తం చేసి పాల్గొనే విద్యార్థులకు సంబంధించిన వివరాలను డీఎస్‌వో ఎస్. శ్రీనివాసస్వామికి పంపించాలని సూచించారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 19: ప్రధాని నరేంద్రమోదీ జన్మనాన్ని పురస్కరించుకొని సేవ పక్షం కార్యక్రమంలో భాగంగా బీజేపీ యువ మోర్చా అధ్వర్యంలో గురువారం దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించి రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, రాష్ట్ర నాయకులు విజయ్ చందర్‌రెడ్డి, జిల్లా నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందం, గురిజాల శ్రీరాంరెడ్డి, ముత్యాల శ్రీనువాస్, చల్లా జైపాల్‌రెడ్డి, కడవేరు శ్రీనువాస్, కురిమిండ్ల సది, కల్యాణ్, అరణ్యరెడ్డి, శ్రీనువాస్‌రావు, శివ కళ్యాణ్, తిరుపతిరెడ్డి, యువ మోర్చా నాయకులు హరిశ్, శివ, రాముగౌడ్, సుమంత్, అభిషేక్, అనిల్, అజయ్, ఉషరాణి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలో నగర కళాకారులకే అవకాశం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 19: భద్రకాళి ఆలయంలో ప్రతీ ఏటా శరన్నవరాత్రివేడుకల పేరిట తొమ్మిది రోజుల పాటు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో ఈసారి కేవలం వరంగల్, హనుమకొండ నగర కళాకారులకే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో నగరంలోని అనేక రంగాలకు చెందిన కళాకారులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ క్రమంలో కేవలం నగరంలోని పేరున్న కళాకారులందరికీ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంతేగాక ఈ కార్యక్రమంలో కళాకారులతో పాటు పాల్గొనేందుకు విచ్చేసిన భద్రకాళి ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషుకు ఇదే విషయాన్ని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రముఖ సంగీత విద్వాంసుడు ప్రొఫెసర్ తిరుపతయ్య, సీనియర్ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీతాల రఘువేందర్, కార్యదర్శి ఆలేటి శ్యాం సుందర్, ప్రముఖ కూచిపూడి నాట్య గురువులు బొంపెల్లి సుధీర్‌రావు, భ్రమరాంబ, తాడూరి రేణుక, వెంపటి శ్రావణి, కుండె అరుణ రాజ్‌కుమార్, డాక్టర్ దుంపేటి అనిత, నీలం రాజు, భాస్కర్, పున్నంచదర్, శ్రీమన్నారాయణ, వొద్దిరాజు నివేదిత, నాయక్, తదితర కళాకారులు ఉన్నారు.

హైడ్రా.. ఓ హైడ్రామా : ఎంపీ ఈటల

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 19: హైడ్రా అనేది ఓ హైడ్రామా అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. హనుమకొండ ములుగు రోడ్డులోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఈటల మాట్లాడుతూ.. 40 పెద్దవాళ్ల ఇళ్లు కూల్చి నాలుగు వేల మందికి నోటీసులు ఇచ్చారన్నారు రాజకీయ జీవితంలో గెలుపు, ఓటమి సహజమన్నారు. మల్కాజ్‌గిరిలో మూడు నెలలుగా పర్యటిస్తున్నానన్నారు. పేదరికంలో చాలా మంది మగ్గుతున్నారని, వారికి అండగా ఉండటమే ధ్యేయమన్నారు. కమలాపూర్‌లో తనకున్న ఇమేజ్‌ను చూసి కేసీఆర్ అప్పట్లో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చాడని, అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడలేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

ఎస్జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు

ఐనవోలు, సెప్టెంబరు 19: స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఈ నెల 21న ఐనవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు గురుకుల పాఠశాలల బాలబాలికలు 14-17 ఏళ్ల విభాగాల్లో కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, ఎంఎన్‌వో ఆనందం, హెచ్ఎం వెంకటేశ్వర్లు, కార్యదర్శి కైలాష్‌లు తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక్కొక్క క్రీడా నుంచి నలుగురు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఒరిజినల్ బొనఫైడ్ ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలని తెలిపారు. శనివారం ఎంపిక పోటీలు జరుగనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి కేయూ ఇంటర్ మహిళ టోర్నమెంట్ ఎంపికలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇంటర్ కళాశాల మహిళ టోర్నమెంట్ క్రీడాకారుల ఎంపికలు సెప్టెంబరు 20 శనివారం నుంచి 22వ తేదీ సోమవారం వరకు సాగుతాయని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి వరంగల్ బొల్లికుంటలోని వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాల గ్రౌండ్‌లో జరిగే ఎంపికల ప్రారంభం కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా విశ్వంభర ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, అతిథులుగా కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య, వాగ్దేవి కళాశాల బాధ్యులు డాక్టర్ సి.సత్యపాల్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్.వాణి, డాక్టర్ సీహెచ్. సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ వై.మధుసూదన్‌రావులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. నిర్వాహకులుగా డాక్టర్ పి.అజయ్‌రెడ్డి, డాక్టర్ ఎం.రాధాకృష్ణలు వ్యవహరిస్తారు.

ముగిసిన హమారా హిందూస్థాన్ గణపతి ఉత్సవం

కాజీపేట, సెప్టెంబరు 19: కాజీపేట బాపూజీనగర్‌లో ఏర్పాటైన హమారా హిందుస్థాన్ గణపతి ఉత్సవం గురువారం 12వ రోజుతో ముగిసింది. ఈ ముగింపు పూజలకు మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఉత్సవాలు కొనసాగిస్తున్న కమిటీని అభినందించారు. అనంతరం సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర కాజీపేట బాపూజీనగర్ డీజిల్‌కాలనీ, కడిపికొండ ఆర్వోబీ మీదుగా కడిపికొండ చెరువు వరకు సాగింది. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నార్లగిరి రమేశ్, గబ్బెట శ్రీనివాస్, హమారా హిందుస్థాన్ కమిటీ సభ్యులు నార్లగిరి వినయ్, వెంకటేశ్, గరిగ శివ, నాగపురి అరవింద్, వెంకటేశ్ తోపాటు బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎం.డి. అఫ్జల్, దువ్వ కనుకరాజు, కొండ్ర శంకర్, ఎం.డి. సర్వర్, సోని, మహమూద్, దువ్వ నరేశ్, తేలు సారంగపాణి, సిలువేరు మల్లికార్జున్, రాబర్ట్‌తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

హసన్‌పర్తి, సెప్టెంబరు 19: మండలంలోని అనంతసాగర్ శివారు ఓ యూనివర్సిటీ సమీపంలో పోలీసులు 2 క్వింటాళ్లకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది. శుక్రవారం వరంగల్ నగర పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు త్వరలోనే విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

శ్రీధర్‌కుమార్‌లోథ్‌పై ఫిర్యాదు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుడు శ్రీధర్‌కుమార్‌లోథ్‌పై సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాల పార్టుటైమ్ అధ్యాపకురాలు టి.అన్నపూర్ణ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. సీనియారిటీ ప్రకారం తనను వర్సిటీ క్యాంపస్ కళాశాలకు బదిలీ చేయాల్సి ఉందని తెలిపారు. తాను 14 ఏళ్లుగా పార్టుటైమ్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నానని తెలిపారు. తెలుగు విభాగంలో అధికారులు తన బదిలీకి సిఫార్సు చేసినప్పటికీ డిపార్టుమెంట్ కమిటీ అర్డర్ రాకుండా శ్రీధర్‌కుమార్‌లోథ్ అడ్డుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా శ్రీధర్‌కుమార్‌లోథ్ తనను వేధిస్తున్నాడని ఫిర్యాదులో విన్నవించారు. తాను దళిత మహిళననే కారణంతోనే మనోవేదనకు గురి చేస్తున్నాడని వివరించారు. శ్రీధర్‌కుమార్‌లోథ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొత్త పాఠశాలలకు అనుమతులు ఆపివేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19: జిల్లాలో ఇప్పటికే గల్లీకో పాఠశాల ఉందని, ఎలాంటి నిబంధనలు పాటించకుండా అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న కొత్త పాఠశాలలకు అనుమతులు నిలిపివేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, డీఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో డీఈవో డి. వాసంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రోజు రోజుకు వందల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయన్నారు. కొన్ని యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు లేకుండానే పాఠశాలలను నిర్వహిస్తున్నాయని, అనుమతి లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కొత్త పాఠశాలలకు అనుమతులు నిలిపివేసి, అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, మల్లేష్, మణితేజ, సాంబరాజు, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయం

కమిషన్ సభ్యురాలు శోభారాణి

ధర్మసాగర్, సెప్టెంబరు 19 : బాలల పరిరక్షణే ధ్యేయంగా కమిషన్ పని చేస్తుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శోభారాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీడీపీవో ఎం.విశ్వజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాలికల ఎదుగుదలకు సరైన పోషణ అవసరమన్నారు. పోషకాహారం సరిగా ఉంటే బాల బాలికలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ క్రమంలో మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలల హక్కులకు భంగం కలగకుండా ఉండేందుకు ముందస్తుగా అవగాహన కల్పించాలని కోరారు. బాలల హక్కుల సమస్యలుంటే కమిషన్‌ను సంప్రదించాలన్నారు.

కాకతీయ వర్సిటీలో కొండ చిలువ కలకలం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో కొండ చిలువ కలకలం రేపింది. రెండు రోజులుగా కళాశాల గ్రౌండ్‌లో పెరిగిన గడ్డిని కళాశాల సిబ్బంది తొలగించారు. అయితే శుక్రవారం గ్రౌండ్‌ను పరిశుభ్రంగా చేసేందుకు డోజర్ ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా గ్రౌండ్‌లోంచి ఒక్కసారిగా కొండచిలువ బయటకు వచ్చింది. దీంతో సిబ్బంది. విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. కొండ చిలువ కళాశాల గోడపై నుంచి చెట్లల్లోకి దాటి వెళ్లడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు వసతి కల్పించాలి

అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ కరీమ్

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) చైర్మన్ శివసేనారెడ్డిని తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ కరీమ్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీమ్ మాట్లాడుతూ.. జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లోని ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో రెజ్లింగ్ క్రీడాకారులకు వసతి కల్పించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని శివసేనారెడ్డిని కోరామన్నారు. క్రీడా వసతిగృహంలో రెజ్లింగ్ క్రీడాకారులు వసతి పొందేందుకు ఎంపిక పోటీలను నిర్వహించి నెలల గడుస్తున్నప్పటికీ వసతి కల్పించడంలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో విద్యాభ్యాసానికి సంబంధించి ఇబ్బందులు పడుతున్నారని సాట్ చైర్మన్‌కు వివరించామన్నారు. దీంతో స్పందించిన సాట్ చైర్మన్ త్వరలోనే ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో అర్హులైన రెజ్లింగ్ క్రీడాకారులకు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.

పీహెచ్‌డీ సీటు విషయమై పరస్పర ఫిర్యాదులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ఫార్మసీ విభాగంలో పీహెచ్‌డీ సీటు ఆశావాహుడైన బొట్ల మనోహర్‌లు పరస్పరం ఒక్కరిపై మరొకరు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. తనకు పీహెచ్‌డీ సీటు ఇవ్వకపోతే చంపుతానని బొట్ల మనోహర్‌తో పాటు బెదిరించారని గురువారం రాత్రి వర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఫిర్యాదు చేశారు.

అలాగే తనకు చదువు రాదని ప్రొఫెసర్ సమ్మయ్య హేళన చేశారని, తనకు ఆయనతో ప్రాణహానీ ఉందని బొట్ల మనోహర్ శుక్రవారం వర్సిటీ పోలీస్ స్టేషన్‌లో వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడం వర్సిటీలో కలకలంగా మారింది. వారిద్దరి ఫిర్యాదుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 19: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) గ్రేటర్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం దర్గా రోడ్డులోని ఈపీఎఫ్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గాదె మాహేందర్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హయ్యర్ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఈపీఎస్ పెన్షన్‌కు డీఏ జోడించాలన్నారు. ఈపీఎస్ 95 పెన్షనర్లు అందరికీ ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ నాగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిట్ బీఎంఎస్ అధ్యక్షుడు కర్ణాకర్, కార్యదర్శి యం. మల్లేశం, ఎంజీఎం అధ్యక్షుడు సుధాకర్, కార్తీక్, మురళి, లాలు, ఎల్లమ్మ, శారద, తార తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట పాఠశాలలో డీఈవో విచారణ

హసన్‌పర్తి, సెప్టెంబరు 19: మండలంలోని సీతంపేటలో డీఈవో వాసంతి గురువారం విచారణ చేపట్టారు. గతంలో పనిచేసిన హెచ్ఎం నాగేశ్వరిపై స్కూల్ నిధుల్లో అవకతవకలకు పాల్పడినట్టు ఎస్ఎంసీ కమిటీ సభ్యులు జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం సాంబశివరెడ్డి సమక్షంలో డీఈవో పాఠశాలలోని రికార్డులను పరిశీలించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అధికారులు మారినా బోర్డుపై పేర్లు మారలే..

పూర్వ డీఈవో, ఏడీ పేర్లు ఉన్నవైనం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19: డీఈవో మారినా, ఏడీ రిటైర్డ్ అయినా.. వారి పేర్లు మాత్రం ఇంకా బోర్డులపై దర్శనం ఇస్తూనే ఉన్నాయి. హనుమకొండ డీఈవో కార్యాలయంలో ఆర్టీఐ బోర్డుపై పాత పేర్లు అలాగే ఉన్న సంఘటన గురువారం ఉపాధ్యాయుల కంటపడింది. ఆఫీస్ ఎంట్రన్స్‌లోని గోడపై ఆర్టీఐ బోర్డుపై ఇంకా అప్పిలేట్ అధికారిగా డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై, హనుమకొండ డీఈవో, పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ అధికారిగా జూలై 31న ఉద్యోగ విరమణ పొందిన ఎన్.రామ్‌కుమార్, ఏడీగా పేర్లు అలానే ఉన్నాయి. డీఈవో మారి నెలరోజులైనా, ఏడీ రిటైర్డ్ అయ్యి రెండు నెలలు కావస్తున్నా ఇంకా వారి పేర్లు ఆర్టీఐ బోర్డుపై



డీఈవో ఆఫీస్‌లోని ఆర్టీఐ బోర్డుపై ఉన్న పూర్వపు డీఈవో, రిటైర్డ్ ఏడీ పేర్లు

అలాగే ఉండటంపై ఉపాధ్యాయులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌పై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీఐ బోర్డుపైనే ఇలా తప్పుడు సమాచారం ఉండటం పట్ల ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ పనివిధానాన్ని ఆర్టీఐ కార్యకర్తలు తప్పుపడుతున్నారు. సమాజానికి మార్గదర్శకులుగా ఉండే ఉపాధ్యాయులకే మార్గదర్శిగా ఉండే అడ్మినిస్ట్రేషన్ అధికారుల నిర్లక్ష్యానికి బోర్డులపై మారని పేర్లు అద్దం పడుతున్నాయని ఆర్టీఐ కార్యకర్తలు విమర్శిస్తున్నారు. బోర్డులపై తప్పుడు సమాచారం పొందుపరిచి ఉపాధ్యాయులను, కార్యాలయానికి వచ్చే వారిని అయోమయానికి గురిచేయడం మానుకోవాలని వారు హితవు పలుకుతున్నారు. అధికారులు మారిన వెంటనే బోర్డులపై వారి పేర్లను మార్పు చేయాలని వారు ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌కు సూచిస్తున్నారు.

రీజినల్ సైన్స్ సెంటర్‌కు హద్దులు పెట్టాలి

(5వ పేజీ తరువాయి)

వనరులు, ఇంకా సైన్స్ వనరుల గురించి, 'కుడా' ఆధ్వర్యంలో మరమ్మతు పనుల కోసం రూ.4కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేకు సైన్స్ సెంటర్ అధికారులు వివరించారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఏకైక రీజినల్ సైన్స్ సెంటర్ ఇది అని, సైన్స్ సెంటర్‌లో భవనాల మరమ్మతుతో పాటు ఆధునిక సైన్స్ పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ భవనం చుట్టూ ప్రహరీని నిర్మించాలన్నారు. సైన్స్ సెంటర్‌లో అత్యవసర పనులు జనవరిలోగా పూర్తయ్యేలా చూడాలని, ఇక్కడ ఆధునిక వనరులను సమకూర్చినట్లయితే మరింత ఎక్కువమందికి సైన్స్‌కు సంబంధించిన అనేక అంశాలతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక, వైజ్ఞానపరంగా నగరానికి తలమానికంగా ఉన్న సైన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు కేటాయించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి మెంబర్ సెక్రెటరీ డాక్టర్ నుంకె రాజేంద్రప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ మారుపాక నగేష్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ప్రాజెక్టు ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, సాంబశివారెడ్డి, రీజినల్ సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఈర్ల రాకేష్, కుడా ఈఈ భీమ్‌రావు, 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవ్య
నివేదన
శుక్రవారం
20 సెప్టెంబరు 2024

"ఆలయాలను ప్రత్యేకంగా ఎంపికచేసిన ప్రదేశాల్లో, పాజిటివ్ ఎనర్జీ ఉండే చోట నిర్మిస్తారు. దేవుని విగ్రహం ఆలయం మధ్యలో... గర్భగుడిలో ఉంటుంది. విగ్రహానికి సంప్రదాయబద్ధంగా, వైదిక ప్రక్రియలో ప్రాణప్రతిష్ఠ చేస్తారు. దాని చుట్టూ ఉన్న ప్రదేశమంతటా అయస్కాంత, విద్యుత్ తరంగాలు నెలకొని ఉంటాయి. అవి నెగెటివ్ ఎనర్జీని తొలగిస్తాయి. దైవదర్శనానికి వచ్చిన భక్తుల్లో పాజిటివ్ ఎనర్జీని నింపుతాయి. వారి దృక్పథంలో మార్పునకు దోహదం చేస్తాయి."



చింతన

గుడికి ఎందుకు వెళ్లాలంటే..



ఆలయాలకు వెళ్లడం, అక్కడ కొలువుతీరిన దేవతామూర్తులను పూజించడం అనాది హిందూ సంప్రదాయం. పవిత్ర క్షేత్రాల్లో వేల ఏళ్ళ నాటి ఆలయాలు మొదలు వీధుల్లో ఉండే చిన్న గుడుల వరకూ... ప్రజల హృదయాల్లో ఆధ్యాత్మిక భావనలను నింపడానికి దోహదం చేస్తూనే ఉన్నాయి. అయితే దైవం అంతటా ఉన్నప్పుడు, ఆ దైవాన్ని ఎక్కడైనా, ఏ రూపంలోనైనా పూజించే వెసులుబాటు ఉన్నప్పుడు ఆలయాలకు వెళ్ళవలసిన అవసరం ఏముందనే ప్రశ్న కూడా ఈనాటిది కాదు. దీనికి 'ప్రశాంతత కోసం, ఉత్తమమైన ఆలోచనల కోసం' అనేది సామాన్యంగా వినిపించే జవాబు. కానీ ఆలయాలను ఎందుకు దర్శించాలనే ప్రశ్నకు శాస్త్రీయమైన కారణాలను కూడా ప్రాచీన గ్రంథాలు వివరించాయి.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల ద్వారా మనిషి జ్ఞానాన్ని పొందుతాడు. చెవులు, చర్మం, కళ్ళు, నాలుక, ముక్కు. అనే అయిదు ఇంద్రియాల ద్వారా ఇది జరుగుతుంది. కాబట్టి వాటిని 'జ్ఞానేంద్రియాలు' అంటారు. ఆలయంలోని వాతావరణం వల్ల అవన్నీ ఉద్దీపన చెందుతాయి. అక్కడ ఉన్న పాజిటివ్ ఎనర్జీని మనలోకి నింపుతాయి.



గర్భగుడిలో ప్రవేశించినప్పుడు... గంట మోగిస్తాం. మన మెదడులోని కుడి, ఎడమ భాగాలు ఏకత్వాన్ని పొందే విధంగా శబ్దాన్ని వెలువరించేలా ఈ గంటలను తయారు చేస్తారు. మనం గంట మోగించినప్పుడు... నిశితమైన, స్థిరమైన శబ్దం వస్తుంది. ఆ శబ్దం కనీసం ఏడు సెకెన్లపాటు ప్రతిధ్వనిస్తుంది. మన శరీరంలోని ఏడు నాడుల్ని జాగృతం చెయ్యడానికి ఈ ప్రతిధ్వని వ్యవధి సరిపోతుంది. ఫలితంగా మన మెదడులోని ప్రతికూల ఆలోచలన్నీ తొలగిపోతాయి.

గర్భగుడిలో... సాధారణంగా చీకటిగా ఉండే చోట దైవ విగ్రహాన్ని ఉంచుతారు. చాలామంది కళ్ళు మూసుకొని దేవుణ్ణి ప్రార్థిస్తారు. మీరు కళ్ల తెరవగానే విగ్రహం ముందున్న హారతి పళ్లెంలో వెలుగుతున్న కర్పూరాన్ని చూడాలి. చీకటిగా ఉండే చోట కనిపించే ఆ వెలుగు నేత్రాలను జాగృతం చేస్తుంది. కర్పూర హారతిని కళ్ళకు అద్దుకున్నప్పుడు... మీ చేతులు వెచ్చగా అవుతాయి. ఆ చేతులను మీ కళ్ళ మీద ఉంచుకున్నప్పుడు... మీ స్పర్శా శక్తి జాగృతం అవుతుంది.



ఆలయంలో దేవుడికి పుష్పాలు సమర్పిస్తాం. చూడడానికి అందంగా, మంచి పరిమళం వెదజల్లుతూ, మెత్తని స్పర్శతో, రుచికరమైన తేనెతో ఉన్న పుష్పాలను దైవ పూజకు ఉపయోగించాలని చెప్పాయి శాస్త్రాలు. పూలు, కర్పూరం, అగరువత్తుల సువాసనలు కలిసి మీ ఘ్రాణేంద్రియాలను (వాసన చూసే ఇంద్రియాలను) జాగృతం చేస్తాయి. మనసులో ప్రశాంతమైన భావన కలిగిస్తాయి.



గుడిలో తీర్థాన్ని వెండి లేదా రాగి పాత్ర నుంచి ఉద్ధరణితో తీసి ఇస్తారు. తీర్థంలో తులసి ఆకులు వేస్తారు. అవి కనీసం ఆ పాత్రలో ఏడెనిమిది గంటలు ఉంటాయి. రాగి పాత్రలో నిల్వ చేసిన నీటికి శరీరంలో వాత, కఫ, పిత్తాలనే త్రిదోషాలను సమతుల్యం చేసే శక్తి ఉందని, అది పాజిటివ్‌గా ఛార్జ్ అయిన నీరు అని ఆయుర్వేదం చెబుతోంది. అలాగే తులసి ఆకు ఉంచిన నీరు తాగడం వల్ల రుచి చూసే శక్తి (రస జ్ఞానం) జాగృతం అవుతుంది. నోటి పూత, గొంతు నొప్పి, జలుబు, దగ్గు, ఊపిరి తిత్తుల సమస్యలు తదితర అనేక సమస్యలకు రాగి పాత్రలో ఉంచిన తులసి నీరు మంచి పరిష్కారం.

ఆలయంలో ప్రదక్షిణ చేయడం కూడా ఒక ఆనవాయితీ. గర్భగుడి చుట్టూ తిరుగుతున్నప్పుడు... ఘంటానాదాలతో, చేతులతో పట్టుకున్న పూలతో, దీపాలు, దేవతామూర్తుల దర్శనంతో, తీర్థసేవనంతో, కర్పూరాది పరిమళాలతో... మన పంచేంద్రియాల్లో కలిగిన జాగృతి స్థిరపడుతుంది.

ఆలయాలను ప్రత్యేకంగా ఎంపికచేసిన ప్రదేశాల్లో, పాజిటివ్ ఎనర్జీ ఉండే చోట నిర్మిస్తారు. దేవుని విగ్రహం ఆలయం మధ్యలో... గర్భగుడిలో ఉంటుంది. విగ్రహానికి సంప్రదాయబద్ధంగా, వైదిక ప్రక్రియలో ప్రాణప్రతిష్ఠ చేస్తారు. దాని చుట్టూ ఉన్న ప్రదేశమంతటా అయస్కాంత, విద్యుత్ తరంగాలు నెలకొని ఉంటాయి. అవి నెగెటివ్ ఎనర్జీని తొలగిస్తాయి. దైవదర్శనానికి వచ్చిన భక్తుల్లో పాజిటివ్ ఎనర్జీని నింపుతాయి. వారి దృక్పథంలో మార్పునకు దోహదం చేస్తాయి.



రెండు కనుబొమ్మలకు మధ్య ఉన్న భాగాన్ని 'భ్రూమధ్యం' అంటారు. అది మానవ శరీరంలో అత్యంత కీలకమైన నాడీ కేంద్రం. అది ఎప్పుడూ శక్తిని వెదజల్లుతూనే ఉంటుందని యోగశాస్త్రం చెబుతోంది. ఆ శక్తి నష్టపోకుండా ఉండడానికి... తిలకం లేదా కుంకుమ ధరించడాన్ని మన పూర్వీకులు తప్పనిసరి చేశారు. దానివల్ల మానవ శరీరంలోని శక్తి నిలిచి ఉంటుంది. ఏకాగ్రత కలుగుతుంది. కనుబొమ్మల మధ్యలో... కుంకుమను ధరించినప్పుడు... అక్కడ ఉండే ఆజ్ఞా చక్రం దానంతట అదే నొక్కుకుంటుంది. తద్వారా ముఖ కండరాలకు రక్త సరఫరా మెరుగుపడుతుంది. ఈ విధంగా ఆలయ దర్శనం వల్ల ఆధ్యాత్మిక ప్రయోజనాలే కాదు... ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఎన్నో.

ఆలయంలో ప్రవేశించేటప్పుడు పాదరక్షలను బయట విడిచిపెట్టాలనేది కచ్చితమైన నియమం. అక్కడ నేల పాజిటివ్ వైబ్రేషన్స్‌కు వాహకంగా ఉంటుంది. పాదాల నుంచి ఆ పాజిటివ్ వైబ్రేషన్లు శరీరం మొత్తానికి వ్యాపిస్తాయి. కాబట్టే ఆలయంలోకి చెప్పులు లేకుండా వెళ్ళాలనే నియమం పెట్టారు మన పూర్వులు. అంతేకాదు, చెప్పులకు అంటిన దుమ్ము, ధూళి, పురుగులు లాంటివి పవిత్రమైన, స్వచ్ఛమైన ఆలయ వాతావరణాన్ని నాశనం చేస్తాయి. నెగెటివ్ ఎనర్జీకి కారణం అవుతాయి.

గీతాసారం

విషయవాంఛను వదులుకోవాలి

"ఇంద్రియాల ద్వారా విషయాలను స్వీకరించని వ్యక్తి నుంచి ఇంద్రియ వస్తువులు దూరమైపోతాయి. కానీ 'రస్' (కాంక్ష/రాగం) దూరం కాదు. పరమాత్మను తెలుసుకున్నప్పుడు మాత్రమే కోరిక అంతమైపోతుంది" అని శ్రీకృష్ణుడు బోధిస్తున్నాడు. ఇంద్రియాలకు మెదడులో నియంత్రకాలు ఉంటాయి. మనస్సు అనేది ఇంద్రియ నియంత్రకాల కలయిక. ఈ నియంత్రకాలపై దృష్టి సారించాలని శ్రీకృష్ణుడు మనకు సలహా ఇస్తున్నాడు. ఇక్కడ శ్రీకృష్ణుడు 'రస్' అనే పదాన్ని ఉపయోగించాడు. పండిన పండ్లను కోసి, పిండినప్పుడు తప్ప రసం కనిపించదు. పాలలో ఉండే వెన్న పరిస్థితి కూడా అంతే. అలాగే ఇక్కడ 'రస్' అంటే ఇంద్రియ నియంత్రకాలలో ఉండే అంతర్గతమైన కోరిక. అజ్ఞాన స్థాయిలో... ఇంద్రియాలతో ఇంద్రియ వస్తువులు జతపడి ఉంటాయి. సుఖ దుఃఖాల ద్వంద్వాల మధ్య ఊగిసలాడుతూ ఉంటాయి.



తదుపరి దశలో... కోరికలను తీర్చుకొనే మార్గం లేక... ఆ కోరికలను మనం వదిలేస్తాం. ఉదాహరణకు... డబ్బు లేకపోవడం లేదా వైద్యుల సలహా లాంటి బాహ్య పరిస్థితుల కారణంగా... మిఠాయి లాంటి ఇంద్రియ వస్తువులను వదిలేస్తాం. కానీ విఠాయి పట్ల కోరిక మిగిలిపోతుంది. నైతికత, దేవుడు లేదా చట్టం పట్ల భయం, ప్రతిష్ఠ పోతుందనే అనుమానం, వృద్ధాప్యం లాంటి బాహ్య పరిస్థితుల కారణంగా కోరికలను వదిలేస్తాం. కానీ ఏ కారణం లేకుండానే విషయవాంఛలను అంటే అన్ని కోరికలను వదిలేసే పరమ దశ గురించి శ్రీకృష్ణుడు పై శ్లోకంలో సూచిస్తున్నాడు.

దీని కోసం ఒక ఆచరణాత్మకమైన చిట్కాను శ్రీకృష్ణుడు చెప్పాడు. అక్కడ ఆయన ఇంద్రియాలను అడవి గుర్రాలతో పోల్చాడు. శిక్షకుడు కొంత కాలం వాటితోపాటు పరుగెత్తి... వాటిని నియంత్రణలోకి తీసుకువస్తాడు. వాటిని పూర్తిగా అర్థం చేసుకున్నాక... తన ఇష్టానుసారం వాటి మీద స్వారీ ప్రారంభిస్తాడు. ఇక్కడ గమనించవలసిన రెండు విషయాలు ఏమిటంటే... శిక్షకుడు గుర్రాలను ఒక్కసారిగా నియంత్రించలేదు. అలా చేస్తే అవి అతణ్ణి కింద పడేస్తాయి. అదే విధంగా, మన ఇంద్రియాలను ఒక్కసారిగా నియంత్రించడం ప్రారంభించలేం. వాటిని అర్థం చేసుకొని, నెమ్మదిగా అదుపులోకి తేవాలి.

అంతవరకూ కొంతకాలం పాటు వాటి వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకోవాలి. రెండోది, మనం ఇంద్రియాల ప్రభావంలో ఉన్నప్పుడు... వాటిని ప్రస్తుతం నియంత్రించలేకపోయినా... భవిష్యత్తులో నియంత్రించాలనే నిరంతర అవగాహన మనకు ఉండాలి. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడనట్టు... అవగాహన, కోరిక... ఈ రెండిటిలో ఒకటి మాత్రమే మనలో ఉండగలదు. అవగాహన ఉన్నప్పుడు మనల్ని కోరికలు వాటి అధీనంలోకి తీసుకోలేవు. ఎందుకంటే అజ్ఞానంలో ఉన్నప్పుడే వాటి అధీనంలోకి మనం వెళ్లడం జరుగుతుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

నానక్ వారసత్వం

సద్బోధ



సిక్కుల మొదటి గురువు, సిక్కు మత స్థాపకుడైన గురునానక్ సత్ప్రవర్తనే మనిషిని భగవంతుడికి చేరువ చేస్తుందని నమ్మేవారు. అదే అందరికీ బోధించేవారు. అహం మనిషికి మహా శత్రువు అనీ, అహంకారాన్ని విడిచిపెట్టి, వినయంతో నడుచుకోవడమే ఆ పరమాత్మకు మనల్ని దగ్గర చేస్తుందనీ చెప్పేవారు. ఆయనను దైవసమానంగా ఆరాధించే శిష్యులు ఎంతోమంది ఉండేవారు.

ఒకరోజు ఆయన తన శిష్యుల్లో ఒకరిని పిలిచి... ఒక వేదికను నిర్మించాలని ఆదేశించారు. ఆ శిష్యుడు ఆ ప్రకారం చేశాడు. దాన్ని చూసిన నానక్ "వెంటనే దాన్ని పడగొట్టు" అన్నారు. శిష్యుడు ఆ వేదికను పడగొట్టాడు. "మళ్ళీ దాన్ని నిర్మించు" అన్నారు నానక్. శిష్యుడు నిర్మించాడు. "మళ్ళీ పడగొట్టెయ్" అని చెప్పారు నానక్. అలా నానక్ పదేపదే ఆ వేదికను నిర్మించాలని, ఆ తరువాత దాన్ని పడగొట్టాలని చెబుతున్నారు శిష్యుడు ఆయన ఆదేశాలను అక్షరాలా పాటిస్తున్నాడు. గురునానక్ పెద్ద కుమారుడు శ్రీచంద్ ఇదంతా గమనించాడు. అతను శిష్యుడితో "మా తండ్రిగారు ఆ వేదికను మళ్ళీ మళ్ళీ కట్టమంటున్నారు. వెంటనే పడగొట్టమంటున్నారు. ఎన్నిసార్లు ఇలా చేస్తావు? నీకు విసుగు, కోపం రావడం లేదా?" అని అడిగాడు. అప్పుడు ఆ శిష్యుడు ..అయ్యా! నేను నా గురుదేవులు చెప్పినది చేస్తున్నాను. గురుదేవుల ఆదేశాలను పాటించడమే నా సాధన" అని బదులిచ్చాడు.

మరో సందర్భంలో శ్రీచంద్‌ను గురునానక్ పిలిచి "ఇవాళ నాకు అత్యవసర సేవా కార్యక్రమాలు ఉన్నాయి. పశువుల పాకను శుభ్రం చెయ్యలేను. నువ్వు ఆ పని చెయ్యి" అని చెప్పారు. శ్రీచంద్ కొద్దిసేపటి క్రితమే స్నానం చేసి, మంచి దుస్తులు వేసుకున్నాడు. 'పశువుల పాకను శుభ్రం చేస్తే నా దుస్తులు బురదైపోతాయి. నేను మళ్ళీ స్నానం చెయ్యాలి' అనుకున్నాడు. అది అతనికి ఇష్టం లేకపోయింది. అందుకే "తండ్రీ! నేను ఆలయానికి వెళ్ళాలి. పశువుల పాక పని వేరెవరికైనా అప్పగించండి" అని చెప్పి, బయటకు వెళ్ళిపోయాడు. తన శిష్యులలో ఒకరైన లెహ్నాను నానక్ పిలిచి, పశువుల పాకను శుభ్రం చెయ్యమన్నారు. లెహ్నా కూడా అప్పుడే స్నానం చేసి వచ్చాడు. కానీ గురువు మాటను శిరసా వహించి, తక్షణమే ఆయన ఆ పని చేశాడు. తరువాత మళ్ళీ స్నానం చేసి, ఆలయానికి వెళ్ళాడు.

ఆ మరునాడే సిక్కుల మహా సమ్మేళనం జరిగింది. ఆ కార్యక్రమంలో... లెహ్నా పేరును 'అంగద్ దేవ్'గా గురునానక్ మార్చారు. తన తరువాత... గురుపరంపరకు వారసుడిగా అతణ్ణి ప్రకటించారు. ఈ నిర్ణయం ఆయన శిష్యులకు ఆశ్చర్యం కలిగించింది. "గురుసాహెబ్! మీ పెద్ద కుమారుణ్ణి కాకుండా లెహ్నాను మీ వారసుడిగా ఎందుకు ప్రకటించారు? ఇది సంప్రదాయాన్ని అతిక్రమించడం కాదా?" అని అడిగారు. అప్పుడు గురునానక్ "నా వారసత్వానికి శ్రీచంద్ కన్నా లెహ్నాకు అంటే అంగద్ దేవ్‌కు ఎక్కువ అర్హతలు ఉన్నాయి. నిన్న జరిగిన సంఘటననే దీనికి ఉదాహరణగా చెబుతాను. పశువుల పాకను శుభ్రం చెయ్యాలని నేను అడిగినప్పుడు... మళ్ళీ స్నానం చెయ్యాలనే కారణంతో శ్రీచంద్ దానికి ఒప్పుకోలేదు. చిన్న ప్రదేశమైన పశువుల పాకనే శుభ్రం చెయ్యడానికి ఇష్టపడని వాడు సమాజాన్ని ఎలా పరిశుద్ధం చెయ్యగలడు? ఆ పని లెహ్నా సంతోషంగా చేశాడు. అందుకే అతను సమాజానికి పనికి వచ్చే మనిషి అయ్యాడు. నా వారసత్వాన్ని అందుకోవడానికి అర్హుడయ్యాడు" అని చెప్పారు. గురునానక్ తరువాత... రెండో సిక్కు గురువుగా... గురు అంగద్ చరిత్రలో నిలిచారు. నిస్వార్థపరత్వం, విధేయత ఉన్నవారు గురు అనుగ్రహాన్ని, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థానాన్ని పొందుతారనే సత్యానికి గురు అంగద్ కథ మంచి ఉదాహరణ.

జ్ఞానోదయం పొందాలంటే...

'మనిషి పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొందడానికి అంటే జ్ఞానోదయం కలగడానికి ఎంతకాలం పడుతుంది?' అనే ప్రశ్న ఒకరి నుంచి నాకు ఎదురయింది. ప్రధానంగా గుర్తించవలసిన విషయం ఏమిటంటే... ఇది సమయానికి సంబంధించిన విషయం కాదు. ఎందుకంటే... జ్ఞానం మీలోనే ఉంది. విమ్మల్ని మీరు తెలుసుకోవడమే జ్ఞానం. మరి మిమ్మల్ని మీరు తెలుసుకోవాలంటే... దానికి సమయం పడుతుందా? నిజానికి పట్టకూడదు. కానీ మిమ్మల్ని మీరు ఒకేసారి పరమాత్మకు సమర్పించుకోవడం లేదు. వాయిదాల పద్ధతిలో ఆత్మసమర్పణ చేసుకుంటున్నారు.

సద్గురువాణి



కాబట్టే ఎక్కువ సమయం పడుతోంది. జ్ఞానోదయం పొందడానికి చిన్న చిన్న వాయిదాల ద్వారా వంద జీవిత కాలాలు తీసుకోవాలనుకుంటున్నారా? లేదంటే ఈ రోజే చేయాలనుకుంటున్నారా? అనేది మీ ఇష్టం. జ్ఞానాన్ని పొందడానికి ఎంత సమయం అవసరం అనేది... దాని గురించి తెలుసుకోవాలనే కోరిక మీలో ఎంత తీవ్రంగా ఉందనే అంశం ఆధారపడి ఉంటుంది. ఏదైనా ప్రశ్న మిమ్మల్ని దహించివేస్తున్నప్పుడు, ఇంకొక ఆలోచనకు తావివ్వకుండా, మీరు ఒక్క మాట కూడా మాట్లాడేనంతగా అది మిమ్మల్ని వెంటాడుతున్నప్పుడు... తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టదు.

జ్ఞానోదయం పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ కలుగనక్కర్లేదు. అది నిశ్శబ్దంగా జరగవచ్చు. ఒక పువ్వు వికసించినట్టు జరగవచ్చు. ఈ భూమి మీద జరిగే గొప్ప విషయాలు ఎలాంటి చప్పుడు చెయ్యవు. ఒక విత్తనం మొక్కగా, మొక్క చెట్టుగా మారుతాయి. ఇది చిన్న విషయం కాదు. మహాద్భుతం. అలా జరిగినప్పుడు అవి శబ్దాలు చేస్తున్నాయా? కానీ చిన్న చిన్న విజయాలు చాలా గోల పెడతాయి. ఉదయాన లేవగానే కోడి గట్టిగా అరుస్తుంది. కానీ సృష్టిలో గొప్పవన్నీ నిశ్శబ్దంగానే జరుగుతాయి. కాబట్టి జ్ఞానోదయం కూడా నిశ్శబ్దంగానే జరుగుతుంది. అప్పుడు మనం ఒక పార్శ్వంలోంచి మరో పార్శ్వంలోకి ప్రవేశిస్తాం. అయితే.. తోటలో పువ్వు నిశ్శబ్దంగా వికసించినా... ఆ తరువాత దాన్ని మీరు పట్టించుకోకుండా ఉండలేరు. దాని సువాసనను, అందాన్నీ ఎవరూ కాదనలేరు.

జ్ఞానోదయం పొందడం చాలా సులభం. కానీ ఇది మీకు ఇప్పటికీ దూరంగా ఉండడానికి కారణం... తెలుసుకోవాలనే తపన మీలో మందకొడిగా ఉండడమే. అది ఇంకా విమ్మల్ని దహించడం లేదు. అది మీలో ఇంకా ఒక ముఖ్యమైన అంశంగా మారలేదు. సత్యాన్ని తెలుసుకోవడాన్ని మీరు వినోదంగా భావిస్తే... అది ఎప్పటికీ జరగలేదు. 'అది తప్ప నాకు ఇంకేదీ అక్కరలేదనే స్థాయిలో మీరు దాన్ని కోరుకుంటే, ఆ దిశగా ప్రయత్నిస్తే... ఒక్క క్షణంలోనే తెలుసుకోగరు. ఎందుకంటే మీరు తెలుసుకోవాలనుకుంటున్నది మీలో ఉంది. మీలో ఉన్నదాన్ని మీరు తప్ప మరెవరూ అడ్డుకోలేరు. కనుక మీ దారికి మీరే అడ్డుపడకుండా ఉంటే చాలు. సత్యాన్ని మీరు వాయిదాల పద్ధతిలో తెలుసుకోవచ్చు లేదా ఒకేసారి తెలుసుకోవచ్చు. అదంతా మీ చేతుల్లోనే ఉంది.

• సద్గురు జగ్గీవాసుదేవ్

జెన్ కథ

అర్హత ఉంటేనే ఆశించాలి


'జెండో' అంటే కత్తి దూసే యుద్ధ కళ అని అర్థం. ఆ కళలో నైపుణ్యం సాధించి, ఇతరులకు నేర్పే జెన్ గురువును 'జెండో గురువు' అంటారు. ఈ యుద్ధ కళలో అపారమైన కృషి చేసి, సంపూర్ణ నైపుణ్యాన్ని పొందిన వ్యక్తి... యుద్ధ సమయంలో తన శరీరాన్ని దృఢమైన శక్తి స్తంభంగా మార్చగలడనీ, ప్రత్యర్థి కత్తితో అతణ్ణి కొడితే... ఆ కత్తి విరగాల్సిందే తప్ప అతనికి ఎలాంటి గాయం కాదనీ చెబుతారు. జపాన్‌లో అలాంటి జెండో గురువు ఉండేవాడు. అతను వృద్ధుడయ్యాడు. శరీరం చిక్కిపోయింది. సంప్రదాయం ప్రకారం... శిష్యుల్లో ఒకరిని తన వారసునిగా అతను ప్రకటించారు. వారసుడు కావాలనుకొనే శిష్యుడు... ద్వంద్వ యుద్ధంలో గురువును ఓడించాలి.

ఆ గురువు దగ్గర ఎంతో కాలంగా ఒక శిష్యుడు ఉన్నాడు. యుద్ధ విద్యలో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాడు. గురువు తనను వారసుడిగా ప్రకటిస్తాడని అతను చాలాకాలం నుంచి ఎదురుచూస్తున్నాడు. కానీ గురువు ఆ సంగతే పట్టించుకోవడం లేదు. చివరకు ఒక రోజు అతను గురువు దగ్గరకు వెళ్ళి "గురువుగారు! మీరు బాగా వృద్ధులయ్యారు. మీ ప్రాణం ఎప్పుడైనా పోవచ్చు. కాబట్టి నన్ను వారసుడిగా ప్రకటించండి. ద్వంద్వ యుద్ధంలో మిమ్మల్ని తప్పకుండా ఓడించగలను. రండి! యుద్ధం చేద్దాం" అన్నాడు.

అప్పుడు గురువు నవ్వి "సరేలే! ముందు సమీపంలో ఉన్న ఆ మఠానికి వెళ్ళు. అక్కడ నా శిష్యుడే ఒకడున్నాడు. ముందు అతణ్ణి ఓడించి రా. ఆ తరువాత మనమిద్దరం యుద్ధం చేద్దాం" అన్నాడు.

శిష్యుడు వెంటనే ఆ మఠానికి వెళ్ళాడు. గురువు చెప్పిన వ్యక్తిని చూశాడు. అతనొక సాధువు, బక్కగా, బలహీనంగా ఉన్నాడు. అతనికి తను వచ్చిన విషయం చెప్పి... "ఇదిగో ఈ కత్తి తీసుకో. యుద్ధం చేద్దాం" అని అడిగాడు శిష్యుడు.

"నిన్ను ఓడించడానికి నాకు కత్తి కావాలా? అక్కర్లేదులే. యుద్ధం ఆరంభించు" అంటూ లేచి



నిలబడిన సాధువు... ఒక స్తంభంలా మారి గిరగిరా తిరగడం ప్రారంభించాడు.

వచ్చిన శిష్యుడు కత్తిని ఝుళిపించడానికి జంకాడు. ముందుకు ఒక అడుగైనా వెయ్యలేకపోయాడు. ఈలోగా... స్తంభంగా మారిన సాధువు అతనివైపు రావడం మొదలుపెట్టాడు. సాధువును తప్పించుకోవడానికి శిష్యుడు నానా అవస్థలు పడ్డాడు. చివరకు చెమటలు కక్కుతూ నేలమీద కూలబడిపోయాడు. చేతులు జోడించి "నన్ను క్షమించండి. నన్ను కాపాడండి" అని వేడుకున్నాడు.

అప్పుడు సాధువు మామూలు స్థితికి వచ్చి "ఈమాత్రం దానికే ఇలా అలసిపోయావే? నీవా నన్ను ఓడించి, గురువుగారినీ ఓడించి... వారసుడు కాదలచినవాడివి? దేనికైనా అర్హత పొందాలి. అర్హత పొందిన తరువాతే ఆశించాలి. పో, వెనక్కు పో! గురువుగారిని క్షమించమని వేడుకో. నిన్ను వదిలిపెడుతున్నాను" అన్నాడు.

శిష్యుడు తిరిగి వచ్చి, గురువు పాదాల మీద పడి, జరిగినదంతా వివరించాడు. తల దించుకొని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

సుభాషితం

అదే మేలు

వరం తుంగా చ్ఛృంగా ద్గురుశిఖరిణః క్వాపి విషమే
పతిత్వాయం కాయః కఠినదృషదంతే విదళితః
నరం న్యస్తో హస్తః ఫణిపతిముఖే తీక్ష్ణదశనే
వరం వహ్నౌ పాతస్త దపి న కృత శ్శీలవిలయః

మంచి గుణాలను మనిషి వదులుకోకూడదని తన 'నీతి శతకం'లోని ఈ శ్లోకంలో భర్తృహరి హితవు చెప్పాడు. దాన్ని తెలుగులో...

ఉరుతర పర్వతాగ్రమున నుండి దృఢంబగు రాతి మీద స




త్వరముగ దొళ్ళి కాయము హతంబుగ చేయుట మేలు, గాలిమే
పరిదొరవాత కేలిడుట బాగు, హుతాశన మధ్య పాతమున్
వరమగు, జారుశీల గుణ వర్జన మర్హముకాదు చూడగన్.. అనే పద్యరూపంలో ఏనుగు లక్ష్మణ కవి అనువదించాడు.

భావం:
మనిషి తన శీలాన్ని అంటే మంచి గుణాలను, సత్ప్రవర్తనను వదులుకోవడం కన్నా పెద్ద శిఖరం పైనుంచి దూకి, కఠినమైన రాతి మీద పడి... నుజ్జు నుజ్జయిపోవడం మంచిది. భయానకమైన విషజ్వాలను కక్కుతున్న ఆదిశేషుడి నోటిలో చెయ్యి పెట్టడం మంచిది. నిప్పుల్లో పడి బూడిదైపోవడం మంచిది. సద్గుణాలను విడిచిపెట్టినవారు జీవించడం కన్నా నశించిపోవడమే మేలు.

నిజాన్ని అంగీకరించండి లేదా పోరాడండి

కొరియోగ్రాఫర్ షేక్ జానీబాషా (జానీ మాస్టర్) లైంగిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నటుడు మంచుమనోజ్ స్పందించి.. ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'తప్పు చేస్తే అంగీకరించండి లేదా పోరాటం చేయండి. అంతేకాని పారిపోవద్దు' అని ఆయన హితవు పలికారు. "జానీ మాస్టర్.. కెరీర్ పరంగా ఈ స్థాయికి వచ్చేందుకు మీరు ఎంతలా శ్రమించారో అందరికీ తెలుసు. ఈరోజు మీపై ఇలాంటి ఆరోపణలు రావడం చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. తప్పు ఎవరిది అనేది చట్టం నిర్ణయిస్తుంది. ఒక మహిళ తన స్వరాన్ని వినిపించినప్పుడు పారిపోవడం అనేది సమాజానికి, రానున్న తరాలకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తుంది. జానీ మాస్టర్.. నిజాన్ని ఎదుర్కొండి. మీరు ఏ తప్పూ చేయకపోతే పోరాటం చేయండి. మీరు దోషి అయితే.. దానిని అంగీకరించండి ఈ కేసు విషయంలో వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న హైదరాబాద్ సిటీ పోలీస్‌లకు అభినందనలు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఇది తెలియజేస్తుంది. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన మాట ప్రకారం ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌ని వెంటనే సిద్ధం చేయాలని కోరుతున్నా. దానికంటూ ప్రత్యేకంగా సోషల్‌మీడియా ఖాతాలు ఏర్పాటు చేయండి. మన పరిశ్రమలోని మహిళలకు గళంగా నిలవండి. ఇబ్బందుల్లో ఉన్న మహిళల బాధను వింటామనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయండి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలబడిన మన పరిశ్రమ పెద్దలు, కో వర్కర్స్‌కు నా మద్దతు తెలియజేస్తున్నా. న్యాయం, గౌరవం అనేది మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లోనూ చూపించే విధమైన సమాజాన్ని నిర్మిద్దాం. కూతురు, సోదరి, తల్లి.. ఇలా ప్రతి మహిళ కోసం ఈ పోరాటం. వారికి అన్యాయం జరగకుండా చూద్దాం" అని మనోజ్ పేర్కొన్నారు. అలాగే, మరో నటుడు నాగబాబు చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆయన చేసిన ట్వీట్ జానీ భాషాని ఉద్దేశించినదే అని నెటిజనులు అనుకుంటున్నారు. ఇంతకీ ఆ ట్వీట్‌లో ఏముందంటే.. "తప్పు చేసిన వ్యక్తి చట్టపరంగా దోషిగా తేలనంతవరకూ.. ఆ వ్యక్తి తప్పు చేసినట్లు కాదు" అని సర్ విలియమ్ గ్యారో అనే రచయిత కొటేషన్‌ను నాగబాబు పోస్ట్ చేశారు.






కొత్త తేదీన కంగువ




సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. నవంబర్ 14న 'కంగువ'ను విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ యూనిట్ గురువారం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దిశాపటానీ, బాబీడియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

గుండెను తాకే నాన్న పాట



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. చిత్రబృందం గురువారం 'నాన్న' సాంగ్‌ను విడుదల చేసింది. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ సాగే ఈ గీతానికి లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా జై కృష్ణ స్వరపరిచారు. నజీరుద్దీన్ ఆలపించారు. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సాయిచంద్, ఆమని కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి



అనంత శూన్యం నుంచి ప్రారంభమై అన్నింటినీ తనలో ఇముడ్చుకున్న మహామనీషి అక్కినేని. తెలుగు అక్షరమాలలో మొదటి అక్షరంతో మొదలైన ఆయన పేరు మిగిలిన అక్షరాలకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు, ఆయన జీవితాన్ని ఒక అందమైన కావ్యంగా తీర్చిదిద్దింది. మహానటుడిగా నిలబెట్టింది. దైవం, అదృష్టాల కన్నా కృషినే నమ్మారు అక్కినేని. ఆయన **శతజయంతి (సెప్టెంబర్ 20) సందర్భంగా** పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రత్యేక స్టాంప్ విడుదల చేస్తోంది.

జననం - 20-09-1924
మరణం - 22-01-2014

ఓ బాటసారి నిను మరువమోయి



భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శిఖరంలాంటి నటుడు అక్కినేని నాగేశ్వరరావు. 90 వసంతాల జీవితంలో 70 వసంతాలను అభినయ కళకు అర్పించిన అరుదైన నటుడు. రంగస్థలంపై ఆడవేషాలతో నటనను ఆరంభించి కాలక్రమంలో అభినయ కళాశాలగా, నట నిఘంటువుగా ఎదిగారాయన.

ప్రారంభంలో జానపద, పౌరాణిక చిత్రాల కథానాయకునిగా తన నటజీవితాన్ని ఆరంభించినప్పటికీ కాలక్రమంలో అనేకానేక ఆధ్యాత్మిక, సాంఘిక పాత్రల ద్వారా సమకాలీన జీవన సొబగులను అభినయించి సినీ మాధ్యమాన్ని జనజీవనంతో మమైకం చేసిన ప్రజానటుడు ఆయన.

వాల్మీకి, క్షేత్రయ్య, తుకారామ్, తెనాలి రామకృష్ణ, విప్రనారాయణ, జయదేవుడు, కబీరు, కాళిదాసు వంటి విభిన్న పాత్రలు పోషించి తనకు తానే సాటి అనిపించుకున్నారు. నటనకే పరిమితం అవకుండా నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. నాటకాల రోజుల నుంచి తనకు ఎంతో అండగా నిలిచిన దుక్కిపాటి మధుసూదనరావుతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై ఆణిముత్యాల లాంటి చిత్రాలు నిర్మించారు. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో కలసి చక్రవర్తి చిత్ర పతాకంపై 'సుడిగుండాలు', 'మరో ప్రపంచం' వంటి ప్రయోగాత్మక సినిమాలు తీశారు. ఆ తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఎన్నో చిత్రాలు అందించారు.

స్వరాష్ట్రంలో చిత్ర పరిశ్రమ

తెలుగు చిత్ర పరిశ్రమ మదరాసు నగరం నుంచి హైదరాబాద్‌కు తరలి రావడానికి తొలి రోజుల్లో ఎంతో కృషి చేసిన వ్యక్తి అక్కినేని. 'నాతో సినిమా తీయాలనుకునే





నిర్మాతలు హైదరాబాద్‌కు రండి' అని కండీషన్ పెట్టి, దాని మీదే చివరి వరకూ నిలబడ్డారు అక్కినేని. ఆ రోజుల్లో భాగ్యనగరంలో చిత్ర నిర్మాణానికి అవసరమైన వసతులు అరకొరకుగానే ఉన్నా, వాటితోనే సరిపుచ్చుకుని అద్భుత చిత్రాలు తీయడానికి కారకులయ్యారు అక్కినేని.

మూడు పద్మాలూ ఆయనకే!

ఒక నటునిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, ఓ మహోన్నత వ్యక్తిగా అక్కినేని నాగేశ్వరరావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమ అధికార పరిధిలోని సమస్త సినీ ఘన పురస్కారాలను ఆయనకు కట్టబెట్టి పట్టాభిషేకాలు చేశాయి. మూడు పద్మాలు.. పద్మశ్రీ పద్మభూషణ్, పద్మవిభూషణ్ పొందిన ఏకైక నటుడు అక్కినేని. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో తెలుగు వెలుగుల్ని హస్తినాపురం వరకూ ప్రసరింపచేసిన తొలి దక్షిణాది కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు.

నటనకే అంకితమైన కుటుంబం

ఏయన్నార్‌తో పాటు ఆయన కుటుంబం కూడా చిత్రపరిశ్రమకే అంకితమైంది. నాగేశ్వరరావు పెద్ద కుమారుడు వెంకట్ నిర్మాతగా కొనసాగారు. రెండో కుమారుడు నాగార్జున నటుడిగా, ఆయన కుమారుడు నాగచైతన్య, అఖిల్ హీరోలుగా ఉన్నారు. అక్కినేని పెద్ద అల్లుడు సురేంద్ర నిర్మాత కాగా, ఆయన కుమారుడు సుమంత్ నటుడిగా, కుమార్తె సుప్రియ కూడా ఆర్టిస్టులుగా కొనసాగుతున్నారు. అన్నపూర్ణ స్టూడియో బాధ్యతల్ని సుప్రియ నిర్వర్తిస్తున్నారు. ఇక అక్కినేని చిన్న కుమార్తె సుశీల కూడా నిర్మాతగా ఉన్నారు. ఆమె కుమారుడు సుశాంత్ నటుడిగా కొనసాగుతున్నారు.



ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల కథానాయకులు పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రణధీర్ కపూర్ కలసి హిందీలో 'కల్ ఆజ్ ఔర్ కల్' (నిన్న నేడు రేపు) అనే చిత్రంలో కలిసి నటించారు. అది 1971లో విడుదలైంది. దాని తర్వాత మూడు తరాల కథానాయకులు కలిసి నటించిన చిత్రం 'మనం'. నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య అందులో ప్రధాన పాత్రధారులు. అఖిల్ ఈ సినిమా పతాక సన్నివేశంలో కనిపిస్తారు. మూడు తరాలకు సంబంధించి ఆసక్తికరమైన కథను తయారు చేసి, విక్రమ్ కుమార్ దర్శకత్వం వహించారు.

తొలి సినిమా 'శ్రీసీతారామ జననం'

మొదటి చిత్రం 'శ్రీసీతారామ జననం'లో శ్రీరాముడి పాత్రను అక్కినేని పోషించారు. 1944లో విడుదలైన ఈ చిత్రానికి ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకుడు.



సాధారణంగా ప్రేక్షకులెప్పుడూ హీరో పాత్ర మరణించడాన్ని జీర్ణించుకోలేరు. కానీ, అక్కినేని నటించిన దేవదాసు, ప్రేమాభిషేకం సినిమాల్లో హీరో మరణించినా ప్రేక్షకులు వాటికి బ్రహ్మరథం పట్టారు. ప్రణయ భావాల్ని, విషాదాల్నీ పలికించడం ఎవరికైనా సులువే. కానీ, వైరాగ్యాన్నీ, వేదాంతాన్నీ కలగలిపి పలికించడం అంత సులువేం కాదు. కళ్లు ఏడుస్తుంటే, పెదాలు నవ్వడం ఏకకాలంలో జరగాలి మరి! అలాంటి కష్టసాధ్యమైన హావభావాల్ని అలవోకగా, అద్భుతంగా పండించిన అసామాన్యుడు అక్కినేని. అందుకే భగ్న ప్రేమికుడి పాత్రలకు ఆలంబనగా, తాగుబోతు పాత్రలకు చిరునామాగా నిలిచారు అక్కినేని

'స్వీయ లోపంబు లెరుగుట పెద్ద విద్య'.. ..అక్కినేని తరుచుగా చెప్పే మాట ఇది. చెప్పడమే కాదు ఆచరణలో కూడా చూపించారు. తన లోపాలను ఇతరులకంటే ముందు గ్రహించి, దానికి అనుగుణంగానే పాత్రలు ఎంపిక చేసుకోవడం అక్కినేని విజయరహస్యం. మనిషి అందగాడు కాదు, అరడుగుల ఆజానబాహు కాదు. మరో వైపు ఎన్టీఆర్ వంటి సర్వాంగ సుందరుడు, ఆజానుబాహుడు తన పోటీగా, సమవుజ్జీగా ఎదుగుతుండగా తన అనర్హతల లేమిని కప్పిపుచ్చుకుంటూ, తన మనోబలాన్ని పెంచుకుంటూ అక్కినేని సాగించిన ఆరోగ్యకరమైన వృత్తిపోటీ ఈ నాటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పాలి

అక్కినేని పోషించిన దసరా బుల్లోడు పాత్ర ఒక సంచలనం. అతను టిప్‌టాప్‌గా రంగురంగుల బట్టలు వేస్తాడు. హీరోయిన్‌తో షికార్లు చేస్తాడు. 'పచ్చగడ్డి కోసేటి పడుచు పిల్లోయ్.. నీ పైటకొంగు జారిందే గడుసు పిల్లా' అని ఆమెని టీజ్ చేస్తాడు. డాన్సులు వేస్తాడు. తమ కుటుంబానికి అపకారం తలపెట్టిన దుష్టుల తాట వలిచేస్తాడు. ఆ పాత్రను సృష్టించింది వి.బి. రాజేంద్రప్రసాద్. ఆ సినిమాకి ఆయనే నిర్మాత, అంతేకాదు, ఆ సినిమాతోటే ఆయన దర్శకుడి అవతారమెత్తారు. అలా 'దసరా బుల్లోడు'గా అక్కినేని వీరంగం ఆడేశారు. ఆయన స్టెప్పుల్లో జనం స్టెప్పులేశారు. ఆ సినిమా నుంచే 'డాన్సింగ్ ఐకాన్'గా రూపు దాల్చారు.

అప్‌డేట్స్

చిత్రీకరణ షురూ



'దసరా' కలయిక మరోసారి కుదిరింది. నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

సంపత్ నందితో శర్వా



శర్వానంద్ కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. 'శర్వా 38' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కె.కె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ గురువారం మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. శర్వా మునుపెన్నడూ చేయని పాత్రలో కనిపించనున్నారని యూనిట్ తెలిపింది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్

మరోసారి మెగాఫోన్



ధనుష్ తాను కీలకపాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రం ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి ఆయన ఓ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు మెగాఫోన్ పట్టారు. డాన్‌పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఇడ్లీ కడై' అనే ఆసక్తికర టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇడ్లీ బండి దగ్గర పిల్లలు నిల్చున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ధనుష్‌కు దర్శకుడిగా ఇది నాలుగో చిత్రం. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కిరణ్ కౌశిక్.

వారంలోగా తేల్చండి



కంగనా రనౌత్, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో నటించి.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెన్సార్ చిక్కులతో చిత్రం విడుదల వాయిదా పడుతోంది. అయితే ఈ సినిమా సెన్సార్ సర్టిఫికేట్ విషయంలో వారంలోగా ఓ నిర్ణయానికి రావాలని బాంబే హైకోర్టు సెన్సార్ బోర్డును ఆదేశించింది. ఈ సినిమా సెప్టెంబర్ 6న విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ చిత్రంలో సిక్కు వర్గాన్ని కించపరిచే సన్నివేశాలు ఉన్నాయి కాబట్టి సినిమా విడుదలను నిలిపివేయాలని కొన్ని సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు వారి వాదనలను పరిగణలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది. మరోవైపు కంగన, చిత్ర నిర్మాణసంస్థ జీ ఎంటర్టైన్‌మెంట్స్ ఈ విషయమై బాంబే కోర్టును ఆశ్రయించగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వమని.. సెన్సార్ బోర్డును ఆదేశించలేమని బాంబే హైకోర్టు తెలిపింది. ఈ క్రమంలోనే తాజా విచారణ అనంతరం వారంలోపు ఓ నిర్ణయానికి రావాలని బాంబే కోర్టు సెన్సార్ బోర్డుకు సూచించింది.

స్పోర్ట్స్

అ ఇటు రవి రవీంద్ర

- జైస్వాల్ అర్ధసెంచరీ
- నిరాశపర్చిన టాపార్డర్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 339/6
- పేసర్ హసన్‌కు నాలుగు వికెట్లు

అదరగొట్టిన అశ్విన్, జడేజా


రవీంద్ర జడేజా (117 బంతుల్లో 86 బ్యాటింగ్)


రవిచంద్రన్ అశ్విన్ (112 బంతుల్లో 102 బ్యాటింగ్)

చెన్నై: బంగ్లాదేశ్‌తో మొదలైన తొలి టెస్టులో లోకల్ బాయ్ రవి చంద్రన్ అశ్విన్ (112 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102 బ్యాటింగ్), రవీంద్ర జడేజా (117 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 86 బ్యాటింగ్) బ్యాటుతో వహ్వా అనిపించారు. అదరగొడతారనుకున్న స్టార్ బ్యాటర్లంతా బంగ్లా పేస్ ధాటికి టపటపా పెవిలియన్‌కు చేరిన వేళ.. ఎనిమిదో నెంబర్ బ్యాటర్‌గా దిగిన అశ్విన్ ఎదురుదాడి చేసి.. కెరీర్‌లో ఆరో శతకం పూర్తిచేశాడు. 144/6 స్కోరుతో జట్టు ఇబ్బందిపడుతున్న దశలో వన్డే తరహాలో అశ్విన్ ఆడిన తీరుకు పరుగులు చకచకా సమకూరగా.. అవతలి ఎండ్‌లో మరో 'లోకల్ బాయ్' (సీఎస్‌కే) రవీంద్ర జడేజా చక్కటి సహకారమందించాడు. ఈ ఇద్దరు ఆల్‌రౌండర్ల నిలకడైన బ్యాటింగ్‌తో టీమిండియా మెరుగైన స్థితిలో నిలిచింది. ఫలితంగా తొలి రోజు గురువారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లకు 339/6 స్కోరు సాధించింది. అశ్విన్-జడ్డూ కలిసి ఏడో వికెట్‌కు అజేయంగా 195 పరుగుల భాగస్వామ్యం అందించడం విశేషం. ఇతర బ్యాటర్లలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (56), రిషబ్ పంత్ (39) మాత్రమే ఆకట్టుకున్నారు. బంగ్లా పేసర్ హసన్ మహమూద్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. తొలి రోజు స్పిన్నర్లు ఒక్క వికెట్ మాత్రమే తీయగలిగారు.

ఆరంభంలోనే టపటపా

ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పాటు పిచ్ కూడా సీమర్లకు అనుకూలించే అవకాశాలు కన్పించడంతో టాస్ గెలిచిన బంగ్లా బౌలింగ్ ఎంచుకుంది. దీనికి తగ్గట్టుగానే ఆ జట్టు పేసర్లు హసన్, నహీద్ భారత స్టార్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. ముఖ్యంగా హసన్ తన వరుస ఓవర్లలో కెప్టెన్ రోహిత్ (6), గిల్ (0), విరాట్ (6)ల పనిబట్టడంతో భారత్‌కు 34/3 స్కోరుతో ఝలక్ తగిలింది. అయితే ఓపెనర్ జైస్వాల్, పంత్ ఈ దశలో హసన్‌ను దీటుగా ఎదుర్కొని మరో వికెట్ కోల్పోకుండా లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. సుదీర్ఘ విరామం తర్వాత టెస్టు ఆడుతున్న పంత్ ఆరు ఫోర్లతో రాణించాడు. అయితే ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. రెండో సెషన్ ఆరంభంలోనే ఓ పేలవ షాట్‌తో పంత్.. హసన్ ఓవర్‌లో అవుటయ్యాడు. నాలుగో వికెట్‌కు వీరు 62 పరుగులు జోడించారు. అటు ఎటాకింగ్‌తో పాటు డిఫెన్సివ్ ఆటతీరుతో ఆకట్టుకున్న జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. స్పిన్నర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో తనతో పాటు రాహుల్ (16) జాగ్రత్తగా ఆడడంతో రన్స్ నెమ్మదించాయి. ఈ దశలో జైస్వాల్‌ను పేసర్ రాణా, రాహుల్‌ను స్పిన్నర్ మెహిదీ హసన్ వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో 145/6తో భారత్ తడబడినట్టు కనిపించింది. అయితే వచ్చీరావడంతోనే అశ్విన్ ఫోర్లతో బ్యాట్‌కు పనిచెప్పాడు.

ఆదుకున్న అశ్విన్-జడ్డూ

తొలి రెండు సెషన్లలో క్రమశిక్షణాయుత బౌలింగ్‌తో బంగ్లా బౌలర్లు ఆరు వికెట్లు తీసి ఆధిపత్యం చూపారు. దీంతో పరుగుల వేటలో భారత్ పూర్తిగా వెనుకబడిపోయింది. కానీ ఆ లోటును స్పిన్ ఆల్‌రౌండర్లు అశ్విన్, జడ్డూ తీర్చారు. ఆఖరి సెషన్‌లో 163 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. ఆరంభంలోనే జడేజా భారీ సిక్సర్‌తో ప్రత్యర్థికి హింట్ ఇచ్చాడు. 52వ ఓవర్‌లో అశ్విన్ రెండు ఫోర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లోనే జడేజా ఫోర్, అశ్విన్ సిక్స్‌తో ధారాళంగా పరుగులు వచ్చాయి. జట్టు స్కోరు కూడా 200 దాటింది. ఈ ధాటికి అశ్విన్ 58 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆ తర్వాత కూడా ఏమాత్రం తగ్గకుండా నిఖార్సయిన షాట్లతో విరుచుకుపడ్డాడు. జడ్డూ సైతం అతడికి చక్కగా సహకరిస్తూ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ చివర్లో ఇద్దరూ భారీ షాట్లతో మరింత జోరును ప్రదర్శించారు. 75వ ఓవర్‌లో జడ్డూ వరుసగా 4,6తో ఆకట్టుకున్నాడు. ఇక కాసేపటికే అశ్విన్ కెరీర్‌లో ఆరో సెంచరీతో అజేయంగా నిలిచి రోజును పూర్తి చేశాడు.

147 ఏళ్ల టెస్టు చరిత్రలో స్వదేశంలో ఆడిన తొలి పది ఇన్నింగ్స్‌లోనే ఎక్కువ రన్స్ (768) చేసిన బ్యాటర్‌గా జైస్వాల్. 89 ఏళ్లుగా ఈ రికార్డు జార్జి హెడ్లీ (747) పేరిట కొనసాగింది. అలాగే స్వదేశంలో మొదట ఆడిన ఆరు టెస్టుల్లోనూ అర్ధ సెంచరీలు చేసిన తొలి భారత బ్యాటర్‌గా జైస్వాల్. రూసీ మోదీ (5)ని అధిగమించాడు.

1

టెస్టుల్లో 50+ పరుగులు, 5+ వికెట్లు 20 సార్లు సాధించిన తొలి ప్లేయర్‌గా అశ్విన్. అలాగే స్వదేశీ టెస్టుల్లో ఎనిమిదో నెంబర్‌లో ఎక్కువ హాఫ్ సెంచరీలు (7) చేసి కపిల్‌దేవ్‌తో సమంగా నిలిచాడు. అంతేకాకుండా చెపాక్‌లో వరుసగా రెండు శతకాలు బాది సచిన్ (3) తర్వాత నిలిచాడు.

బంగ్లాదేశ్‌పై 7+ వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం (195) అందించిన భారత జోడీగా అశ్విన్-జడేజా. అలాగే చెపాక్ మైదానంలో ఈ వికెట్‌కు ఏ జట్టుపై అయినా ఇదే అత్యధికం.

ఎనిమిదో నెంబర్‌లో బరిలోకి దిగి ఎక్కువ సెంచరీ (4)లు బాదిన రెండో బ్యాటర్‌గా అశ్విన్. డానియెల్ వెటోరి (5) ముందున్నాడు.

2

2000 నుంచి భారత్‌లో జరిగిన టెస్టుల్లో తొలి రోజే 4+ వికెట్లు తీసిన రెండో పేసర్‌గా హసన్ మహమూద్. డేల్ స్టెయిన్ (2008లో 5/23) గతంలో ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) షాద్‌మన్ (బి) నహీద్ 56; రోహిత్ (సి) షంటో (బి) హసన్ 6; గిల్ (సి) లిట్టన్ (బి) హసన్ 0; విరాట్ (సి) లిట్టన్ (బి) హసన్ 6; పంత్ (సి) లిట్టన్ (బి) హసన్ 39; రాహుల్ (సి) జకీర్ (బి) మెహిదీ హసన్ 16; జడేజా (బ్యాటింగ్) 86; అశ్విన్ (బ్యాటింగ్) 102; **ఎక్స్‌ట్రాలు: 28; మొత్తం: 80 ఓవర్లలో 339/6. వికెట్ల పతనం:** 1-14, 2-28, 3-34, 4-96, 5-144, 6-144; **బౌలింగ్:** టస్కిన్ అహ్మద్ 15-1-47-0; హసన్ మహమూద్ 18-4-58-4; నహీద్ రాణా 17-2-80-1; మెహిదీ హసన్ మిరాజ్ 21-2-77-1; షకీబ్ అల్ హసన్ 8-0-50-0; మోమినుల్ హక్ 1-0-4-0.

జడేజాతో సమంగా..

అజేయ శతకంతో అదరగొట్టిన రవి అశ్విన్ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో అరుదైన రికార్డును నెలకొల్పాడు. డబ్ల్యూటీసీలో వెయ్యి పరుగులు, 100+ వికెట్లు పూర్తి చేసిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో జడేజా మొదట ఈ ఫీట్ (1637 రన్స్, 102 వికెట్లు)ను సాధించాడు. అలాగే అశ్విన్ తాజా టెస్టులో 5 వికెట్లు తీస్తే డబ్ల్యూటీసీలో ఎక్కువసార్లు (11) ఈ ఫీట్ సాధించిన బౌలర్‌గా నాథన్ లియాన్ (10సార్లు)ను అధిగమిస్తాడు.

అశ్విన్ కట్ షాట్‌కు గౌతీ షాక్



బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ అశ్విన్ ఆడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా తన షాట్ల ఎంపిక అటు డగౌట్‌లో కూర్చున్న కోచ్ గంభీర్‌ను కూడా ఆశ్చర్యపరిచింది. 44వ ఓవర్‌లో 144.2కి.మీ వేగంతో పేసర్ నహీద్ రాణా వేసిన షార్ట్ వైడ్ బాల్‌ను కట్ షాట్‌తో ఫోర్‌గా మలిచిన తీరుకు గౌతీ ఫిదా అయ్యాడు. ఆ సమయంలో అతడి ముఖకవళికలు వైరల్‌గా మారాయి. అటు కామెంటేటర్లు కూడా దీన్ని 'షాట్ ఆఫ్ ది డే'గా అభివర్ణించారు.

చెన్నైలో ఆడడం ఎప్పటికీ మధురమే..

'సొంత అభిమానుల మధ్య ఆడడం ఓ ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఈ మైదానంలోనే నేను క్రికెట్‌ను ఆరాధించింది. ఇక్కడ నాకెన్నో అద్భుత జ్ఞాపకాలున్నాయి. చివరి టెస్టులోనూ శతకం బాదాను. టీఎన్‌పీఎల్‌లో ఆడడం బ్యాటింగ్‌లో ఉపకరించింది. ఇది పాతకాలపు చెన్నై పిచ్. స్పిన్ బంతుల్లో సహజంగానే కాస్త బౌన్స్ కనిపిస్తుంటుంది. ఈసారీ అలాగే జరిగింది. రెండో రోజు కొత్త బంతి వారికి సహకరిస్తుందేమో చూడాలి. నేను అలసటగా ఉన్నప్పుడు మరో ఎండ్ నుంచి జడేజా అద్భుత సహకారం అందించాడు' - అశ్విన్

అజయ్ రికార్డు స్వర్ణం

కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్



సువా (ఫిజి): కామన్వెల్త్ చాంపియన్‌షిప్స్‌లో భారత టీనేజ్ వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు రికార్డు స్థాయి ప్రదర్శనతో పసిడి పతకం సొంతం చేసుకొన్నాడు. గురువారం జరిగిన జూనియర్ 81 కిలోల విభాగంలో 19 ఏళ్ల బాబు మొత్తం 326 (147+179) కిలోల బరువు ఎత్తి టాప్‌లో నిలిచాడు. ఈ క్రమంలో జూనియర్ కేటగిరీలో క్లీన్ అండ్ జెర్క్‌లో చాంపియన్‌షిప్ రికార్డును నెలకొల్పాడు. అంతేకాకుండా స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌తోపాటు మొత్తం ఎత్తిన బరువులోనూ జాతీయ జూనియర్ రికార్డును బద్దలుకొట్టాడు. కాగా విజయనగరం జిల్లాకు చెందిన అజయ్ బాబు మధ్యప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు.

రికీ, భరత్ అర్ధ శతకాలు

- ఇండియా-డి 306/5
- ఇండియా-బితో దులీప్ ట్రోఫీ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (0) మరోసారి డకౌటైనా.. సంజూ శాంసన్ (89 బ్యాటింగ్)తోపాటు రికీ భుయ్ (56), కేఎస్ భరత్ (52) అర్ధ శతకాలతో చెలరేగడంతో ఇండియా-డి భారీ స్కోరు దిశగా సాగుతోంది. దులీప్ ట్రోఫీలో ఇండియా-బితో గురువారం ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 306/5 స్కోరు చేసింది.

రావత్ అజేయ శతకం..: మరో మ్యాచ్‌లో శాశ్వత్ రావత్(122 బ్యాటింగ్) సెంచరీతో ఆదుకోవడంతో ఇండియా-ఎ కోలుకొంది. ఇండియా-సితో ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ 224/7 స్కోరు చేసింది. 36/5తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ సమయంలో షామ్స్ ములాని (44)తో కలసి రావత్ వికెట్ల పతనాన్ని అడ్డుకొన్నారు. అయితే, ములానీని అవుట్ చేసిన గౌరవ్.. ఆరో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు.

గిల్మోర్‌కు మాళవిక షాక్

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్



చాంగ్జౌ (చైనా): భారత షట్లర్ మాళవిక బన్సోడ్ చైనా ఓపెన్‌లో సంచలన ప్రదర్శన కొనసాగిస్తోంది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, వరల్డ్ నెంబర్ 7 గ్రెగోరియా (ఇండోనేసియా)కు తొలి రౌండ్‌లో షాకిచ్చిన 23 ఏళ్ల మాళవిక..ఈసారి క్రిస్టీ గిల్మోర్‌ను కంగుతినిపించింది. ప్రీక్వార్టర్‌ఫైనల్లో బన్సోడ్ 21-17, 19-21, 21-16తో వరల్డ్ నెం.25, రెండుసార్లు కామన్వెల్త్ క్రీడల పతక విజేత గిల్మోర్ (స్కాట్లాండ్)పై విజయం సాధించింది.

మనోళ్లు 'టాప్'లోనే

- ఎనిమిదో రౌండ్‌లో పురుషులు గెలుపు
- మహిళలకు తొలి ఓటమి • చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: స్వర్ణ పతకమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్ బరిలో దిగిన భారత పురుషులు, మహిళల జట్లు ఆ దిశగా దూసుకుపోతున్నాయి. పురుషులు (16 పాయింట్లు) అపజయమే లేకుండా ఎనిమిదో రౌండ్‌నూ ముగించారు. కాకపోతే..మహిళలకే టోర్నీలో తొలి ఓటమి ఎదురైంది. గురువారం జరిగిన ఈ రౌండ్‌లో రెండో సీడ్ పురుషుల జట్టు 3.5-0.5 స్కోరుతో ఇరాన్‌ను ఓడించింది. టాప్ సీడ్ మహిళల జట్టుకు పోలెండ్ 2.5-1.5తో షాకిచ్చింది. మహిళల జట్టు పోలెండ్, కజకిస్థాన్‌తో కలిసి 14 పాయింట్లతో నిలిచింది. కానీ మెరుగైన టైబ్రేకర్ స్కోరుతో మన మహిళలే టాప్‌లో కొనసాగుతున్నారు. పురుషుల విభాగంలో..నల్లపావులతో ఆడిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి 36 ఎత్తుల్లోనే దనేశ్వర్ బర్దియాను చిత్తు చేశాడు. గుకేష్-మగ్‌సోట్లో పర్హమ్‌పై, విదిత్ గుజ్‌రాతీ-ఇదానీ పొయా విజయం సాధించారు. అయితే తబతబేయీ అమీన్‌తో జీఎం ప్రజ్ఞానంద పాయింటును పంచుకున్నాడు. మహిళల్లో..తొలి గేమ్‌లో సోకో మోనికపై వైశాలీ ఓడిపోయింది. దాంతో మనోళ్లు 0-1తో వెనుకంజలో నిలవగా..నల్లపావులతో ఆడిన దివ్య దేశ్‌ముఖ్-అలెక్సాండ్రాపై గెలవడంతో స్కోరు 1-1తో సమమైంది. తెలుగు జీఎం హారిక..కషిన్స్కయా చేతిలో ఓడడంతో పోలెండ్ మళ్లీ 2-1 ఆధిక్యం సాధించింది.. ఇక..నిర్ణాయక ఆఖరి గేమ్‌ను అలిక్జాతో వంతిక అగర్వాల్ డ్రా చేయడంతో పరాజయం తప్పలేదు.

బిజినెస్

మార్కెట్‌కు ఫెడ్ బూస్ట్



ముంబై: అమెరికా కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించడం ఈక్విటీ మార్కెట్లకు ఊత్సాహాన్నిచ్చింది. మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరపడంతో గురువారం దేశీయ ఈక్విటీ సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 825.38 పాయింట్లు ఎగబాకి 83,773.61 వద్ద ఆల్ టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కానీ, గరిష్ఠ స్థాయిల్లో లాభాల స్వీకరణ కారణంగా చివరికి 236.57 పాయింట్ల లాభంతో 83,184.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఉదయం 234.4 పాయింట్ల వృద్ధితో 25,611.95 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసినప్పటికీ, చివరికి 38.25 పాయింట్ల లాభంతో 25,415.80 వద్ద క్లోజైంది.

- ఎన్‌టీపీసీ షేరు 2.45 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 1.06 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.53 శాతం తగ్గాయి.
- భారత కరెన్సీ రెండు నెలల గరిష్ఠ స్థాయికి పెరిగింది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు పెరిగి 83.65 వద్ద ముగిసింది.

ఐపీఓ సమాచారం

- ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓకు చివరి రోజు నాటికి 106.40 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించగా.. నార్తర్న్ ఏఆర్‌సీ క్యాపిటల్ ఇష్యూకు 110.71 రెట్ల బిడ్లు వచ్చాయి. వెస్టర్న్ క్యారియర్ ఆఫర్ 30.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.
- కోల్‌కతాకు చెందిన ఎల్లెన్‌బ్యారీ ఇండస్ట్రియల్స్ గ్యాసెస్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయి పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.400 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.44 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

బ్రిటన్‌లో వడ్డీ రేట్లు యథాతథం

లండన్: వడ్డీరేట్లను యథాతథంగా ఐదు శాతం వద్ద కొనసాగించాలని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) నిర్ణయించింది. ఆగస్టు నెల రిటైల్ ద్రవ్యోల్బణం 2.2 శాతంగా ఉన్న నేపథ్యంలో ఈ చర్య తీసుకుంది. ఇది మరింత తగ్గే వరకు వడ్డీరేట్ల తగ్గింపుపై తొందరపడకూడదని బీఓఈ నిర్ణయించింది.

దీపావళి నాటికి బంగారం 78000?

- ఫెడ్ రేటు కోత ప్రభావం
- మున్ముందు మరింత ప్రియం!



వెండి @ రూ.91,000

న్యూఢిల్లీ: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేటును 0.50 శాతం తగ్గించిన నేపథ్యంలో రాబోయే కాలంలో బంగారం ధరలు చుక్కలనంటవచ్చునని విశ్లేషకులంటున్నారు. అమెరికన్ ఫెడరల్ బుధవారం వడ్డీరేటును 0.50 శాతం పెంచడంతో పాటు ఈ ఏడాది చివరినాటికి మరో అర శాతం, 2025లో ఒక శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని సంకేతాలిచ్చింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఆల్‌టైం గరిష్ఠాల వద్ద ట్రేడవుతోంది. ఇది స్వల్పకాలికంగా దిద్దుబాటుకు లోనయ్యే అవకాశాలున్నప్పటికీ.. రాబోయే కాలంలో మాత్రం ధరలు మరింత ఎగబాకనున్నాయని బులియన్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ దీపావళి నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 2,650 డాలర్ల స్థాయికి, దేశీయంగా తులం బంగారం రూ.78,000 స్థాయికి చేరుకోవచ్చని కామ జువెలర్స్ ఎండీ కోలిన్ షా అంటున్నారు.

ఫెడ్ రేటు తగ్గితే బంగారం పైకే...

సాధారణంగా ఫెడ్ రేట్లు, బులియన్ ధరలది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్నప్పుడు విలువైన లోహాల ధరలు తగ్గుతాయి. ఫెడ్ రేట్ల తగ్గుదల సమయంలో బులియన్ ధరలు ఎగబాకుతాయి. ఫెడ్ దూకుడుగా వడ్డీరేట్లను తగ్గిస్తే గనుక, వచ్చే ఏడాది జూన్ నాటికి ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్ల స్థాయికి చేరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

ఇదిలా ఉండగా దేశీయ మార్కెట్లో గురువారం బులియన్ రేట్లు మరింత ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.100 పెరుగుదలతో రూ.75,650కి చేరుకుంది. కిలో వెండి రూ.500 పెరిగి రూ.91,000 ధర పలికింది. ఫెడ్‌రేట్లు తగ్గడంతో అంతర్జాతీయంగా విలువైన లోహాలకు డిమాండ్ పెరిగింది. ఇందుకు తోడు దేశీయంగా ఆభరణాల వర్తకులు వీటి కొనుగోళ్లు పెంచడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. అయితే, రూపాయి బలోపేతం దేశీయంగా బులియన్ ర్యాలీని పరిమితం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒకదశలో 0.45 శాతం పెరిగి ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 2,610.20 డాలర్ల వద్ద ట్రేడైంది. వెండి సైతం 2.58 శాతం వృద్ధితో 31.48 డాలర్లకు చేరుకుంది.



హైదరాబాద్‌లో అల్ట్రా వయొలెట్ స్పేస్ స్టేషన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ బైక్‌ల తయారీలోని అల్ట్రా వయొలెట్ హైదరాబాద్‌లో స్పేస్ స్టేషన్‌ను (షోరూమ్) ప్రారంభించింది. ఇప్పటికే ఇతర నగరాల్లో తాము విక్రయిస్తున్న ఎఫ్77 మాక్ 2 బైక్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ, వ్యవస్థాపకుడు నారాయణ్ సుబ్రమణియం మాట్లాడుతూ బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న తమ కంపెనీ విక్రయాలు ప్రారంభించిన ఐదో నగరం హైదరాబాద్ అని చెప్పారు. శుక్రవారం ముంబైలో రేసింగ్ సూపర్ బైక్ ఎఫ్99ని ఆవిష్కరించనున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే రెండుమూడేళ్ల కాలంలో మరిన్ని కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి దేశంలోని 10 నగరాలకు విస్తరించాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. అలాగే వచ్చే నెలలో యూరోపియన్ మార్కెట్లోకి కూడా తాము ప్రవేశించనున్నట్టు నారాయణ్ తెలిపారు. ఎఫ్ 77 బైక్ ఒక సారి పూర్తిగా చార్జి చేసినట్టయితే 323 కిలోమీటర్లు నడుస్తుందన్నారు. ఇది రెండు వేరియెంట్లలో అందుబాటులో ఉంటుందంటూ 7 కిలోవాట్ బైక్ ధర రూ.2.99 లక్షలని, 10 కిలోవాట్ బైక్ ధర రూ.3.99 లక్షలని ఆయన వెల్లడించారు. ఈ బైక్ గంటకు 155 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందంటూ ఎఫ్ 99 బైక్ గంటకు 265 కిలోమీటర్ల వేగం కలిగి ఉంటుందని చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,450 ▼	68,250 ▼	96,000 ▼
ముంబై	73,480 ▲	67,310 ▲	88,420 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	116
కరీంనగర్	105	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	110
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	103	అనంతపురం	110
గోదావరి	113		

ఫ్రియర్ ఎనర్జీ నుంచి 'ఎక్స్‌పీరియన్స్' సెంటర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నివాస గృహాలు, ఎంఎస్ఎంఈలకు రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలు సరఫరాచేసే 'ఫ్రియర్ ఎనర్జీ' తన సేవలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా శనివారం కరీంనగర్‌లో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుచేస్తోంది. వచ్చే నెల విశాఖపట్టణం, విజయవాడల్లోనూ ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని కంపెనీ ఎండీ సౌరభ్ మర్దా చెప్పారు. వచ్చే రెండేళ్లలో తాము పని చేస్తున్న ఆరు రాష్ట్రాల్లోని 48 నగరాలకు ఈ కేంద్రాలను విస్తరిస్తామన్నారు. ఈ ఎక్స్‌పీరియన్స్ కేంద్రాల్లో కంపెనీ ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలకు సంబంధించిన అన్ని సేవలు ఒకేచోట లభ్యమవుతాయి. తమ ఇంటిపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయాలనుకునే వ్యక్తులు, సంస్థలు ఈ కేంద్రాల ద్వారా లేదా యాప్ ద్వారా తమను సంప్రదిస్తే ప్రభుత్వ సబ్సిడీ, రుణాలు మొదలుకుని అన్ని రకాల సేవలు అందిస్తామని సౌరభ్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం రూ.100 కోట్లున్న తమ టర్నోవర్ ఈ ఆర్థిక సంవత్సరం రెట్టింపు అవుతుందని ఆశిస్తున్నట్టు కంపెనీ కొ-ఫౌండర్, డైరెక్టర్ రాధికా చౌదరి తెలిపారు. ఐదేళ్ల వారెంటీతో తమ రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ లభిస్తాయన్నారు.

తమిళనాడులో ఆచ్చి మసాలా కొత్త ఫ్యాక్టరీ



చెన్నై (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తుల రంగంలోని ఆచ్చి మసాలా తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరపేట సమీపంలో కొత్త ఫ్యాక్టరీని ప్రారంభించింది. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ఫ్యాక్టరీని ప్రారంభించినట్టు కంపెనీ చైర్‌పర్సన్ ఏడీ పద్మసింగ్ ఐజాక్ తెలిపారు. ఢిల్లీలో వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 సదస్సు సందర్భంగా తాము ఈ ఫ్యాక్టరీని ప్రారంభించినట్టు ఆమె చెప్పారు. రెండున్నర దశాబ్దాలకు పైగా ఆహార, మసాలా వస్తువుల తయారీలో పేరెన్నిక గన్న ఆచ్చి మసాలా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ 65 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతిచేస్తోందని ఆమె తెలిపారు. తమ సంస్థ 220 రకాల ఆహారవస్తువులను తయారు చేసి, 15 లక్షల దుకాణాల ద్వారా దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. తమ సంస్థలన్నింటిలోనూ అత్యధికంగా మహిళలే పనిచేస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం పీఎల్ఐ పథకం ద్వారా రూ. 150 కోట్ల ప్రాజెక్టు తమకు అందించడమే కాకుండా రూ.80 కోట్ల వరకు సబ్సిడీని ఇచ్చిందన్నారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటైన రెండు ఫ్యాక్టరీలలో అదనంగా 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. వచ్చే మూడేళ్లలో రూ.80 కోట్లు పెట్టుబడి పెట్టనున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విని పాండియన్ తెలిపారు.

భారత్‌లో మరిన్ని నియామకాలు: సేల్స్‌ఫోర్స్

శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా): కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం) సేవల రంగంలో ఉన్న సేల్స్‌ఫోర్స్ భారత్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్, బెంగళూరుల్లోని కేంద్రాలను మరింత విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకోసం మరిన్ని నియామకాలు చేపట్టనున్నట్టు సేల్స్‌ఫోర్స్ ఇండియా చీఫ్ అరుంధతీ భట్టాచార్య చెప్పారు. అయితే ఎంత మందిని తీసుకునేదీ ఆమె వెల్లడించలేదు. గత రెండేళ్లలోనే భారత్‌లో తమ ఉద్యోగుల సంఖ్య రెట్టింపు పైగా పెరిగి 13,000 దాటిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఇన్నొవేషన్ హబ్‌ల అభివృద్ధి కోసం మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్టు సేల్స్‌ఫోర్స్ ఇంజనీరింగ్ విభాగం చీఫ్ శ్రీని తల్లాప్రగడ తెలిపారు.

బ్రాండ్ విలువలో టీసీఎస్ టాప్

న్యూఢిల్లీ: భారత్‌లో టాప్-75 బ్రాండ్ల విలువ 40,050 కోట్ల డాలర్లకు (సుమారు రూ.37.68 లక్షల కోట్లు) చేరినట్టు గురువారం వెలువడిన కాంటార్ బ్రాండ్జ్ నివేదిక తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 19 శాతం ఎక్కువ. ఈ బ్రాండ్లలో ఐటీ దిగ్గజం టీసీఎస్ 4,970 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,15,740 కోట్లు) వాల్యుయేషన్‌తో అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. కాంటార్ బ్రాండ్జ్ నివేదికలో టీసీఎస్ అగ్రస్థానంలో నిలబడడం వరుసగా ఇది మూడో ఏడాది. టీసీఎస్ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ దేశంలో అత్యంత విలువైన బ్రాండ్లుగా నిలిచాయి. ఈ ఏటి టాప్-75 వాల్యుబుల్ బ్రాండ్లలో ఆర్థిక సేవల రంగానికి చెందిన కంపెనీల బ్రాండ్లు 17 ఉన్నాయి.

వరద బాధితులకు అదానీ సాయం 25కోట్లు

» ఏపీ సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేసిన కరణ్ అదానీ


ఏపీ సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కరణ్ అదానీ

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. అమరావతి సచివాలయంలో గురువారం ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ రూ.25కోట్ల విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆయన మంత్రి లోకేశ్‌ను కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామి కావడానికి సిద్ధంగా ఉన్నామని కరణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వరద బాధితులకు అదానీ సంస్థల తరపున భారీ విరాళం అందించినందుకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూ.5 కోట్లు, శ్రీశైలం నియోజకవర్గ ప్రజలు, నాయకుల తరపున ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి రూ.2.22కోట్లు, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ తరపున రూ.1,00,10,116ను సీఎం చంద్రబాబుకు అందించారు.

రేవంత్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోండి

» ఖర్గే, రాహుల్‌కు హరీశ్ రావు లేఖ



హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో దుర్యోధనుడిలా సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్తన ఉందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధమని మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్‌పై ఆయన ఉపయోగిస్తున్న అసభ్యకరమైన భాష, నేరపూరిత వ్యాఖ్యలను అరికట్టాలని, ఆయనపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి గురువారం లేఖ రాశారు. 'రాహుల్ గాంధీపై బీజేపీ తీవ్రవాది అని వ్యాఖ్యలు చేస్తే.. రాజకీయాల్లో దిగజారుడు విమర్శలంటూ కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. అలాంటి దూషణలే రేవంత్‌రెడ్డి చేస్తే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు? ఇది ద్వంద్వ వైఖరి కాదా? ఢిల్లీలో ఒక రూల్ గల్లీలో ఒక రూల్ మీకే చెల్లుతుంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో నియంతృత్వ పాలన కొనసాగుతోందన్నారు. రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో రైతాంగం సంఘటితమై ఛలో ప్రజాభవన్‌కు పిలుపునిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుట్టిందని, అందుకే రైతులను, రైతు సంఘాల నాయకులను పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని హరీశ్ ఆరోపించారు. రైతుల అక్రమ అరెస్టులు దుర్మార్గమని, తీవ్రంగా ఖండిస్తున్నానని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ప్రాణాలు కాపాడమంటే మాపై బురద జల్లుతారా?

» గాంధీలో శిశుమరణాలపై ప్రభుత్వ స్పందన అమానవీయం

» బీఆర్ఎస్ తరపున నిజనిర్ధారణ కమిటీ వేస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో లోపాలను సరిదిద్ది పసిపిల్లలు, బాలింతల ప్రాణాలు కాపాడమని కోరితే.. ప్రతిపక్షంపై బురదజల్లే ప్రయత్నం తగదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గాంధీ ఆస్పత్రిలో మాతా శిశు మరణాలపై ప్రభుత్వం స్పందిస్తున్న తీరు అమానవీయంగా ఉందని గురువారం ఎక్స్ వేదికగా విమర్శించారు. అనుభవజ్ఞులైన డాక్టర్లను బదిలీ చేయడం వల్ల అక్కడ చికిత్సలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. దీన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చిన బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగడం బాధాకరమని, సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం మంచిది కాదన్నారు. గాంధీలో మాతాశిశు మరణాలపై బీఆర్ఎస్ తరపున నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసి గుర్తించిన అంశాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఆ దాడుల్లో పోలీసు పాత్ర: జగదీశ్ రెడ్డి

» చర్యల తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై స్పందించాలని, ఆయాఘటనలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలు రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను కోరారు. ఈ మేరకు మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జి.జగదీశ్‌రెడ్డి, పార్టీ నేతలు వివేకానంద్, సంజయ్‌కుమార్, పాడి కౌశిక్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు డీజీపీకి గురువారం ఓ వినతిపత్రం అందజేశారు. అనంతరం జగదీశ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ దాడిలో ఏసీపీ, సీఐ పాత్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ చిల్లర దాడులకు బీఆర్ఎస్ భయపడదని, వీపు చింతపండు అవుతుందన్న సీఎం నోరు అదుపులో పెట్టుకోవాలని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. కాగా, ప్రభుత్వాన్ని నడపడం చేతగాక గత ప్రభుత్వం అప్పులు చేసిందని విమర్శిస్తూ మంత్రి భట్టి విక్రమార్క ఏడుపుగొట్టు మాటలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాతాళానికి తీసుకెళుతోందని అన్నారు.

మరణాల డేటా బయటకు రావడంపై దర్యాప్తు

» గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి

అడ్డగుట్ట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో మరణాలకు సంబంధించిన డేటా ఎలా బయటికి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. రెండు రోజుల క్రితం బయటికు వచ్చిన డాటాలో మృతుల సంఖ్య అవాస్తవమన్నారు. ఆస్పత్రిలో సరిపడా ప్రొఫెసర్లు, వైద్యులు ఉన్నారని, ఎక్కడా పొరపాటు జరగలేదని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకుంటోన్న గర్భిణులను చివరి దశలో సిఫార్సు చేస్తున్నారని తెలిపారు. నేరుగా గాంధీలో చేరితే ఇలాంటి ఘటనలు జరగవన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమని స్పష్టం చేశారు.

బోగస్ రేషన్ కార్డులను రద్దు చేయాలి

» మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాసిన ఎఫ్‌జీజీ

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బోగస్ రేషన్ కార్డులను ఏరివేసి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 20 శాతం జనాభాకు మాత్రమే ఉచిత బియ్యాన్ని పంపిణీ చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) సూచించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభ రెడ్డి లేఖ రాశారు. రాష్ట్రంలోని 90 లక్షల రేషన్ కార్డుల ద్వారా సుమారు 2.84 కోట్ల జనాభాకు ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామంటూ మంత్రి వెల్లడించారని తెలిపింది. రాష్ట్ర జనాభాలో 13.74 శాతం మంది మాత్రమే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారంటూ నీతి అయోగ్ వెల్లడించిందని తెలిపింది. ఈ లెక్కన ప్రతి నెలా రూ.600 కోట్ల విలువైన బియ్యం అనర్హులకు చేరుతోందని వివరించింది.


జీవో 205 పరిధి విస్తరించేలా కృషి చేయండి

గవర్నర్‌కు ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీకి చర్యలు తీసుకోవాలని కోరుతూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కోటపాటి నరసింహం నాయుడు బృందం గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేసింది. తెలంగాణ నుంచి లక్షల మంది కార్మికులు 18 ఈసీఆర్ దేశాలకు, కాంబోడియా, రష్యాకు వెళ్తున్నారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం 7 దేశాలకు వెళ్లే వారికి మాత్రమే వర్తించే విధంగా జీవో నంబరు 205 జారీ చేసిందని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. యూఏఈ, బెహ్రయిన్, ఖతార్, ఓమన్, కువైట్, సౌదీ, ఇరాక్ దేశాల్లో కార్మికులుగా వెళ్లి ప్రమాదవశాత్తు చనిపోతే ఇచ్చే రూ.5లక్షల పరిహారాన్ని విగతా ఈసీఆర్ దేశాలకు కూడా వర్తించేలా జీవో 205 పరిధిని విస్తరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

ఇదేం ఘోరం గోవిందా!

(మొదటిపేజీ తరువాయి)


Annexure-1
Lab. Ref. No. AB023654
Sample Name : Ghee
Table- 1. S-Values for sample

Equation No.	S-Value	Standard S value limits as per method
1	86.62	98.05 to 101.95
2	106.89	99.42 to 100.58
3	22.43	95.90 to104.10
4	117.42	97.96 to 102.04
5	19.72	95.68 to 104.32

Interpretation
- The S value of all equations for sample coded as AB023654 are falling out of the range as prescribed by method.
- If any S-value falls outside the corresponding limits, consider the sample to contain a foreign fat.

Table -2. S-value equation for its suspected adulterants as per ISO 17678 : 2019

Equation No.	Foreign fat
1	Soya bean, Sunflower, Olive, Rapeseed, Linseed, Wheat germ, Maize germ, Cotton seed, Fish oil
2	Coconut and Palm kernel fat
3	Palm oil and Beef tallow
4	Lard
5	Total

నెయ్యి నాణ్యతపై జరిపిన పరీక్షల నివేదిక

వెల్లువెత్తాయి. అదే సమయంలో ఎంతోకాలంగా నాణ్యమైన నెయ్యి సరఫరా చేస్తున్న తమను టీటీడీ అధికారులు కావాలని పక్కన పెట్టారని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఆరోపించడం దీనికి బలం చేకూర్చింది. అప్పట్లో టీటీడీ యంత్రాంగం మొండిగా ముందుకెళ్లడంతో భక్తులు, హిందూ ధర్మ ప్రచారకులు, ప్రతిపక్ష నేతలూ సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం వినహా మరేమీ చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నెయ్యి నాణ్యతను పరీక్షించడంతో కల్తీ గుట్టు రట్టయింది. అభ్యంతరకర పదార్థాలు ఉన్నాయని రిపోర్టుతోసహా టీడీపీ ముఖ్యనేత ఆనం వెంకట్రమణారెడ్డి బహిర్గతం చేయడంతో శ్రీవారి భక్తుల్లో అలజడి రేగుతోంది.

ఎదురు దాడులు.. అడ్డగోలు వాదనలు

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడగా, 2020 ఫిబ్రవరి దాకా శ్రీవారి లడ్డూల నాణ్యత గురించి ఎక్కడా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. కొవిడ్ తర్వాత 2020 డిసెంబరు నుంచీ భక్తుల్లో అసంతృప్తి కనిపిస్తూ వచ్చింది. లడ్డూల్లో మునుపటి రుచి గానీ, సువాసన గానీ, నాణ్యత గానీ లేదన్న ఆరోపణలు మొదలయ్యాయి. హిందూ ధర్మ ప్రచారకుడు రాధా మనోహర్ దాస్ తొలిసారి సామాజిక మాధ్యమాల్లో లడ్డూ నాణ్యతను ప్రశ్నించారు. అప్పట్లో ఈ అంశానికి దేశవ్యాప్తంగా ప్రచారం లభించింది. అప్పటి నుంచీ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో పలువురు భక్తులు లడ్డూ నాణ్యతపైన, అలాగే అన్న ప్రసాదాల పైన కూడా ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. లడ్డూ రుచికరంగా లేకపోవడంతో పాటు రెండు రోజులకే పాడవుతోందన్న ఫిర్యాదులు పెరిగాయి. ఇక అన్న ప్రసాదాల విషయంలో అయితే అన్న ప్రసాద సత్రంలో భోజనం చేసిన సుమారు 20 మంది భక్తుల బృందం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "అన్నం తింటుంటే గడ్డి తింటున్నట్టు ఉంది. మేము భక్తులమా లేక పశువులమా?" అని సిబ్బందిపై విరుచుకుపడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా అప్పట్లో వైరల్ అయింది. అయినా అప్పటి టీటీడీ పాలకమండలి దీన్ని కొట్టి పారేసింది. కానీ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రాష్ట్రంలో దెబ్బతిన్న వ్యవస్థల ప్రక్షాళనను టీటీడీ నుంచే ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇందులో భాగంగా కొన్నేళ్లుగా భక్తులనుంచి తీవ్ర విమర్శలు వస్తున్న లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతపై కొత్త ఈవో శ్యామలరావు దృష్టి పెట్టారు. అప్పటికి ఐదేళ్లుగా తమిళనాడుకు చెందిన కంపెనీ సహా ఐదు సంస్థలు తిరుమలకు నెయ్యిని సరఫరా చేస్తున్నాయి. ఈవో శ్యామలరావు నెలపాటు పోటు కార్మికులు, అన్న ప్రసాదాల తయారీ విభాగం కార్మికులు, అధికారులతో తరచూ సమావేశమై సమీక్షించారు. ఏయే వస్తువులు వాడుతున్నారు? ఎంత పరిమాణంలో? ఎక్కడి నుంచీ సేకరిస్తున్నారు? వాటి నాణ్యత ఎలా వుంది? పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు ఏమిటి? అని ఆరా తీశారు. లడ్డూ సహా అన్నప్రసాదాల నాణ్యత తగ్గడానికి ప్రధాన కారణం నాణ్యత లేని నెయ్యి అని ఆయన దృష్టికి వచ్చినట్టు తెలిసింది. దీన్ని నిర్ధారించుకోవడానికి ఈ కంపెనీలు సరఫరా చేస్తున్న నెయ్యి శాంపిల్‌ను పరీక్షల నిమిత్తం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీకి చెందిన అనుబంధ ల్యాబ్‌కు పంపించారు. జూలై 8న పంపగా వాటి రిపోర్టు అదే నెల 16వ తేదీన వచ్చింది. అందులో.. తమిళనాడుకు చెందిన కంపెనీ అందిస్తున్న నెయ్యిలో భారీగా కల్తీ జరిగినట్టు నివేదిక తేల్చింది. దీంతో తమిళనాడుకు చెందిన సంస్థ నుంచి నెయ్యి సరఫరాను నిలిపివేశారు. మిగతా సంస్థలను నాణ్యతను పాటించాలని హెచ్చరించారు. నందినీ నెయ్యి సరఫరాను పునరుద్ధరించారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో చంద్రబాబు దీనిపై తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై చర్యలకు ఆదేశించారు.



అన్నప్రసాదాలపై...

శ్రీవారి అన్న ప్రసాదాల తయారీకి ప్రకృతి వ్యవసాయ దిగుబడులను వాడుతున్నామని, ఆ కారణంగా రుచిలో తేడా వచ్చింది తప్ప నాణ్యత దెబ్బతినలేదని అప్పట్లో టీటీడీ అధికారులు చెప్పిన వివరణ కూడా భక్తులకు సంతృప్తి కలిగించలేదు. అవసరమైన పరీక్షలు నిర్వహించి రుచి, సువాసన, నాణ్యతలో తేడా లేకుండా చర్యలు తీసుకున్నాకే ప్రవేశపెట్టాలి. కానీ, ఆలోచన వచ్చిందే తడవుగా కోట్లాది మంది పవిత్రంగా భావించే ప్రసాదాల తయారీని ఎలా మారుస్తారన్న ప్రశ్నకు టీటీడీ నుంచి అప్పట్లో సమాధానం లేకపోయింది.

పేలవంగా టీటీడీ వాదన

కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఛైర్మన్ చేసిన ఆరోపణలు, శ్రీవారి ప్రసాదాల నాణ్యత తగ్గిందని వచ్చిన ఫిర్యాదులపై అప్పట్లో టీటీడీ చేసిన వాదన చాలా పేలవంగా అనిపించింది. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్.. టీటీడీ అవసరాలకు తగిన మేరకు సకాలంలో, తగిన పరిమాణంలో నెయ్యి సరఫరా చేయలేకపోయిందని టీటీడీ అధికారులు వివరణ ఇచ్చారు. ఒకే సమయంలో కనీసం రెండు మూడు సంస్థల నుంచి టీటీడీ వేర్వేరు పరిమాణాల్లో నెయ్యి సేకరిస్తూ వస్తోంది. 2014 నుంచీ టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న కేఎంఎఫ్ ఎప్పుడూ టీటీడీ నిర్దేశించిన పరిమాణంలో నెయ్యి సరఫరా చేస్తూ వచ్చింది. దీంతో గత ప్రభుత్వంలో అధికారులు చేసిన వాదన నిలవలేదు.

రివర్స్‌లో 'నందినీ'కి టెండర్!

దేశంలో గుజరాత్ ఆనంద్ డెయిరీ తర్వాత అంతటి పేరు ప్రతిష్ఠలున్న సంస్థ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్. ఈ ఫెడరేషన్ నందినీ బ్రాండ్ పేరిట నెయ్యిని సుదీర్ఘ కాలం టీటీడీకి సరఫరా చేసింది. కేఎంఎఫ్ సరఫరా చేసే నెయ్యి నాణ్యతాపరంగా పేరు మోసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూడా కొంతకాలం కేఎంఎఫ్‌యే టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. అయితే 2023లో హఠాత్తుగా నందినీ నెయ్యి సరఫరాను నిలిపివేశారు. దీనిపై స్పందించిన టీటీడీ ఉద్దేశపూర్వకంగానే తమను పక్కన పెట్టిందని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఛైర్మన్ భీమా నాయక్ అప్పట్లో ఆరోపించారు. తమను టెండర్లలో పాల్గొననివ్వడం లేదని కూడా తెలిపారు. కేఎంఎఫ్ సరఫరా చేసే నెయ్యి నాణ్యత బాగుండడంతో తక్కువ ధరకు టీటీడీకి సరఫరా చేసే పరిస్థితి లేకపోయిందని, తక్కువ ధరకు నెయ్యి కొనుగోలు చేయడమంటే నాణ్యత విషయంలో రాజీ పడినట్టేనని ఆయన అభిప్రాయపడ్డారు. టీటీడీ అధికారులు అప్పట్లో రివర్స్ టెండరింగ్ పేరిట తక్కువ ధరకు నెయ్యి సేకరించాలని నిర్ణయించారు. కేఎంఎఫ్ వంటి సంస్థలను పక్కన పెట్టడంతో అనివార్యంగా నాసిరకం నెయ్యిని లడ్డూ తయారీకి వినియోగించాల్సి వచ్చిందన్న ఆరోపణలు వచ్చాయి.

టీటీడీకి ఇచ్చే నెయ్యిలో
చేప నూనె

టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి ధ్వజం

నెల్లూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో కుళ్లిపోయిన జంతువుల కొవ్వు, చేప నూనె కలిపారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి సంచలన వాఖ్యలు చేశారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ల్యాబొరేటరీ పరీక్షల్లో ఇది నిర్ధారణ అయిందని తెలిపారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో టెండర్ పిలిచి కిలో నెయ్యి రూ.320కే సరఫరా చేసేలా నలుగురికి కాంట్రాక్ట్ అప్పగించారు. మార్కెట్‌లో రూ.1000 వరకు ధర ఉంటే.. ఇంత తక్కువ ధరకు ఎవరైనా సరఫరా చేయగలరా? ఇందులో భూమన కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి పాత్రధారులు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లడ్డూలు, ప్రసాదాలు, భోజనాలు ఎందుకు బాగాలేవో అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని నియమించింది. ఏఆర్ ఫుడ్స్ అనే కంపెనీ టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోంది. ఇక్కడినుంచి వచ్చిన ఒక ట్రక్కు నెయ్యిని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ల్యాబ్‌కు పరీక్షకు పంపారు. 52 ఐటమ్స్‌ను అక్కడ అనాలసిస్ చేసి రిపోర్ట్ ఇచ్చారు. ఈ నెయ్యిలో సోయాబీన్, సన్‌ఫ్లవర్ సీడ్, మైదా, కోకోనట్‌తో పాటు చేప నూనె కూడా ఉన్నట్టు రిపోర్టులో తేలింది. అలానే పామాయిల్, గొడ్డు కొవ్వు, పంది కొవ్వు కలిసినట్లు నిర్ధారణ అయింది. ఈ నెయ్యిని పరీక్షించేటప్పుడు 'ఎస్' వాల్యూను చూస్తారు. నాణ్యమైన నెయ్యికి 'ఎస్' విలువ 95.8 నుంచి 104.32 మధ్య ఉండాలి. కానీ ఇక్కడ ఒక శాంపిల్ విలువ 19.72 ఉంది. మరో శాంపిల్‌లో 19.77 వాల్యూ వచ్చింది. అంటే ఒరిజినల్ నెయ్యి నాణ్యతలో 20శాతం కూడా లేదని తేలింది. గొడ్డు మాంసం, చేప నూనె, కుళ్లిపోయిన జంతువుల నూనె వాడినట్టు రిపోర్టులు చెబుతున్నాయి. వేంకటేశ్వరస్వామి ప్రసాదాల్లో కుళ్లిపోయిన జంతువుల నుంచి తీసిన నెయ్యిని వాడతారా..? ఇది ఎంత అన్యాయం..? ఇదేనా వైసీపీ పాలన..?' అని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ఎన్‌డీడీబీ నివేదిక ప్రతులను ప్రదర్శించారు.

దేవుడు క్షమించడు: సంజయ్

జగన్‌ను అరెస్టు చేయాలి: రాజాసింగ్

హైదరాబాద్/మంగళ్‌హాట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపిన వారిని దేవుడు క్షమించడని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పవిత్రమైన ప్రసాదాన్ని కల్తీ చేయడమంటే కోట్లాది మంది హిందువుల విశ్వాసాన్ని దారుణంగా దెబ్బతీయడమేనన్నారు. ఈ ఘటనను ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని, తక్షణం సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. తిరుపతి విషయంలో ఇంత దారుణానికి ఒడిగట్టిన ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సెల్ఫీ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

బాధ్యులపై కఠిన చర్యలు : ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రసాదం తయారీలో నాసిరకమైన ముడిసరుకులు వాడారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నీ పరిశీలించి, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రసాదంలో జంతు సంబంధిత పదార్థాలు ఏవి వాడారనేది నివేదికలు నిర్దిష్టంగా చెప్తున్నాయన్నారు. గత ప్రభుత్వం తిరుమలలో భక్తులకు నాసిరకం భోజనం పెట్టి, తిరుమల తిరుపతి పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. గురువారం అమరావతి సచివాలయ ప్రాంగణంలో అన్న క్యాంటీన్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'పవిత్రమైన దేవాలయంలో అపవిత్రమైన ముడిసరుకులు వాడారు. ఇలాంటి దుర్మార్గులను ఏం చేయాలో నాకర్థం కావట్లేదు. తిరుమల ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభించాం. ఇప్పుడిప్పుడే తిరుమలలో సరుకుల విషయాన్ని క్రమబద్ధీకరించాం. అన్న ప్రసాదానికి భక్తులు, దాతలు విరాళాలిస్తున్నారు. విజయవాడలో వరద సందర్భంగా చూపించిన స్ఫూర్తిని కొనసాగించి, అన్నదానంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి. హిందువుల విశ్వాసం, నమ్మకమైన వేంకటేశ్వరస్వామికి ఎవరైనా అపచారం తలపెడితే ఈ జన్మలో కాకపోతే.. తర్వాత జన్మలోనైనా శిక్ష తప్పదు. తిరుమలలో శానిటేషన్‌ను కూడా పాడుచేశారు. చివరికి వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లి, పెళ్లిళ్లలో ఊరేగించే పరిస్థితికొచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం వేంకటేశ్వరస్వామిని వాడుకోవడం సరికాదు. హిందువులంతా తమ కోర్కెలను చెప్పుకోవాలని జీవితంలో ఒక్కసారైనా రావాలని భావిస్తారు. అలాంటి చోట తప్పుడు పనులు చేశారు. ఏవైతే ఆధారాలు దొరికాక అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయి. ప్రసాదంలో జంతు సంబంధ పదార్థాలు ఏవి వాడారనేది నివేదికలు నిర్దిష్టంగా చెప్తున్నాయి. దీంతో కొంతమంది పారిపోయారు. కొందరిని తప్పించి, పవిత్రమైన నెయ్యి తెచ్చాం. నాణ్యత పెరగడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు' అని అన్నారు.

కౌలు రైతు, భూ యజమాని
మాట్లాడుకోవాలి

'రైతు భరోసా'పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

» కొత్తగూడెంలో విమానాశ్రయంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి వినతి

» ఢిల్లీలో ప్రపంచ ఆహార సదస్సుకు హాజరై.. వ్యాపారవేత్తలతో సమావేశమైన తుమ్మల

» రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆహ్వానించిన మంత్రి


కేంద్ర మంత్రి కే రామ్మోహన్‌నాయుడును కలిసిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల

న్యూఢిల్లీ/ఖమ్మం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై కౌలు రైతు, భూ యాజమాని మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో పంట పండించే రైతులకే రైతుభరోసా (రైతుబంధు) ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట ఎవరైతే పండిస్తారో వారికే ఆర్థిక చేయూత ఇవ్వాలని అందరూ చెబుతున్నారన్నారు. ఏపీలో మాదిరిగా కౌలు రైతు ఒప్పందాలు తెలంగాణలో లేవని, ఇక్కడి భూ చట్టాలు వేరు, ఏపీలో ఉన్న చట్టాలు వేరని అన్నారు. ఇటీవల వరదలతో వ్యవసాయ భూముల్లో గండ్లు పడినా, ఇసుక మేటలు వేసినా నష్టపరిహారాన్ని భూ యాజమానులు తీసుకోవాలని, పంట నష్టం మాత్రమే జరిగితే కౌలు రైతుకు ఇవ్వాలని చెప్పామని తుమ్మల తెలిపారు. రైతుబంధుపై సీలింగ్ విధించడంపై ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదన్నారు. రెండు లక్షల రూపాయల్లోపు పంట రుణాలు ఉన్న 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లు మాఫీ చేశామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు రైతులకు రుణమాఫీ చేయకుండా ఎన్నికల కోడ్ వచ్చే ముందు ఓఆర్ఆర్‌ను తాకట్టు పెట్టి.. 20 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేసిందన్నారు. రాష్ట్రంలో వచ్చే పంటకాలం నుంచి అన్ని పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుందన్నారు. దీనికి దాదాపు రూ.3 వేల కోట్లు ఖర్చు కావచ్చని తుమ్మల తెలిపారు.

కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల

రాష్ట్ర సమస్యలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా సమస్యలపై మంత్రి తుమ్మల గురువారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. ఇటీవల ఖమ్మం జిల్లాకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన తుమ్మల.. ఆయిల్‌పామ్ దిగుమతి సుంకాన్ని పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ టన్నుకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) రూ.20 వేలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రంతో పాటు ఖమ్మం జిల్లాలో జరిగిన వరద నష్టాన్ని ప్రత్యక్షంగా చూసినందున కేంద్ర నుంచి ఇతోధికంగా సహాయం అందించాలని కోరారు. తెలంగాణకు కొబ్బరి పరిశోధన బోర్డు మంజూరు చేయాలని, అశ్వారావుపేటలో హార్టికల్చర్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. శివరాజ్ సింగ్ స్పందిస్తూ ఆయిల్‌పామ్ ఎంఎస్పీ నిర్ణయంపై సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వరద నష్టంపై నివేదిక రాగానే సహాయం అందిస్తామని తెలిపారు. మంత్రి తుమ్మల కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కూడా కలిశారు. కొత్తగూడెంతో పాటు వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లో విమానాశ్రయాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు భూములు, ఇతర వనరులు అందుబాటులో ఉంటే వెంటనే మంజూరు చేస్తామని, త్వరలోనే ఒక బృందాన్ని పంపుతామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆహార శుద్ధి శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కూడా తుమ్మల కలిసి తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు బుగ్గపాడులోని యూనిట్‌కు సహకారం అందించాలని కోరారు.

వ్యాపారవేత్తలతో భేటీ

ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ప్రపంచ ఆహార సదస్సులో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా లులు గ్రూప్ ఛైర్మన్ యూసుఫ్ అలీ, మోనిన్ ఇండియా ఎండీ జైస్మిన్ అరోరా, బీఎల్ అగ్రో ఎండీ నవనీత్ రవికర్‌తో పాటు పలు ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో అవకాశాలను వివరించి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాలని ఆహ్వానించారు. తెలంగాణ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అలాగే లీలా ప్యాలెస్ హోటల్‌లో డెలాయిట్ ఇండియా నిర్వహించిన సదస్సుకు మంత్రి తుమ్మల హాజరై 'వికసిత్ తెలంగాణ' అంశంపై ప్రసంగించారు.

2 నుంచి 15 వరకు బడులకు దసరా సెలవులు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలలకు అక్టోబరు 2వ తేదీ నుంచి దసరా సెలవులను ప్రకటించారు. ఆ నెల 14వ తేదీ వరకు సెలవులు ఉంటాయి. 13 రోజుల సెలవుల అనంతరం 15న పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ స్కూళ్లకు ఈ నిర్ణయం వర్తిస్తుంది.

వరంగల్ వాసికి మాంచెస్టర్ వర్సిటీ అవార్డు


గౌతమ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి, వరంగల్ జిల్లా తీగరాజుపల్లికి చెందిన డాక్టర్ గౌతమ్ సొల్లేటికి యూకేలోని మాంచెస్టర్ యూనివర్సిటీ నుంచి బెస్ట్ ఔట్ స్టాండింగ్ ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ అవార్డు లభించింది. కృత్రిమ అయాన్ చానల్స్ తయారీపై ఆయన చేసిన పరిశోధనలకుగాను ఈ గుర్తింపు లభించింది. యూనివర్సిటీ ఏర్పాటై 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వర్సిటీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గౌతమ్ ఈ అవార్డు అందుకున్నారు. జేఎన్‌టీయూ నుంచి నానో టెక్నాలజీలో ఎంఎస్సీ పూర్తి చేసిన గౌతమ్.. జేఎన్‌టీయూ ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ చేశారు. అనంతరం పోస్ట్ డాక్టోరల్ ప్రోగ్రామ్ కోసం మాంచెస్టర్ యూనివర్సిటీకి వెళ్లి '2డీ మెటీరియల్ నానో ఫ్లూయిడిక్స్' అంశంపై పరిశోధనచేసి విలువైన ఫలితాలను కనుగొన్నారు. గౌతమ్ చేసిన పరిశోధనకు సంబంధించి ప్రపంచ ప్రఖ్యాత 'నేచర్' జర్నల్‌లో ఆర్టికల్ కూడా ప్రచురితమైంది.

రాష్ట్ర విద్యార్థినికి ఇన్‌స్పైర్ అవార్డు

తెలంగాణకు చెందిన విద్యార్థిని ఇన్‌స్పైర్ అవార్డును దక్కించుకుంది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో 11వ జాతీయ స్థాయి ఎగ్జిబిషన్ అండ్ ప్రాజెక్టు కాంపిటీషన్ (ఎన్ఎల్ఈపీసీ)ను న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహించారు. ఇందులో రాష్ట్రం నుంచి 22 మంది విద్యార్థులకు సంబంధించిన ప్రాజెక్టులకు అవకాశం కల్పించారు. వీరిలో కరీంనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌కు చెందిన సుభశ్రీ సాహు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ఇన్‌స్పైర్ అవార్డు దక్కింది.

ఔటర్‌పై మరో 3 ఇంటర్‌చేంజ్‌లు

» జన్వాడ, కోహెడ, పడమటసాయిగూడల్లో ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)పై మరో మూడు ఇంటర్‌చేంజ్‌లు రానున్నాయి. హైదరాబాద్ మహానగరం విస్తరిస్తూ.. ఓఆర్ఆర్ వెంబడి కాలనీలు వెలుస్తుండడంతో.. ప్రజా అవసరాలకు అనుగుణంగా జన్వాడ, కోహెడ, పడమటసాయిగూడల్లో ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ-హెచ్‌జీసీఎల్ నిర్ణయించాయి. భవిష్యత్‌లో రానున్న రీజినల్ రింగ్‌రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో అనుసంధానమయ్యేలా ఓఆర్ఆర్‌పై కొత్త ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఓఆర్ఆర్‌ను వినియోగించుకునేలా తొలినాళ్లలో 19 ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.! వీటి ద్వారానే వాహనదారులు నిర్ణీత ప్రదేశాల్లో ఓఆర్ఆర్‌పైకి వెళ్లడం, దిగడం చేస్తుంటారు. నగరం విస్తరిస్తుండడంతో.. అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే గత ఏడాది నార్సింగ్, మల్లంపేట, కోకాపేట వద్ద ట్రంపెట్ల నిర్మాణానికి సంకల్పించింది. కోకాపేట ట్రంపెట్ ప్రస్తుతం నిర్మాణంలో ఉండగా.. మిగతా రెండు అందుబాటులోకి వచ్చాయి. నార్సింగ్ ట్రంపెట్ ద్వారా గండిపేట, నార్సింగ్ పరిసర ప్రాంతాల వారు ఓఆర్ఆర్‌ను సులభంగా వినియోగించుకునేలా వెసులుబాటు కలిగింది. అలాగే మల్లంపేట ట్రంపెట్ వల్ల నిజాంపేట, బాచుపల్లి, మల్లంపేట, బౌరంపేట వాసులు ఓఆర్ఆర్‌ను వినియోగించుకోగలుగుతున్నారు. కోకాపేట ట్రంపెట్ పనులు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి. కొత్తగా జన్వాడ, కోహెడ, పడమటసాయిగూడ ప్రాంతాల్లో ఇంటర్‌చేంజ్‌ల ఏర్పాటు వల్ల.. నగరం మూడు వైపుల వారికి ఉపయుక్తంగా ఉండనుంది. జన్వాడ ఇంటర్‌చేంజ్ కోకాపేటకు ఈదుల నాగులపల్లికి మధ్యలో ఉంటుంది. కోహెడ ఇంటర్‌చేంజ్ పెద్ద అంబర్‌పేట-బొంగులూరు మధ్యలో రానుంది. ఘట్‌కేసర్-కీసర మధ్యలో పడమటసాయిగూడ ఇంటర్‌చేంజ్ ఏర్పాటు కానుంది.

‘స్త్రీనిధి’ దారిమళ్లింపుపై విచారణకు కమిటీ

» ఉత్తర్వులు జారీ.. 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్విడ్ ప్రోకోలో స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ లిమిటెడ్‌కు సంబంధించిన సీఎస్ఆర్ నిధులను దారిమళ్లించారంటూ వచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం విచారణకు సిద్ధమైంది. నిజనిర్ధారణకు ప్రత్యేక కమిటీని నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఏజీఎం పెండ్యాల శ్రీనివాస్, రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శి చంద్రకళ, కోఆపరేటివ్ సొసైటీస్ అదనపు రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ రావు సభ్యులుగా ఉన్నారు. 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆరోపణల్లో వాస్తవంలేదని స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌కు చెక్కు అందజేస్తున్న సింగరేణి అధికారులు, నేతలు

వరద బాధితులకు ఉద్యోగుల ఒక రోజు వేతనం

» సింగరేణి ఉద్యోగుల సాయం రూ.10.25 కోట్లు

» నెల జీతం రూ.2.5లక్షలు ఇచ్చిన ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, కొత్తగూడెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ఉద్యోగుల ఒక రోజు మూల వేతనాన్ని ప్రభుత్వం వినహాయించింది. ఈమేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం అన్ని కేటగిరీల ఉద్యోగులకు సంబంధించిన ఒక రోజు మూలవేతనాన్ని మినహాయిస్తున్నట్టు వెల్లడించింది. వరద బాధితుల కోసం సింగరేణి ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని సీఎంఆర్ఎఫ్‌కు అందించారు. ఈ మేరకు రూ.10.25 కోట్ల చెక్కును సింగరేణి అధికారులు, యూనియన్ల నాయకులు సీఎం రేవంత్‌కు అందజేశారు. అలాగే, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తన ఒక నెల జీతం రూ.2.50 లక్షల చెక్కును అందజేశారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) తరఫున ప్రెసిడెంట్ ఘట్టమనేని ఆదిశేషగిరిరావు రూ.25లక్షలను సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా అందజేశారు.



స్పెయిన్ రాయబారికి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్

సీఎం సార్.. స్పెయిన్‌కు రండి

» రేవంత్‌ను ఆహ్వానించిన స్పెయిన్ రాయబారి జువాన్

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ దేశానికి రావాలంటూ స్పెయిన్ రాయబారి జువాన్ ఆంటోనియో మార్చ్‌పుజోల్.. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. గురువారం సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయడం పట్ల జువాన్.. సీఎంను అభినందించారు. ఈ సందర్భంగా సీఎంకు ఒక పుస్తకాన్ని అందించారు. స్పెయిన్ రాయబారి వెంట టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణీప్రసాద్, హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ ఉన్నారు.

హైదరాబాద్‌లో శీతల రవాణా కేంద్రం: దుద్దిళ్ల

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అత్యాధునిక శీతల రవాణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అది ఇక్కడి పారిశ్రామిక అవసరాలు తీర్చేలా బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. గురువారం శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన ‘కోల్డ్‌చెయిన్ అన్‌బ్రోకెన్-2024’ అంతర్జాతీయ సదస్సులో శ్రీధర్‌బాబు మాట్లాడారు. త్వరగా చెడిపోయే ఆహార వస్తువులు, పూల లాంటి ఉద్యానవన ఉత్పత్తులను శీతల రవాణా వ్యవస్థ ద్వారా నష్టం వాటిల్లకుండా రవాణా చేయవచ్చన్నారు. శీతల నిల్వ వ్యవస్థలు, వ్యాక్యూమ్ ఇన్సులేటెడ్ కంటైనర్లు లేకపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా 14 శాతం ఆహార ఉత్పత్తులు వృథాగా పోతున్నాయన్నారు. ప్యాకేజింగ్‌లో కూడా పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉందని, ఈ రంగానికి అవసరమైన రవాణా సదుపాయాలు పెంపొందించాలని నిర్వాహకులను మంత్రి కోరారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుకూలతలు ఉన్నాయన్నారు. ‘కోల్డ్‌చెయిన్ అన్‌బ్రోకెన్’ ఛైర్మన్ సతీశ్ లక్కరాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శీతల రవాణా వ్యవస్థ టర్నోవర్ 300 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. ఫార్మా, వ్యవసాయ రంగానికి సంబధించి 500కిలోల బరువువరకు ఉన్న వస్తువులను రవాణాకు వీలుగా డ్రోన్లు తయారయ్యాయన్నారు. పలువురు ఉన్నతాధికారులు, 20 దేశాల నుంచి 350మందికిపైగా ఈ పరిశ్రమకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

ఆ గురుకులాల పనులు చేపట్టండి: సీఎస్

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొడంగల్, మధిర నియోజకవర్గం లక్ష్మీపురంలో నిర్మించనున్న సమీకృత గురుకుల విద్యాలయాల భవన పనులను అక్టోబరు ఆఖరులోగా ప్రారంభించాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. గురువారం సమీకృత గురుకులాల పర్యవేక్షణ కోసం ఏర్పాటైన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. పరిపాలనా అనుమతుల కోసం అనుసరించాల్సిన విధానాలపై ఇందులో చర్చించారు.

నేడు ఏడుగురు సీఈల క్రాస్ ఎగ్జామినేషన్

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శుక్రవారం ఏడుగురు చీఫ్ ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. ఆగస్టులో 15 మందికి పైగా అధికారులను విచారించిన కమిషన్, మరో 25 మందిని క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నివేదికను అందించాలని, కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ నివేదిక కూడా ఇవ్వాలని కమిషన్ లేఖ రాసింది.

బస్సు చార్జీల్లేవు.. కేసు ఎక్కడున్నా ఒక్కటే!

» విడాకుల కేసులో హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్య

విడాకుల కేసును హైదరాబాద్‌కు బదిలీ చేయాలని ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. రాష్ట్రంలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులో ఉన్న నేపథ్యంలో బదిలీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. నిర్మల్ కోర్టులో ఉన్న తన విడాకుల కేసును ఎల్‌బీనగర్‌లోని రంగారెడ్డి కోర్టుకు బదిలీ చేయాలంటూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల కక్షిదారులు నిర్మల్‌లోనే ఉంటుండటంతో పాటు పిటిషనర్ తొలుత నిర్మల్ అడ్రస్‌నే ఇచ్చారని.. రాష్ట్రంలో మహిళలకు బస్సుచార్జీలు లేనందున.. పిటిషనర్‌కు ఏఇబ్బంది ఉండబోదని పేర్కొన్న ధర్మాసనం.. పిటిషన్‌ను కొట్టివేసింది.

చెక్కు చెదరకుండా ఆలయాల అభివృద్ధి పనులు

మరో 100 ఏళ్ల వరకు చెక్కుచెదరకుండా ఉండేలా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సురేఖ ఆదేశించారు. వేములవాడ, భద్రాచలం, బాసర ఆలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై మంత్రులు పొంగులేటి, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. వేములవాడలో బద్ది పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. బాసర ఆలయంలో గోపురాలు, గర్భగుడి పనులను మొదలు పెట్టాలన్నారు. భద్రాచలం ఆలయ విస్తరణకు ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో భూసేకరణ చేపట్టాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

నేడు రాష్ట్ర క్యాబినెట్ సమావేశం

‘హైడ్రా’కు అధికారాలపై ఆర్డినెన్స్, బీసీ కుల గణన, రుణమాఫీ, రైతు భరోసాపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం భేటీకానుంది. సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. ‘హైడ్రా’కు చట్టబద్ధత కల్పించేలా ఆర్డినెన్స్ మొదలు.. ధరణి కమిటీ సిఫారసులు, రికార్డ్స్ ఆఫ్ రైట్స్-2024 ముసాయిదా, రెండు యూనివర్సిటీలకు, ఒక సంస్థకు కొత్త పేర్లు పెట్టడం, వరద సహాయక చర్యలు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, బీసీ కుల గణన, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. ఎజెండా భారీగా ఉన్న నేపథ్యంలో భేటీ సుదీర్ఘంగా కొనసాగుతుందని అధికారులు భావిస్తున్నారు. వరదలు, హైడ్రా ఆర్డినెన్స్, బీసీ కుల గణన వంటివాటిపై కూలంకషంగా చర్చించాల్సి ఉంటుందని గుర్తుచేస్తున్నారు. హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ.. ఫోర్త్‌సిటీలో ఏర్పాటు చేస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని నిర్ణయించింది. ఈ మూడింటికీ శుక్రవారం ఆమోదముద్ర పడనుంది. ఇటీవలి వరదల వల్ల దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా పంట, ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం లెక్క తేల్చింది. కేంద్ర ప్రభుత్వానికి వివరాలను సమర్పించింది. దీనిపైనా మంత్రివర్గం చర్చించనుంది. హైడ్రాకు విశేషాధికారాలు కల్పించేలా ఆర్డినెన్స్‌ను తీసుకురానుంది. తదుపరి జరిగే అసెంబ్లీలో హైడ్రా చట్టాన్ని తీసుకురానుంది. ఇటీవల ధరణి కమిటీ చేసిన 54 సిఫారసులపైనా చర్చించి, అమలుపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలో బీసీ కుల గుణన చేసి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే.! ఇది పూర్తయితే తప్ప.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి, పాలక వర్గాలను ఏర్పాటు చేస్తేనే.. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు వస్తాయి. ఈ దృష్ట్యా పంచాయతీ ఎన్నికలకు ప్రతిబంధకంగా ఉన్న బీసీ కుల గణనను చేపట్టే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేయాలనుకుంటున్న 225 గ్రామ పంచాయతీలు, ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న మునిసిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనంపైనా మంత్రివర్గం చర్చించనుంది. రైతు రుణ మాఫీ కింద మిగతా రుణాలను మాఫీ చేయడం, రైతు భరోసా విధివిధానాలు, ‘రికార్డ్ ఆఫ్ రైట్స్-2024’ ముసాయిదా అంశం కూడా చర్చకు రానున్నాయి.

స్కిల్ వర్సిటీ మీరే నడపాలి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌తో పాటు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి, ఇతర పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. వీలైనంత వేగంగా తమ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చామని, ఇకపై యూనివర్సిటీ బాధ్యతను బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాకు అప్పగిస్తున్నామని చెప్పారు. ఈ రంగంలో అనుభవంతో పాటు ప్రత్యేక గుర్తింపు ఉన్న మహీంద్రా ఆనంద్ స్కిల్స్ యూనివర్సిటీకి తన బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకం ఉందని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వామ్యం పంచుకోవాలని, యువతకు నైపుణ్యాలు నేర్పించి ఉపాధి కల్పించేందుకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున యూనివర్సిటీకి 150 ఎకరాల స్థలంతో పాటు రూ.100 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. తెలంగాణలోని పారిశ్రామికవేత్తలు స్కిల్స్ యూనివర్సిటీలో భాగస్వామ్యం పంచుకోవాలని, యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణకు కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీలో భవనాల నిర్మాణానికి సహకరించాలని కోరారు. దాతల పేర్లను లేదా వారి కంపెనీల పేర్లను ఈ భవనాలకు పెట్టాలని సీఎం అధికారులకు సూచించారు. వచ్చే ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ లక్ష్యంగా.. తమ ప్రభుత్వం ఇప్పటి నుంచే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందని చెప్పారు. 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామని ప్రకటించారు. యూనివర్సిటీ అభివృద్ధిలోనూ పాలుపంచుకోవాలని ముఖ్యమంత్రి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల ఇబ్బంది లేదని, రూ.3 లక్షల కోట్ల బడ్జెట్లో వెయ్యి కోట్లు ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆర్థిక సహకారానికి మించి, రాష్ట్రంలోని అందరు పారిశ్రామికవేత్తలు ఆశించినంత చొరవ ప్రదర్శించాలని.. తగిన భాగస్వామ్యం, బాధ్యతలను పంచుకోవాలని కోరుతున్నట్లు చెప్పారు. డిగ్రీలు, పీజీ పట్టాలు ఉంటే సరిపోదని, ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షల మంది యువకులు ఒక ఉద్యోగం ఇప్పించండని తన వద్దకువస్తున్నారని ముఖ్యమంత్రి తనకు ఎదురైన కొన్ని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఏటా లక్షల మంది యువకులు డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నారని, అందరూ ఉద్యోగాలు సాధించలేక పోతున్నారని చెప్పారు. మరోవైపు పరిశ్రమల అవసరాలకు సరిపడే మానవ వనరుల కొరత ఉందని ప్రస్తావించారు. ఈ అంతరాన్ని తొలిగించేందుకు స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పాలనే ఆలోచన చేసినట్లు సీఎం తెలిపారు. అందరికీ సరిపడేన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఉండవని, వివిధ రంగాలతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకుంటే యువతఉపాధికి ఢోకాఉండదని చెప్పారు.



స్కిల్ యూనివర్సిటీ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ మహీంద్రా. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్

ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకుందని చెప్పారు. ఇప్పటికే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. సీఎం ఆలోచనల మేరకు త్వరలోనే స్కిల్ యూనివర్సిటీలో కొత్త కోర్సులు ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు.



స్కిల్ యూనివర్సిటీ బోర్డు సమావేశంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు

అందుకే ఒప్పుకున్నా: మహీంద్రా

తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన గొప్పదని యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. విజన్ ఉన్న సమర్థ నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అంటూ కొనియాడారు. అందుకే యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా ఉండాలని సీఎం కోరగానే ఒప్పుకోవాల్సి వచ్చిందన్నారు. యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆలోచించిన తీరులోనే దార్శనికత ఉందని అభినందించారు. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. సీఎం కల నిజం కావాలని, ఆయన ఆశయం నెరవేరాలని ఆకాంక్షించారు.

వచ్చే నెల నుంచే కోర్సులు

స్కిల్స్ యూనివర్సిటీ దసరా తర్వాత కోర్సులు ఈ ప్రారంభించాలని యూనివర్సిటీ బోర్డు నిర్ణయించింది. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ(ఈఎస్‌సిఐ)లో తాత్కాలికంగా కోర్సులను నిర్వహించనుంది. హెల్త్ కేర్, ఈ-కామర్స్, లాజిస్టిక్స్ కోర్సులను ప్రారంభించనుంది. ఈ కోర్సుల నిర్వహణకు అపోలోతో పాటు ఏఐజీ, లెన్స్ కార్ట్, ఫ్లిప్ కార్ట్, అమెజాన్, ఆల్కార్గో, ప్రొ కనెక్ట్, ఓ9 సొల్యూషన్స్ కంపెనీలు ముందుకొచ్చాయి. తొలి ఏడాది రెండు వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

కొత్త రేషన్ కార్డులకు 2 నుంచి దరఖాస్తులు తీసుకోండి

» అర్హులకు డిజిటల్ రేషన్ కార్డులు: సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల జారీకి విధి విధానాలపై గురువారం సమీక్ష జరిగింది. అర్హులైన వారందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ సాధ్యాసాధ్యాలపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు రెండు రోజుల్లో మరో సారి సమావేశమవుదామని సీఎం చెప్పారు.

బిట్టు తల తెస్తే నా ఆస్తి రాసిస్తా

» ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సంచలన వ్యాఖ్యలు



ఉట్నూర్, సెప్టెంబరు 19 : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టుపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రవ్‌నీత్ సింగ్ బిట్టు తల నరికి తెచ్చి ఇచ్చిన వారికి తన ఆస్తి రాసిస్తానంటూ సంచలన వ్యాఖ్య చేశారు. తన తండ్రి సంపాదించిన ఎకరం 38 గుంటల వ్యవసాయ భూమిని రాసి ఇస్తానని ప్రకటించారు. రాహుల్ గాంధీ దేశంలోనే నెంబర్ వన్ ఉగ్రవాది అంటూ రవ్‌నీత్ సింగ్ బిట్టు ఇటీవల తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు రవ్‌నీత్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ బిట్టు తల నరికి తెచ్చినవారికి ఆస్తి ఇస్తానని ప్రకటించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతుంటే కేంద్ర హోం శాఖ పట్టించుకోకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. రవ్‌నీత్‌పై బీజేపీ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే పని మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

‘స్టేట్ డేటా సెంటర్’ సర్వర్ డౌన్

రిజిస్ట్రేషన్, ధరణి సేవలు బంద్

» మీసేవల్లోనూ నిలిచిన ఆన్‌లైన్ సర్వీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని స్టేట్ డేటా సెంటర్ (ఎస్‌డీసీ) సర్వర్‌లో సమస్యలు తలెత్తాయి. మీసేవ కేంద్రాలతోపాటు అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ సేవలు, మొబైల్ అప్లికేషన్లకు ఎస్‌డీసీనే ఆధారం. అయితే ఇందులో చిన్నపాటి సమస్యలు తలెత్తినా వెంటనే సరిదిద్దే అధికారులు గత పదిరోజులుగా సర్వర్ డౌన్ అయినా స్పందించకపోవడంతో పౌర సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం వేల సంఖ్యలో జరిగే ధరణి లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖలోనూ దీని ప్రభావం ఎక్కువగా ఉంది. రోజుకు ఐదారు రిజిస్ట్రేషన్లు కూడా కష్టంగా అవుతున్నాయని, స్లాట్ బుక్ చేసినవారు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు చెబుతున్నారు. అటు మీసేవల్లోనూ ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఐసెట్ కౌన్సెలింగ్ జరుగుతున్నందున కులం, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు విద్యార్థులు దరఖాస్తులు చేయలేకపోతున్నారు. గనుల శాఖ, ఆర్టీఏ ఆన్‌లైన్ సేవలకూ అంతరాయం ఏర్పడింది. స్టేట్ డేటా సెంటర్లలో ఉన్న పలు క్లస్టర్లలో కొన్ని పూర్తిగా పనిచేయకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని సమాచారం. సమస్య పరిష్కరించాలంటూ ఐటీ శాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వ శాఖలు ఫిర్యాదు చేస్తున్నా.. స్పందన లేదు. ఈ విషయంపై ఎస్‌డీసీ ఇంచార్జిగా ఉన్న ఐటీ శాఖ ఇన్‌ఫ్రా జాయింట్ డైరెక్టర్ వేణుప్రసాద్‌ను సంప్రదించేందుకు ‘ఆంధ్రజ్యోతి’ ప్రతినిధి ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

బీసీని బీఆర్ఎస్ అధ్యక్షుడిగా చేసే దమ్ముందా?

‘స్థానిక’ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో చెప్పండి: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీని బీఆర్ఎస్ అధ్యక్షుడిగా చేసే దమ్ముందా? అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. టీఆర్ఎస్‌కు కేసీఆరే అధ్యక్షుడని.. బీఆర్ఎస్‌గా పేరు మారినా ఆయనే అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆయన కొడుకే ఉన్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం నుండి 23 శాతానికి ఎందుకు తగ్గించారో ముందు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆధ్వర్యంలో అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కులగణన కాంగ్రెస్ ‘పేటెంట్’ అని, దానిపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్, బీజేపీలకు లేదని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ అయిన బండి సంజయ్‌ను తొలగించి, అగ్రవర్ణ వ్యక్తిని ఎందుకు నియమించారని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌లు కల్లబొల్లి మాటలు చెబుతున్నాయన్నారు. ‘నేను రాహుల్‌గాంధీ వదిలిన బీసీ బాణాన్ని.. సోనియాగాంధీ పంపిన సందేశాన్ని.. మల్లికార్జున ఖర్గే పంపిన సైన్యాన్ని..’ అని వ్యాఖ్యానించారు. సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం తీసేస్తామని కేటీఆర్ అంటున్నారని, అసలు వారు అధికారంలోకి రావడం కలేనన్నారు.. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు పనితనంతో పదవికి వన్నె తేవాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కులగణనకు ఇప్పటికే నిధులు కూడా కేటాయించామని.. ఎవరెంత అరిచి గీ పెట్టినా కులగణన చేసిన తీరుతామని స్పష్టం చేశారు. వీహెచ్ మాట్లాడుతూ.. కులగణనను త్వరగా ప్రారంభించకుంటే విపక్షానికి అవకాశమిచ్చినట్లవుతుందని, వెంటనే ప్రారంభించాలన్నారు. బీఆర్ఎస్ దుర్మార్గాలపై పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. అనంతరం మహేశ్‌గౌడ్‌కు నేతలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ చీఫ్ కేశవరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కె.శంకరయ్య, గడ్డం వినోద్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ మల్లేశం, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు కోదండరెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, అనిల్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వీహెచ్, సీతక్క తదితరులు

బీఆర్ఎస్‌లో మిగిలేది నలుగురే..

ప్రజాపాలన చూసి ఓర్వలేక బీఆర్ఎస్‌లోని ఓ నలుగురు విమర్శలు గుప్పిస్తున్నారని.. చివరకు ఆ పార్టీలో మిగిలేది ఆ నలుగురు మాత్రమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. సీఎల్పీ మీడియాహాల్‌లో మాట్లాడుతూ.. కులగణనపై కేటీఆర్ ప్రభుత్వానికి డెడ్‌లైన్ పెట్టేంతా సీన్ లేదని అన్నారు. బీసీ జనాభా ఎక్కువగా ఉందనే ఆనాడు చేయించిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్‌ను కేసీఆర్ బయటపెట్టలేదని విమర్శించారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలంటూ బీజేపీ నేతలు ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు.

ఇందిరమ్మ ఇళ్లకు దారి సుగమం!

» పది రోజుల్లో విధివిధానాల ఖరారు

» ఆ దిశగా కసరత్తు చేస్తున్న అధికారులు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీపి కబురు అందించనుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు అవసరమైన విధివిధానాలను ప్రకటించనుంది. ఈ మేరకు మార్గదర్శకాలు, విధివిధానాలను వారం, పది రోజుల్లో ఖరారు చేయనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పథకాన్ని కేంద్రం అందించే ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై అర్బన్, రూరల్) పథకానికి అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. వాటిలో.. ఇంటికోసం వచ్చిన దరఖాస్తులు దాదాపు 82 లక్షలు. అర్బన్ పరిధిలో 23.5 లక్షలు, రూరల్‌లో 58.5 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. ఈ పథకం కింద మొదటి దఫాలో.. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో.. సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లను అందించాలని, రెండో దఫాలో స్థలం లేనివారికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం (ఇంటి స్థలం ఉన్న వారికి ఆర్థిక సాయం, స్థలం లేని వారికి స్థలం ఇచ్చి, ఆర్థిక సాయం) అందించనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4,16,500 ఇండ్లను పేదలకు ఇవ్వాలని.. రిజర్వ్ కోటా కింద మరో 33,500 ఇండ్లను ప్రభుత్వ విచక్షణలో ఉంచాలని నిర్ణయించింది. ఈ పథకం అమలు కోసం బడ్జెట్‌లో రూ.9,184 కోట్లు కేటాయించగా, కేంద్రం నుంచి పీఎంఏవై పథకం కింద దాదాపు రూ.4,600 కోట్లు అందుతాయని సర్కారు అంచనా వేసింది. కాగా.. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఇండ్ల పథకాల మార్గదర్శకాలు, విధివిధానాలు ఏ విధంగా ఉన్నాయనేదానిపై గృహనిర్మాణ సంస్థ ఇప్పటికే అధ్యయనం చేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికారుల బృందాలు పర్యటించి, ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిసింది.

అర్హుల ఎంపిక ప్రక్రియ ఇలా..

ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు అర్హులా కాదా అనే విషయాన్ని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి ఖరారు చేయనుంది. ఇందుకోసం క్షేత్రస్థాయి పరిశీలన, తనిఖీ చేయాలని నిర్ణయించింది. గ్రామం, పట్టణం, మున్సిపాలిటీ, వార్డుల వరకూ ప్రత్యేక పరిశీలన అధికారి, పలు టీములతో కలిసి వెళ్లి దరఖాస్తులను ధ్రువీకరించనున్నారు. లబ్ధిదారులు అర్హులా, కాదా అనే విషయాలను తేల్చేందుకు సర్కారు ఒక ప్రత్యేక ప్రొఫార్మాను తయారుచేసినట్టు తెలిసింది. దాని ప్రకారం.. ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డులను పరిశీలిస్తారు. గ్రామంలో ఎప్పటి నుంచి నివాసం ఉంటున్నారు, ప్రస్తుతం ఏ ఇంట్లో ఉంటున్నారనే వివరాలను సేకరిస్తారు. ఆ తరువాత దరఖాస్తుదారు అర్హులు అయి, ఇంటి స్థలం ఉన్న వారైతే సదరు స్థలం సొంతమేనా, డి-ఫారం పట్టానా లేదా పూర్వీకుల ఆస్తి నుంచి సంక్రమించిందా అనే వివరాలను తీసుకుంటారు. ఇంటి స్థలం లేని వారైతే.. వారికి ఇంటి స్థలం ఇవ్వాలని ప్రొఫార్మాలో నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ నిర్వహణకు గ్రామ స్థాయి సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా వినియోగించుకోనున్నట్టు తెలిసింది.

కొత్త యాప్?

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకు రావాలనే యోచనలో సర్కారు ఉన్నట్టు సమాచారం. అర్హుల గుర్తింపు, ఇళ్ల నిర్మాణం, అందించే ఆర్థిక సాయం మంజూరు వరకు మొత్తం ప్రక్రియనూ ఆ యాప్ ద్వారానే నిర్వహించాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే వీటికి సంబంధించి కేంద్రం కూడా ఒక యాప్, పోర్టల్‌ను సూచిస్తోంది. ఈ నేపథ్యంలో వాటి ద్వారానే పథకాన్ని అమలుచేద్దామా లేక రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెద్దామా అనే అంశంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది.

హైడ్రాకు సొంత సామగ్రి

- ఏజెన్సీ ఎంపికకు టెండర్ నోటిఫికేషన్
- భారీ యంత్రాలను సమకూర్చుకోనున్న సంస్థ
- కూల్చివేత.. వ్యర్థాల తరలింపు బాధ్యత వారిదే
- ఇప్పటివరకు కూల్చిన వ్యర్థాలు చెరువుల్లోనే
- నిర్మాణదారులకు ఉచితంగా మట్టి పంపిణీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఆపరేషన్ వేగం పుంజుకోనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్యలను ముమ్మరం చేయనుంది. ఇప్పటివరకు జీహెచ్‌ఎంసీ, ఇతర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన ఏజెన్సీల ద్వారా హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇకపైన మాత్రం ఆక్రమణల కూల్చివేత, వ్యర్థాల తరలింపునకు అవసరమైన యంత్రాలు, వాహనాలను సొంతంగా సమకూర్చుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలో ఏజెన్సీ ఎంపికకు గురువారం టెండర్ నోటిఫికేషన్ ప్రకటించింది. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు బిడ్‌లు దాఖలు చేయాలని సూచించింది. భారీ భవనాలను నేలమట్టం చేస్తోన్న నేపథ్యంలో అధునాతన సాంకేతికతతో పనిచేసే హై రీచ్ జా క్రషర్, హై రీచ్ రాక్ బ్రేకర్‌లను వినియోగిస్తున్నారు. వీటికి సంబంధించి ప్రామాణిక ధరల పట్టిక (స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ -ఎస్‌ఎస్‌ఆర్) ఏ ప్రభుత్వ విభాగం వద్ద లేదు. దీంతో యూనిట్ల వారీగా ధరల నిర్ధారణ అంశాన్నీ హైడ్రా టెండర్‌లో పేర్కొంది. చదరపు మీటర్లు/క్యూబిక్ మీటర్లు/గంటల ప్రతిపాదికన ఏజెన్సీలు ధరలు కోట్ చేయాలి. భవనాల కూల్చివేతలలో స్టీల్‌ను ఏజెన్సీ తీసుకుంటే హైడ్రా ఎంత చెల్లించాలి? స్టీల్ లేకుండా ఎంత చెల్లించాలన్న దానిపై వేర్వేరుగా కొటేషన్లు ఆహ్వానించారు. ఎంపికైన ఏజెన్సీ ఏడాదిపాటు పని చేయాల్సి ఉంటుంది. కాగా, 2 నెలల్లో 262 ఆక్రమణలను కూల్చి.. 111 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. వ్యర్థాల తరలింపును చేపట్టలేదు. ఈ క్రమంలోనే కూల్చివేత, తరలింపు బాధ్యతలను ఒకే ఏజెన్సీకి అప్పగించాలని కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. తమ్మిడికుంట చెరువులోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చే వరకు అక్కడి వ్యర్థాల తరలింపు ఉండదని హైడ్రా వర్గాలు చెబుతున్నాయి. ఈర్ల కుంట చెరువుపై కోర్టు ఆదేశాలున్నందున అక్కడి వ్యర్థాలనూ తరలించరు.

చెరువుల్లోని కూల్చివేత వ్యర్థాలను తొలగించడంతోపాటు.. పూడిక తీయాలని భావిస్తున్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైదరాబాద్‌లో భూమిలోకి వర్షపు నీరు ఇంకే పరిస్థితి లేదు. చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెంపు ద్వారా భూగర్భ జలాల రక్షణకు చర్యలు తీసుకోవాలని సర్కారు ఆలోచిస్తోంది. చెరువుల్లో పూడిక తీసి మట్టిని ఉచితంగా నిర్మాణ రంగ అవసరాలకు ఇచ్చే అంశాన్నీ పరిశీలిస్తున్నారు.

మట్టి ఉచితంగా..

రవాణా చార్జీలను వినియోగదారులు భరించాల్సి ఉంటుంది. భవన నిర్మాణాల్లో ఫౌండేషన్ స్థాయిలో మట్టిని వినియోగిస్తుంటారు. ప్రస్తుతం టిప్పర్‌కు ఇంత అని కొనుగోలు చేస్తున్నారు. హైడ్రా ఉచితంగా అందిస్తే.. వాహనంతో తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇది ఇద్దరికీ మేలని హైడ్రా భావిస్తోంది. మట్టి తొలగించే ప్రొక్లెయినర్‌నూ హైడ్రా ఏర్పాటు చేయనుంది. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలోని తమ్మిడికుంట, కాముని, మైసమ్మ తదితర చెరువులను గొలుసుకట్టుగా అభివృద్ధి చేయాలని సంస్థ నిర్ణయించింది.

రఘునందన్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు

- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్టేటస్‌కోను విమర్శించిన ఎంపీ
- హైకోర్టు జడ్జి లేఖతో సుమోటోగా స్వీకరించిన సీజే

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ బీజేపీ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుపై హైకోర్టు సీజే ధర్మాసనం సుమోటోగా క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. "మీపై ఎందుకు క్రిమినల్ చర్యలు తీసుకోకూడదు? వివరణ ఇవ్వండి" అంటూ నోటీసులు జారీ చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్ కూల్చివేతలను ఆపాలంటూ.. హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. దీన్ని విచారించిన సింగిల్ జడ్జి ధర్మాసనం.. కూల్చివేతలపై స్టేటస్‌కో ఇచ్చింది. అప్పటికే హైడ్రా కూల్చివేతలు పూర్తయ్యాయి. అయితే.. ఈ జడ్జిమెంట్‌పై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి.. హైకోర్టు తీర్పుపై తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై ఓ న్యాయమూర్తి తీవ్రంగా స్పందిస్తూ.. హైకోర్టుకు దురుద్దేశాలు ఆపాదించే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధేకు లేఖ రాశారు. "హడావుడిగా జడ్జిలు మధ్యంతర ఆదేశాలు ఇవ్వకూడదు. అంతకు ముందు కోర్టు ఆదేశాలను ధ్రువీకరించుకోకుండా స్టేటస్‌కో లేదా స్టే ఆదేశాలు ఎలా ఇస్తారు? జడ్జిలు తమ కళ్లకు గంతలను విప్పేసి, చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోవాలి. ఆ తర్వాతే తీర్పులివ్వాలి. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత పిటిషన్లు పత్తాలేకుండా పోతున్నాయి. అలాంటి కేసులను రిజిస్ట్రీ ఎందుకు జడ్జిల ముందు లిస్ట్ చేయడం లేదు? సీజే దృష్టికి ఎందుకు తీసుకెళ్లడం లేదు? అని ప్రతిపాదిత ధిక్కరణదారు(రఘునందన్) వ్యాఖ్యానించారు. తన స్టేట్‌మెంట్ ప్రజల్లోకి వెళ్లడానికి న్యాయవ్యవస్థకు దురుద్దేశాలను ఆపాదించారు. అపవాదు అంటగట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతిపాదిత ధిక్కరణదారు వ్యాఖ్యలను విస్మరించి, అలాగే వదిలేస్తే.. న్యాయవ్యవస్థపై గౌరవం తగ్గిపోవడమే కాకుండా.. రూల్ ఆఫ్ లా భావనపై తీవ్ర ప్రభావం పడుతుంది" అని ఆ లేఖలో పేర్కొన్నారు. దీన్ని సీజే అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం సుమోటోగా క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసును నమోదు చేసింది. గురువారం ఈ కేసు విచారణకు రాగా.. ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలంటూ రఘునందన్‌కు కోర్టు క్రిమినల్ ధిక్కరణ నోటీసులను జారీ చేసింది.


నేలమట్టమైన ఐదంతస్తుల భవనం

మంచిర్యాలలో బీఆర్ఎస్ నేత భవనం కూల్చివేత

మంచిర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత ఒకరు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అసైన్డ్ భూమిలో అక్రమంగా నిర్మించిన ఐదంతస్తుల భవనాన్ని మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. బీఆర్ఎస్ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం టీబీజీకేఎస్ (తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం) నేత డీకొండ అన్నయ్య మంచిర్యాల జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కలెక్టరేట్ రోడ్డులోని సర్వే నం.40లో రెండు గుంటల స్థలాన్ని కొనుగోలు చేశారు. రెండేళ్ల క్రితం భవన నిర్మాణానికి అవసరమైన మున్సిపల్ అనుమతులు, ఇతర పర్మిషన్లు అదే సర్వే నంబర్‌పై తీసుకున్నారు. అయితే, అనుమతులు తీసుకున్న స్థలంలో కాకుండా ప్రభుత్వ స్థలమైన సర్వే నం.42లో ఐదంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టగా, ఆ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ 2022లో మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. పట్టించుకోకపోవడంతో 15 రోజుల క్రితం మళ్లీ నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించకపోవడంతో గురువారం భారీ పోలీసు బందోబస్తు నడుమ, రెవెన్యూ శాఖ సహకారంతో భవనాన్ని కూల్చివేసినట్లు మున్సిపల్ కమిషనర్ సతీష్ తెలిపారు.

ఏపీలోనూ హైడ్రా తరహా చట్టం

- ఆ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 19: తెలంగాణ తరహాలో హైడ్రా తరహా చట్టాన్ని తీసుకువస్తామని ఏపీ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ చెరువులు, కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని, వీటిని తొలగించడానికి హైడ్రాలాంటి వ్యవస్థ అవసరం అని పేర్కొన్నారు. గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. వీటిపై ప్రత్యేక దృష్టిసారించి కూల్చివేతలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుంటూరు జిల్లా పేరేచర్ల లే అవుట్‌లో అక్రమాలకు పాల్పడిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అక్రమాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని, విజిలెన్స్ నివేదిక అందగానే చర్యలు ప్రారంభిస్తామన్నారు. అదనంగా లబ్ధి చేకూరిన సొమ్ముని రాబడతామన్నారు.

మున్సిపాలిటీల్లోనూ హైడ్రా!

ప్రభుత్వానికి సంబంధిత శాఖ ప్రతిపాదన.. నేటి మంత్రివర్గ భేటీలో చర్చకు అవకాశం

హైదరాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటల సంరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా తరహాలో కొత్త వ్యవస్థ రాబోతోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను మున్సిపల్ శాఖ ప్రభుత్వానికి పంపింది. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఆమోదం రాగానే ఆచరణ రూపు దాల్చనుంది. శుక్రవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం చర్చకు రావొచ్చని భావిస్తున్నారు. ఇటీవలి భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీట మునిగాయి. చెరువులు, నీటి వనరుల ఆక్రమణే దీనికి ప్రధాన కారణమని తేలింది. ఈ నేపథ్యంలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం డిమాండ్లు పెరిగాయి. సీఎం రేవంత్ వరద ప్రాంతాల పర్యటనకు ఖమ్మం వెళ్లినపుడు హైడ్రాను రాష్ట్రవ్యాప్తం చేస్తామని చెప్పారు. అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ శాఖను ఆదేశించారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో కబ్జాలకు పెద్ద ఆస్కారం లేనందున తొలుత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో హైడ్రాను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్షాలు వచ్చినపుడు పట్టణాల్లోని నివాస ప్రాంతాలే ముంపునకు గురవుతున్నాయి. అందుకే 129 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. దీనికోసం ముందుగా చెరువులు, కుంటల గుర్తింపు, వాటి పరిధి నిర్ధారణ, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లపై స్పష్టమైన అవగాహనకు రావాలని అధికారులు భావిస్తున్నారు. మున్సిపల్, రెవెన్యూ, సాగు నీటి అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలతో సర్వే జరపాలని ప్రభుత్వానికి విన్నవించారు. హద్దుల నిర్ధారణ జరిగితే కబ్జాల తొలగింపు సులభమవుతుందని, అపుడు హైడ్రా తరహా వ్యవస్థ రంగంలోకి దిగడం సులభమవుతుందని అధికారులు చెబుతున్నారు. సీఎం నుంచి అనుమతి వచ్చిన తక్షణమే సర్వేకు పూనుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంటున్నారు.

అసలు నీటి వనరులు ఎన్ని?

అసలు రాష్ట్రంలో, ముఖ్యంగా మున్సిపాలిటీల్లో ఎన్ని చెరువులు, కుంటలు, నీటి వనరులు ఉన్నాయో తేల్చాల్సిన అవసరం ఉందని కూడా అంటున్నారు. జీహెచ్‌ఎంసీ, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, వాటి పరిధిపై ఒక అంచనా ఉంది. చెరువుల పరిరక్షణకు ఉమ్మడి ఏపీలో 2010లోనే కమిటీని ఏర్పాటు చేసినా నామమాత్రంగానే పనిచేసింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత మిషన్ కాకతీయను తీసుకొచ్చారు. ఇది ఐదేళ్లు చర్యలు చేపట్టినా.. తర్వాత ఎలాంటి కార్యాచరణ లేకుండా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలపై భిన్నమైన లెక్కలున్నాయి. చెరువుల పరిధులపై స్పష్టత లేదు. తొలుత వాటిని తేల్చాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో సాగునీటి శాఖ 46,531 చెరువులు, కుంటలు ఉన్నాయని చెబుతోంది. ఏడాది క్రితం కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ రాష్ట్రంలో చిన్న, పెద్ద చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కలిపి 64,055 ఉన్నాయని పేర్కొంది. మానవ ప్రయత్నంగా తవ్విన చెరువులు 53,556, ప్రకృతి సిద్ధంగా ఏర్పడినవి 10,170 అని పేర్కొంది. 3032 చెరువులు 25 నుంచి 75 శాతం వరకు కబ్జా అయ్యాయని నీటి పారుదల శాఖ గుర్తించింది. మొత్తం నీటి వనరుల్లో 98.5 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. పట్టణాల్లో 1.5 శాతమే ఉన్నట్లు పేర్కొన్నా.. ఇంకా ఎక్కువే ఉంటాయని మంత్రిత్వ శాఖ చెప్పింది. ఇప్పుడు ఆ లెక్క తేల్చాల్సి ఉందని మున్సిపల్ శాఖ అధికారి ఒకరు వివరించారు.



ఆపరేషన్ హిమాయత్‌సాగర్!

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ హిమాయత్‌సాగర్..! జంట జలాశయాల్లోని ఒకటైన దీంట్లోని ఆక్రమణలను నేడో, రేపో తొలగించనున్నారా? అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) వర్గాలు ఔననే సమాధానం చెబుతున్నాయి. హిమాయత్‌సాగర్‌లో కబ్జాలపై వాటర్ బోర్డు ఇటీవల హైడ్రాకు నివేదిక అందజేసింది. దీనిపై కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో సమావేశంలో హిమాయత్‌సాగర్, ఇతర చెరువుల్లో ఆక్రమణల వివరాలను వెల్లడించినట్లు తెలిసింది. గురువారం రంగనాథ్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఇందులో తదుపరి కూల్చివేతలపై చర్చ జరిగినట్లు సమాచారం. వాస్తవానికి ఇప్పటికే ఒక విడత హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. గత నెల 18వ తేదీన గండిపేటలోని చిలుకూరు, ఖానాపూర్ గ్రామాల పరిధిలో 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 24 ఆక్రమణలను తొలగించింది. ఇందులో కేంద్ర మాజీ మంత్రులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, పలు పార్టీల నాయకుల ఫాంహౌజ్‌లు, ఇతర నిర్మాణాలున్నాయి. మొత్తంమీద హిమాయత్‌సాగర్‌లో 83 ఆక్రమణలను గుర్తించినట్లు తెలిసింది. ఇందులో షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు, ప్రహరీ గోడలు ఉన్నాయి. దాదాపు పది వరకు శాశ్వత నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల భవనాలున్నాయని సమాచారం. ఈ క్రమంలోనే కూల్చివేతల విషయాన్ని హైడ్రా ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. కాగా, 1908లో వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకుని.. 1927లో ఈసా నదిపై హిమాయత్ సాగర్‌ను నిర్మించారు. ఉస్మాన్‌సాగర్‌తో కలిసి ఒకప్పుడు హైదరాబాద్‌కు ప్రధాన తాగు నీటి వనరుగా నిలిచింది. కాలక్రమంలో జనాభా పెరుగులతో ప్రభుత్వాలు కృష్ణా, గోదావరి జలాలను తీసుకొచ్చాయి. మరోవైపు జంట జలాశయాలు ఆక్రమణకు గురవడం మొదలైంది. ఇప్పుడు ఆ చెర విడిపించే పనిలో హైడ్రా నిమగ్నం కానుంది.

జమిలిపై త్వరలో కమిటీ

- 47 పార్టీలకుగాను 32 మద్దతు తెలిపాయి
- జమిలితో ఆర్థిక భారం తగ్గుతుంది
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల నిర్ణయం అమలు కోసం కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి తెలిపారు. జమిలి విధానాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్న పార్టీలు కూడా కమిటీకి సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల.. ఓటర్లలో నిరాసక్తత పెరిగి ఓటింగ్ శాతం తగ్గడం స్పష్టంగా కనబడుతోందన్నారు. దీనికి జమిలి ఎన్నికలు పరిష్కారం చూపుతాయని భావిస్తున్నట్లు కిషన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల సుమారు రూ.4,500 కోట్లు ఖర్చు అవుతోందని, జమిలితో ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, దీనికి వేర్వేరుగా ఎన్నికలు జరగడం ప్రధాన అడ్డంకిగా ఉందన్నారు. దీన్ని అధిగమించేందుకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. దేశవ్యాప్తంగా తరుచూ ఏదో ఒకచోట ఎన్నికలు, కోడ్ అమలు వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఆటంకం కలుగుతోందన్నారు. కొన్నిసార్లు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి తలెత్తుతోందన్నారు. జమిలి అమలులోకి వచ్చాక ఆరు నెలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయితే మిగిలిన నాలుగున్నరేళ్లు దేశాభివృద్ధిపై దృష్టి సారించవచ్చన్నారు. 47 రాజకీయ పార్టీల్లో 32 పార్టీలు జమిలి ఎన్నికలకు సానుకూలంగా స్పందించాయన్నారు. మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ నివేదిక ఆధారంగానే జమిలి ఎన్నికలకు ముందుకెళ్లాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. అన్ని ఎన్నికలకు ఒకే ఓటర్ల జాబితా ఉండడం వల్ల ఓటర్ల హక్కులు కూడా కాపాడినట్లవుతుందన్నారు.

దానంపై చర్యలు తీసుకోండి

మహిళా కమిషన్‌కు మహిళా మోర్చా విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సినీ నటి, ఎంపీ కంగనా రనౌత్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి మండిపడ్డారు. ఆయనపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు బీజేపీ మహిళా మోర్చా నాయకులు ఫిర్యాదు చేశారు.

అన్నంలో రాళ్లొస్తుంటే ఏం చేస్తున్నారు?

ఏకలవ్య పాఠశాలల అధికారులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం


సిరిసిల్ల జిల్లా దుమాలలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అన్నంలో ప్రతి రోజూ రాళ్లు వస్తున్నాయని విద్యార్థులు బాధపడుతున్నారు. మన పిల్లలకు రాళ్లు వస్తే తినిపిస్తామా? ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలలను సందర్శించారు. మరిమడ్ల పాఠశాలలో ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించారు. రూ.16 లక్షలతో టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొక్కలు నాటారు. ఆయా పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఆటలు ఆడించడం లేదని, టాయిలెట్లలో నల్లాల నుంచి నీళ్లు రావడం లేదని వారు తెలిపారు. తొలిసారి కాబట్టి వదిలేస్తున్నానని, ఇకపై ఇలా జరిగితే సహించేది లేదని అధికారులను సంజయ్ హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, సమస్యలుంటే చర్యలు తప్పవన్నారు. ఏం కావాలనుకుంటున్నారని విద్యార్థులను సంజయ్ అడగ్గా.. పలువురు కలెక్టర్, పోలీస్, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతామని, ఆర్మీలో చేరతామని చెప్పారు. ఒక విద్యార్థి మాత్రం తహసీల్దార్ కావాలని అనుకుంటున్నానని చెప్పగా.. ఎందుకని సంజయ్ అడిగారు. తమ ఊళ్లో భూములను దోచుకుంటున్నారని, తహసీల్దార్ అయితే వాటిని కాపాడవచ్చని ఆ విద్యార్థి చెప్పాడు. రాజకీయ నాయకులు కావాలనుకుంటున్నారా అని ప్రశ్నిస్తే ఎవరూ ఆసక్తి చూపకపోవడం విశేషం. ఆర్ట్ గ్యాలరీ ప్రారంభించిన సందర్భంగా సంజయ్ కింద కూర్చుని.. విద్యార్థినులు పాడిన పాటలు విన్నారు. సంజయ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గిరిజన విద్యార్థులందరికీ కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. డబ్బుకు వెనుకాడకుండా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని, ఒక్కో విద్యార్థికి సగటున రూ.లక్షా 9 వేలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 1,26,626 మంది విద్యార్థులు ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. తెలంగాణలో 23 ఏకలవ్య పాఠశాలల్లో 8,309 మంది చదువుతున్నారని తెలిపారు.

'రింగు'కు కమిటీ.. ఇరువైపులా ఐటీ!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసే యోచనలో ఉంది. రహదారి అలైన్‌మెంట్‌తో పాటు రోడ్డు నిర్మాణం కోసం సేకరించబోయే భూముల గుర్తింపు, పరిహారం అందజేత సహా వివిధ అంశాలపై ఈ కమిటీ లోతుగా అధ్యయనం చేయనుంది. అనంతరం రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందిస్తుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, బెంగళూరు హైవేలన్నీ అధిక భాగం ఈ మార్గంలోనే ఉండడంతో అలైన్‌మెంట్ ఖరారుపై చాలా జాగ్రత్తగా వ్యవహరించనున్నారు.

ఎలా నిర్మించాలి?

వాస్తవానికి 2017లో రాష్ట్రానికి ఆర్‌ఆర్‌ఆర్ మంజూరైనప్పుడు ఉత్తర, దక్షిణ భాగాలుగా కేంద్రం ఖరారు చేయగా.. ఇందులో తొలుత ఉత్తర భాగం నిర్మాణానికి ఆమోదం తెలిపింది. కానీ, రోడ్డు మంజూరై 6-7 ఏళ్లు గడుస్తున్నా వివిధ కారణాలతో ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోలేదు. మంజూరైన ఉత్తర భాగాన్నే కేంద్రం ఆశించిన సమయానికి నిర్మించలేని కారణంగా.. దక్షిణ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే నిర్మిస్తే ఎలా ఉంటుందని కూడా సర్కారు యోచిస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాల్సి వస్తే తీసుకోవాల్సిన చర్యలు, రహదారి నిర్మాణంతో పాటు అభివృద్ధి అంశాలపైనా అధ్యయనం చేసేందుకే అధికారులతో కమిటీని నియమిస్తున్నట్లు సమాచారం. కాగా, దక్షిణ భాగం రహదారిని సొంతంగానే నిర్మిస్తే ఎలా ఉంటుంది? కేంద్రం నిర్మిస్తే ఎలా ఉండబోతుందన్న దానిపై శుక్రవారం నిర్వహించబోయే క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. రహదారిని ఎవరు నిర్మించినా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటున్న భూములు లేకుండా వ్యవసాయేతర, అటవీయేతర భూములుంటే ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఈ దక్షిణ భాగంపై ప్రాథమికంగా ఒక రూట్‌మ్యాప్ ఉన్నా అది ఖరారు కాలేదు. దీంతో ఇప్పుడు తాజాగా మరో అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం ఖరారు చేయనున్నట్లు సమాచారం. తాజా అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు ఉండనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉన్న రూట్ మ్యాప్ ప్రకారం ఈ రహదారి చౌటుప్పల్ దగ్గర ప్రారంభమై ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డిలోని ఉత్తర భాగం రహదారికి అనుసంధానం కానుంది. ఇది మొత్తం 194 కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. దీని నిర్మాణానికి దాదాపు 2 వేల హెక్టార్ల భూమి అవసరమవనుంది. భూ పరిహారం కింద రూ.6,500 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉండగా.. మొత్తం రోడ్డు నిర్మాణానికి రూ.16 వేల కోట్లకు పైగా నిధులు కావాలని అధికారుల ప్రాథమిక అంచనాల్లో తేలినట్లు సమాచారం.

పారిశ్రామిక కారిడార్లు.. రైతులకు వాటా!

దక్షిణ భాగం మంజూరు, ప్రాథమిక అలైన్‌మెంట్ నేపథ్యంలో ఈ రహదారికి ఇరువైపులా రెస్టారెంట్లు, బాంక్వెట్ హాళ్లు, స్టార్ హోటళ్లు సహా వాణిజ్య వ్యాపారాలకు అనుకూలంగా నిర్మించాలని కేంద్రం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. అంతేకాకుండా రహదారికి ఇరువైపులా అభివృద్ధి కోసం సేకరించిన భూముల్లో రైతులకు కొంత వాటాను అందించాలని కూడా కేంద్రం భావించినట్లు సమాచారం. అదే సమయంలో జాతీయ రహదారుల నిబంధనల్లో వచ్చిన పలు మార్పుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు భూసేకరణకు ముందుగానే పరిహారానికి సంబంధించిన నిధులను కేంద్రానికి డిపాజిట్ చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే అసలు దక్షిణ భాగాన్ని సొంతంగా నిర్మిస్తే ఎలా ఉంటుందని సర్కారు అంచనా వేస్తోంది. రోడ్డు కోసం సేకరించే భూములు కాకుండా దానికి అదనంగా ఇరువైపులా మరికొన్ని భూములను సమీకరించాలనే భావనలో ఉంది. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు, బెంగళూరు ప్రధాన నగరాలకు వెళ్లేందుకు ఈ మార్గం అనుకూలంగా ఉండడంతో రోడ్డుకు ఇరువైపులా పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ పార్కులు, శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసే విధంగా ఆలోచనలు చేస్తోంది. భూములను సమీకరించి పెద్దపెద్ద కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టించేందుకు అవకాశం ఉంటుందని కూడా భావిస్తోంది. అంతేకాకుండా సమీకరించిన భూములను లే అవుట్‌లుగా మార్చి, ఎకరాల వారీగా వెంచర్ వేయనున్నారు. అలా వేసిన వెంచర్లలో భూమి యజమానికి కొంత వాటా ఇచ్చి, ప్రభుత్వం కొంత వాటా తీసుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ అంశాలన్నింటిపైనా కమిటీ అధ్యయనం చేయనున్నట్లు సమాచారం.

గోవాలో జానీ మాస్టర్ అరెస్టు

- నేడు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు

నార్సింగ్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీబాషా అలియాస్ జానీ మాస్టర్‌ను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని.. హైదరాబాద్ తీసుకొస్తున్నామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. జానీ మాస్టర్‌పై ఈ నెల 15న రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు సంబంధించి జీరో ఎఫ్ఐఆర్ కాగా, అదే రోజున నార్సింగ్ పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. అనంతరం బాధితురాలి వాంగ్మూలాన్ని సేకరించారని ఆయన వెల్లడించారు. జానీమాస్టర్‌ను శుక్రవారం రాజేంద్రనగర్ కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. కాగా.. జానీ మాస్టర్ భార్య ఆయేషా గురువారం నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులతో మాట్లాడిన అనంతరం ఆమె తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. జానీ మాస్టర్ అరెస్ట్ విషయం తనకు తెలియదని.. తనకు వచ్చిన ఒక ఫేక్ కాల్ గురించి తెలుసుకునేందుకే ఠాణాకు వచ్చానని ఆమె మీడియాకు చెప్పారు. అయితే.. జానీ మాస్టర్ అరెస్టు గురించి పోలీసులు ఆయన భార్యకు సమాచారం ఇచ్చి, పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు తీసుకుని పంపించినట్లు సమాచారం.

పిల్లలకు నిమ్స్‌లో ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

- యూకే వైద్య బృందం ఆధ్వర్యంలో 22 నుంచి శిబిరం
- 15 ఏళ్ల లోపు వారికి ఉచితం..80 మంది పేర్లు నమోదు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 15 ఏళ్ల లోపు చిన్నారులకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి అండగా నిలుస్తుంది. హృదయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఒక రోజు నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు నిమ్స్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నారు. డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలోని యూకే వైద్య బృందం, నిమ్స్ వైద్యులతో కలిసి ఈ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుంది. ఆదివారం(22వ తేదీ) నుంచి 28వ తేదీ వరకు వారం రోజులపాటు ఈ ప్రత్యేక శిబిరం జరగనుంది. ఈ శిబిరంలో వైద్యం చేయించుకునేందుకు ఇప్పటికే 80 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఆయా చిన్నారులను వైద్యులు పరీక్షించి శస్త్ర చికిత్స తేదీ నిర్ణయించి ఆ ప్రకారం చికిత్స నిర్వహిస్తారు. ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి కోరారు. కాగా, యూకే బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన గత శిబిరంలో 180 మందికి శస్త్ర చికిత్సలు చేశామని నిమ్స్ కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేశ్వరరావు చెప్పారు.

హైకోర్టులో డీసీ ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చారని పేర్కొంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చేసిన ఫిర్యాదుతో తనపై నమోదైన క్రిమినల్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ నందగిరి సుదాన్స్ హైకోర్టులో పిటిషన్ వేశారు. హైడ్రా ఫిర్యాదుతో పెట్టిన కేసుకు, తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఉల్లంఘనలు జరిగిన సమయంలో తాను చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా లేనని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థినులకు విప్రో స్కాలర్‌షిప్

పదోతరగతి, ఇంటర్ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ప్రస్తుతం ఫుల్‌టైం డిగ్రీ చదువుతున్న విద్యార్థినులకు విప్రో కన్జ్యూమర్ కేర్ 9వ ఎడిషన్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విప్రో కన్జ్యూమర్ కేర్ గ్లోబల్ హెడ్ నారాయణ్, విప్రో కన్జ్యూమర్ కేర్ అండ్ లైటింగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీరజ్ ఖత్రి వివరాలు ప్రకటించారు. ఈసారి 1500 మందికి ఉపకార వేతనాలు అందిస్తామని ప్రకటించారు. ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేసి ఏడాదికి రూ. 24వేల చొప్పున అందిస్తామన్నారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్, సైన్స్ ఆసక్తిగలవారు ఈనెల 30లోపు సంతూర్ స్కాలర్‌షిప్స్ డాట్ కాం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రైల్వే, టెలికాం, డిఫెన్స్ సర్వీస్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

మొత్తం **232** పోస్టులు

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్



సివిల్ ఇంజనీరింగ్

• గ్రూప్- ఎ సర్వీసెస్/పోస్టులు

1. సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్(సివిల్)
2. సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్(రోడ్స్), గ్రూప్-ఎ(సివిల్ ఇంజనీరింగ్ పోస్టులు)
3. సర్వే ఆఫ్ ఇండియా గ్రూప్- ఎ సర్వీస్
4. ఏఈఈ(సివిల్) ఇన్ బోర్డర్ రోడ్స్ ఇంజనీరింగ్ సర్వీస్
5. ఇండియన్ డిఫెన్స్ సర్వీస్ ఆఫ్ ఇంజనీర్స్
6. ఏఈఈ(క్యూఎస్అండ్‌సి) ఇన్ ఎంఈఎస్ సర్వే ఆఫ్ క్యాడర్
7. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్
8. సెంట్రల్ వాటర్ ఇంజనీరింగ్(గ్రూప్ ఎ) సర్వీస్



మెకానికల్ ఇంజనీరింగ్

• గ్రూప్- ఏ/బి సర్వీసెస్/పోస్టులు

1. ఇండియన్ డిఫెన్స్ సర్వీస్ ఇంజనీర్స్
2. ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్(మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
3. సెంట్రల్ పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ గ్రూప్-ఎ(మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
4. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీసెస్/ఎస్ఎస్ఓ-2(మెకానికల్)
5. ఏఈఈ(ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్) ఇన్ బోర్డర్ రోడ్స్ ఇంజనీరింగ్ సర్వీస్
6. ఇండియన్ నేవల్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ సర్వీస్(మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
7. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్



ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

• గ్రూప్- ఏ/బి సర్వీసెస్/పోస్టులు

1. ఇండియన్ డిఫెన్స్ సర్వీస్ ఆఫ్ ఇంజనీర్
2. ఇండియన్ నేవల్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ సర్వీస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
3. ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
4. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీసెస్/ఎస్ఎస్ఓ-2(ఎలక్ట్రికల్)
5. సెంట్రల్ పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ గ్రూప్-ఎ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పోస్టులు)
6. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్
7. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-1(ఐఈడీఎస్) ఎలక్ట్రికల్ ట్రేడ్
8. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-2(ఐఈడీఎస్) ఎలక్ట్రికల్ ట్రేడ్



ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్

• గ్రూప్- ఏ/బి సర్వీసెస్/పోస్టులు

1. ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీస్ గ్రూప్-ఎ
2. సెంట్రల్ పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ గ్రూప్-ఎ(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ పోస్టులు)
3. ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ పోస్టులు)
4. ఇండియన్ నేవల్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ సర్వీస్(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికాం ఇంజనీరింగ్ పోస్టులు)
5. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీస్/ఎస్ఎస్ఓ-2
6. ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్
7. ఇండియన్ రేడియో రెగ్యులేటరీ సర్వీస్ గ్రూప్-ఎ
8. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-1(ఐఈడీఎస్) ఎలక్ట్రానిక్స్ ట్రేడ్
9. ఐఈడీఎస్/అసిస్టెంట్ డైరెక్టరేట్ గ్రేడ్-2(ఐఈడీఎస్) ఎలక్ట్రానిక్స్ ట్రేడ్

అర్హతలు: పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, బీఈ/బీటెక్ చదివి ఉండాలి. లేదా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) ఇన్‌స్టిట్యూట్ ఎగ్జామినేషన్స్ ఎ, బి విభాగాలు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అసోసియేట్ మెంబర్‌షిప్ ఎగ్జామినేషన్ పార్ట్స్ 2, 3/సెక్షన్లు ఎ, బి అర్హత సాధించాలి. లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూషన్(ఇండియా) గ్రాడ్యుయేట్ సభ్యత్వ పరీక్ష పాసై ఉండాలి. లేదా ఎమ్మెస్సీ(వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్స్, రేడియో ఫిజిక్స్, రేడియో ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2025 జనవరి 1 నాటికి 21-30 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి. అభ్యర్థులు ముందుగా పార్ట్-1, పార్ట్-2 అప్లికేషన్ పూర్తి చేయాలి.

ఎంపిక విధానం: స్టేజ్-1(ప్రిలిమినరీ/స్టేజ్-1) ఎగ్జామ్, స్టేజ్-2(మెయిన్/స్టేజ్-2) ఎగ్జామ్, స్టేజ్-3(పర్సనాలిటీ టెస్ట్), మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ/స్టేజ్-1: పరీక్షలో రెండు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నపత్రాలు ఉంటాయి. మొత్తం 500 మార్కులు(పేపర్-1 - 200 మార్కులు; పేపర్-2-300 మార్కులు) ఉంటాయి.

మెయిన్/స్టేజ్-2: ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండు పేపర్లు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. మొత్తం 600 మార్కులు(ప్రతి పేపర్‌లో 300 మార్కులు) కేటాయించారు.

దరఖాస్తు ఫీజు: మహిళ/ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఇతరులు రూ.200 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి


తెలుగు రాష్ట్రాల్లో మెయిన్ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 8

ప్రిలిమినరీ/స్టేజ్-1 పరీక్ష తేదీ: 2025 ఫిబ్రవరి 9

వెబ్‌సైట్: https://upsc.gov.in/

UPSC



ఐఐఎం రాయ్‌పూర్‌లో డిజిటల్ సైన్సెస్ కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) రాయ్‌పూర్, నాలుగో బ్యాచ్ డిజిటల్ హెల్త్ ప్రోగ్రామ్స్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. తరగతులు నవంబరు మొదటి వారంలో ప్రారంభం కానున్నాయి. నిర్దిష్ట ప్రమాణాలు గల ప్రొఫెషనల్స్, గ్రాడ్యుయేట్లకు ఈ కోర్సులను ఉద్దేశించారు. అకాడమీ ఆఫ్ డిజిటల్ హెల్త్ సహకారంతో ఐఐఎం రాయ్‌పూర్ ఈ ప్రోగ్రామ్స్‌ని నిర్వహిస్తోంది. స్విట్జర్లాండ్‌లోని ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ టెలీ మెడిసిన్ అండ్ ఈ-హెల్త్, ద యురోపియన్ కనెక్టెడ్ హెల్త్ అలయెన్స్ సంస్థలు కోర్సులను గుర్తించాయి. ప్రవేశానికి రిజిస్ట్రేషన్స్ కొనసాగుతున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు iimraipur.ac.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రోగ్రామ్స్ వివరాలు

1. పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ డిజిటల్ హెల్త్(పీజీసీపీడీహెచ్)-వ్యవధి ఏడాది
2. డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజిటల్ హెల్త్(డీపీడీహెచ్)-వ్యవధి ఏడాది.

అర్హత: పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లో చేరాలనుకునే వారు సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు రెండు సంవత్సరాల పని అనుభవం ఉండాలి. డాక్టర్స్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్, హెల్త్‌కేర్ సెక్టార్‌లో పనిచేస్తున్న మేనేజర్లు, పారామెడిక్స్ అండ్ అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్, హెల్త్ కేర్ ఐటీ ప్రొఫెషనల్స్, మెడ్-టెక్ ప్రొఫెషనల్స్, ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, క్లినికల్ ఇన్ఫర్మాటిక్స్ ప్రొఫెషనల్స్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ అకడమీషియన్స్ అండ్ రీసెర్చర్స్, హెల్త్‌కేర్ కన్సల్టెంట్స్/అడ్వైజర్స్, హెల్త్ కేర్ పాలసీ మేకర్స్, పబ్లిక్ సెక్టార్ లీడర్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హెడ్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్ హెడ్స్ ప్రవేశాలకు అర్హులు.

వయసు: 2024 ఫిబ్రవరి నాటికి 25 నిండి ఉన్న వారు డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజిటల్ హెల్త్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రొఫెషనల్ డిగ్రీలు ఉన్న అభ్యర్థులకు పై రెండు కోర్సుల్లో ప్రవేశానికి పయోనిబంధనల నుంచి సడలింపు లభిస్తుంది.

కరికులమ్

దీనిని మూడు విభాగాలుగా రూపొందించారు.

బేసిక్ లెవల్: థియోరటికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ డిజిటల్ హెల్త్.

అడ్వాన్స్‌డ్ లెవల్: టెక్నలాజికల్ అండ్ మేనేజ్‌మెంట్ యాస్పెక్ట్స్ ఆఫ్ డిజిటల్ హెల్త్.

ప్రొఫెషనల్ లెవల్: అప్లికేషన్ యాస్పెక్ట్స్ ఆఫ్ డిజిటల్ హెల్త్ విత్ ద యూజ్ ఆఫ్ కేసెస్. మెడికల్ అండ్ టెక్నాలజీస్ ఏరియాస్, టెలిమెడిసిన్, డేటా అనలిటిక్స్, డిజిటల్ హెల్త్ పాలసీస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ వంటి కీలక అంశాలతో కరికులమ్‌ను రూపొందించారు.

రిలయన్స్ ఫౌండేషన్-డిగ్రీ చదువుతున్న అభ్యర్థులకు ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 5000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. స్కాలర్‌షిప్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి రూ.రెండు లక్షలు ఇస్తారు. అభ్యర్థులు ఈ మొత్తాన్ని ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ల్యాప్‌టాప్ కొనుగోలు, అకడమిక్ బుక్స్ కొనుగోలు నిమిత్తం వినియోగించుకోవచ్చు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

రిలయన్స్ ఫౌండేషన్ యూజీ స్కాలర్‌షిప్



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో మూడేళ్లు/అంతకన్నా ఎక్కువ వ్యవధిగల ఏదేని రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.15 లక్షలకు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. వివాహితులు కూడా అర్హులే.

• ఆన్‌లైన్/రిమోట్/డిస్టెన్స్/నాన్ రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో చేరినవారు; ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న వారు; విదేశాల్లో చదివినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో వెర్బల్ ఎబిలిటీ, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం గంట. అభ్యర్థి సాధించిన స్కోర్‌ను వెంటనే సంస్థకు పంపుతారు. అభ్యర్థులకు తెలపరు. ఈ టెస్ట్ రాస్తేనే దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటారు. ప్రాక్టీస్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఈ టెస్ట్‌ను ఒకసారి మాత్రమే రాయడానికి వీలుంది.

➡ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 6

➡ **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, అడ్రస్ ప్రూఫ్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, డిగ్రీ అడ్మిషన్ లెటర్, కుటుంబ వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం, వైకల్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రం

➡ **వెబ్‌సైట్:** www.scholarships.reliancefoundation.org

జాబ్ కార్నర్

అప్రెంటిస్‌లు

ఈసీఐఎల్‌లో..

ఖాళీలు **437**

హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)...కింద పేర్కొన్న అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఎలక్ట్రానిక్స్ మెకానిక్ - 162
2. ఎలక్ట్రీషియన్ - 70
3. ఫిట్టర్ - 70
4. మెకానిక్(ఆర్అండ్ ఏసీ)- 17
5. టర్నర్ - 17
6. మెషినిస్ట్ - 17
7. మెషినిస్ట్(గ్రైండర్) - 13
8. సీఓపీఏ - 45
9. వెల్డర్ - 22
10. పెయింటర్ - 4

వయోపరిమితి: 2024 అక్టోబరు 31 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

అర్హత: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత

శిక్షణ కాలం: ఏడాది

ఎంపిక విధానం: ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

డాక్యుమెంట్ వెరిఫికేషన్ స్థలం: ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కార్పొరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, నలంద కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్, హైదరాబాద్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

ధ్రువపత్రాల పరిశీలన తేదీలు: అక్టోబరు 7 నుంచి నవంబరు 9 వరకు

ప్రవేశానికి గడువు తేదీ: అక్టోబరు 30

అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రారంభం: నవంబరు 1

వెబ్‌సైట్: https://www.ecil.co.in/jobs.html

డీఆర్‌డీవో ఐటీఆర్‌లో...

ఖాళీలు **54**

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ)కు చెందిన ఒడిశా రాష్ట్రం చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్)... వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(30)
2. టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్(24)

విభాగాలు: మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎంబెడెడ్ సిస్టమ్, అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్, సేఫ్టీ తదితరాలు.


అర్హత: ఖాళీలను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, బీబీఏ/బీకామ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

అప్రెంటిస్ కాలం: ఒక సంవత్సరం

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9,000; డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,000.

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/



బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ఖాళీలు **8**

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

పని ప్రదేశాలు: విశాఖపట్నం, ముంబయి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

చివరి తేదీ: అక్టోబరు 9

వెబ్‌సైట్: https://bel-india.in/

ఐఎస్ఐలో ఫ్యాకల్టీ

ఖాళీలు **24**

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్... కింద పేర్కొన్న టీచింగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

• ప్రొఫెసర్
• అసోసియేట్ ప్రొఫెసర్
• అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1
• అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2

అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు 45 ఏళ్లు; అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టులకు 35 ఏళ్ల మించకూడదు.

ఎంపిక విధానం: అప్లికేషన్స్ స్క్రీనింగ్, ప్రజెంటేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: దరఖాస్తులు డైరెక్టర్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ 203 బి.టి రోడ్, కోల్‌కతా చిరునామాకు పంపించాలి.

చివరి తేదీ: అక్టోబరు 31

వెబ్‌సైట్: www.isical.ac.in/

లిటిల్స్

తగిన శాస్తి

రామాపురంలో క్రిష్ణయ్య అనే యువకుడు ఉండేవాడు. అతను ఎంతో తెలివైన వాడు ఇంకా సహనవంతుడు కానీ చాలా దురాశా పరుడు ఒక రోజు ఆ ఊరిలో రామనాథంఅనే వ్యాపారి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిఇంది.ప్రాణ నష్టం ఏమీ లేకున్నా, ఇంటి లోపలి విలువైన వస్తువులు కాలి, బూడిదవుతున్నాయి. ఇంతలో అక్కడికి వచ్చిన రామనాథం వ్యాపారానికి కావలసిన డబ్బు నాలుగు లక్షలు లోపల పెట్టాను అది కూడా బూడిద ఐతే ఎలా అని పెద్దపెట్టున ఏడవ సాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన క్రిష్ణయ్య రామనాథం గారూ మీ డబ్బు లోపలినుండి నేను క్షేమంగా తెచ్చి ఇస్తాను.కానీ తెచ్చిన డబ్బులో నాకు ఇష్టమైనది మీకు ఇచ్చి మిగతాది నేను తీసుకుంటాను. సరేనా? అన్నాడు. దానికి సరే అన్నాడు రామనాథం. అపుడు క్రిష్ణయ్యఎంతో ధైర్యంగా లోపలికి వెళ్లి



డబ్బుమూట బయటకు తెచ్చాడుకానీ, తెచ్చిన సొమ్ములో వంద రూపాయలు మాత్రం రామనాథానికి ఇచ్చి, మిగతాడబ్బు మొత్తం తన సంచీలో వేసుకుని, వెళ్లబోయాడు. ఇది అన్యాయం అనిక్రిష్ణయ్యను ఆపాడు రామనాథం. 'నేను చెప్పినట్లే కదా చేశాను ఇంకేం అన్యాయం'అన్నాడు క్రిష్ణయ్య. విషయం పంచాయితీ దాకా వెళ్లింది, పంచాయితీ పెద్ద కేశవరావు జరిగినదంతా విని, క్రిష్ణయ్యతో ఇలా అన్నాడు.' క్రిష్ణయ్యా ఆ డబ్బుమూట మరియు వంద రూపాయలు చెరోవైపున 'పెట్టు' అన్నాడు. అలాగే చేశాడు క్రిష్ణయ్య. ఇపుడు చెప్పు క్రిష్ణయ్యా ఈ రెండిటిలో నీకు ఇష్టమైనది ఆ పెద్ద డబ్బు మూటనే కదా అని అడిగాడు. అవును అని జవాబు చెప్పాడు క్రిష్ణయ్య. 'నువ్వు నీకు ఇష్టమైన రామనాథానికి ఇస్తాను అని కదా అన్నావు? కాబట్టి మారు మాట్లాడకుండా ఆ డబ్బు మూట అతనికి ఇచ్చేసి, అతను సంతోషంగా ఎంత ఇస్తే అంత పుచ్చుకో' అన్నాడు కేశవరావు దాని కి క్రిష్ణయ్య నా ఉద్దేశం అది కాదు నాకు ఇష్టమైనది అంటే నాకు నచ్చినంత అని అర్థం అన్నాడు దానికి కేశవరావు 'నీ ఉద్దేశం మంచిదైతే ఈగొడవే లేదు కదా. నువ్వు తెలివైనవాడివి.. కానీ ఈ దురాశ మంచిది కాదు మానుకో' అని హితవు చెప్పి, అతన్ని అక్కడినుండి పంపేశాడు పంచాయితీ పెద్ద. అతని దురాశకు తగిన శాస్తి జరిగిందని అందరూ అనుకున్నారు.

8 తేడాలను కనిపెట్టండి





సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 414

2						
		5		8		
1			6		9	
	9			1		
4			7		2	
8				3		

సుడోకు - 413 సమాధానం

1	3	7	4	5
4	9	5	6	8
2	6	8	3	7
3	8	2	1	9
5	7	9	8	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.